



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 123 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 15 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 123 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 15 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# యుద్ధం వేళ.. ప్రజల్లో భయం పుట్టిస్తున్నారు



## కాంగ్రెస్‌పై మోదీ ధ్వజం

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం మనపై ఉందని, ఒక విధంగా యుద్ధం లాంటి పరిస్థితి కనిపిస్తోందని, ఇలాంటి తరుణంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ దేశంలో, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. అసోంలోని సిల్చార్‌లో ప్రధానమంత్రి


- మిగతా2లో

## రెండు ఎల్పీజీ నౌకలు హోర్ముజ్‌ను దాటాయి...

# వంటగ్యాస్‌కు ఇబ్బంది లేదు

**పెన్ పవర్ డెస్క్:**భారతదేశ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ నౌకలు శనివారం సురక్షితంగా హోర్ముజ్ జలసంధిని దాటాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఈ జలసంధిని ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే. దీనితో హోర్ముజ్‌కు ఇరువైపుల వందలాది నౌకలు నిలిచిపోయాయి. భారత ప్రభుత్వం సంప్రదింపుల నేపథ్యంలో, భారత జెండాలు కలిగిన నౌకలు వెళ్లడానికి ఇరాన్ అంగీకరించింది. ఈ క్రమంలో రెండు నౌకలు హోర్ముజ్‌ను దాటాయి. శివాలిక్, నందాదేవి పేరు గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వ

- మిగతా7లో





## 2011 నాటి ఫొటోతో గ్యాస్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో ఇంధన కొరతపై కాంగ్రెస్ పార్టీ అనవసర భయాందోళనలు సృష్టిస్తోందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా విమర్శించారు. పాత ఫోటోలను అడ్డుపెట్టుకుని ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తోందని

- మిగతా2లో



## యూఏఈలో అతిపెద్ద టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్ దాడి

**పెన్ పవర్ డెస్క్:**యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏ ఈ)లో అతిపెద్ద ఇంధన నిల్వల కేంద్రమై న పుజైరా ఓడరేవుపై ఇరాన్ డ్రోన్‌లతో దాడి చేసింది. దీంతో ఇక్కడ తీవ్ర

- మిగతా2లో

## ట్రిపుల్ ఆర్ చుట్టూ రీజినల్ రింగ్ రైల్ ..

# సర్వేకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- హైదరాబాద్ చుట్టూ ప్రతిపాదిత ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టులో కీలక ముందడుగు
- డీపీఆర్ తయారీ కోసం సర్వేకు కేంద్రం అనుమతి
- ఆర్ఆర్ఆర్ వెంట రైల్వే లైన్ అలైన్మెంట్ ఖరారు చేసే ప్రక్రియ
- డీపీఆర్ తర్వాత నీతి ఆయోగ్, కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం




**హైదరాబాద్ పెన్ పవర్:** నగరం చుట్టూ ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ట్రిపుల్ ఆర్‌ను అనుసరిస్తూ.. రీజిన ల్ రింగ్ రైల్ ప్రాజెక్టు చేపట్టేందుకు కేంద్ర సిద్ధమైంది. ఈ మేరకు డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారీ కోసం అవసరమైన సర్వే నిర్వహిం చేందుకు అనుమతులు మంజూరు చేసింది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లోక్ సభ రూల్ 377 కింద లేవ నెత్తిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిం చారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం తో సంప్రదింపులు జరుపుతూ రీజినల్ రింగ్ రోడ్ వెంట రైల్వే లైన్ అలైన్ మెంట్ ను ఖరారు చేసే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. డీపీఆర్ సిద్ధమైన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరిపి తదుపరి చర్యలు చేపడతారు. అనంతరం నీతి ఆయోగ్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖల ఆమోదం పొందిన తర్వాత ప్రాజెక్టుకు తుది అనుమతులు లభిస్తాయి. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లాల మధ్య రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా పెద్ద ఊతం లభించనుందని అధికారులు భావిస్తున్నారు.

## ప్రతి జిల్లాకు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ..

### రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ సాగు చేయండి: మంత్రి తుమ్మల



- రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ సాగుచేయాలి
- రైతులు క్రాప్ డైవర్షన్ వైపు మారాలి లేకపోతే రైతులకు నష్టం జరుగుతుంది
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:**రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ సాగుచేయాలన్నారు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు. రైతులు క్రాప్ డైవర్షన్ వైపు మారాలని లేకపోతే రైతులకు నష్టం జరుగుతుందన్నారు . సిద్ధిపేట జిల్లా నర్మేటట్టలో మార్చి 22న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మంత్రి పొన్నంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి తుమ్మల.. 'తెలంగాణకు సిద్దిపేట కేంద్రంగా ఉంటుంది అందుకే ఇక్కడ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం మొదలు పెట్టాం. ఇక్కడ రూ. 40 కోట్లతో రిఫైనరీ ఆయిల్ యూనిట్

- మిగతా2లో

## తమ్మినేనికి తీవ్ర అస్వస్థత..

- గచ్చిబౌలి ఏఐజీ హాస్పిటల్‌లో చేరిక
- గుండె జబ్బుతో ఇబ్బందిపడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు
- పరామర్శించిన బీవీ రాఘవులు




**హైదరాబాద్ పెన్ పవర్:** సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత నాలుగు రోజులుగా గుండె జబ్బుతో బా ధపడుతూ గచ్చిబౌలి ఏఐజీ హాస్పిటల్లో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఊపిరితిత్తుల్లో నీరు, తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. శనివారం (మార్చి 14) పార్టీ పొలి ట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు,

- మిగతా2లో


## బండి సంజయ్ పాదయాత్రలో...

### డ్రోన్ తగిలి తేనెటీగల దాడి

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పాదయాత్ర సందర్భంగా తేనెటీగలు దాడి చేశాయి. 'అంజన్న ఆశీర్వాద యాత్ర' పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు చేపట్టిన పాదయాత్రలో బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రామడుగు మండలం కోన్‌రావుపేట సమీపంలో పాదయాత్ర

- మిగతా2లో



## తెలంగాణ రాష్ట్రంలో ఆల్‌టైమ్ గరిష్ఠానికి విద్యుత్ వినియోగం

**హైదరాబాద్ పెన్ పవర్:**:తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో ఈ నెల 13వ తేదీన 341 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. దీనితో తెలంగాణలో వినియోగం ఆల్ టైమ్ గరిష్ఠానికి చేరుకుంది. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికం కావడం, వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం పెరగడంతో రాష్ట్రంలో

- మిగతా2లో

## త్వరలో భారత్‌కు వస్తా

### మోదీపై మరోసారి ప్రేమ కురిపించిన ట్రంప్..



**పెన్ పవర్ డెస్క్:**భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారు. భారత్, భారత ప్రజల పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తూ, త్వరలోనే దేశంలో పర్యటించే అవకాశం ఉందని సూచనప్రాయంగా తెలిపారు. ఇవాళ జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ 2026 సదస్సులో

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# అసమాన ప్రతిభుడు రాళ్ళబండి

తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించిన ప్రసిద్ధ సాహితీవేత్త, అవధాన చక్రవర్తి రాళ్ళబండి కవితా ప్రసాద్. ఒకవైపు ఉద్యోగ రంగంలో సమర్థ అధికారిగా పేరు తెచ్చుకుంటూనే, మరో వైపు కవితా క్షేత్రంలో అందెవేసిన చేయిగా, అవధాన ప్రక్రియలో అసమాన ప్రతిభునిగా, నిర్విరామ సాధనలో సాటిలేని మేటిగా వినుతికెక్కిన నిరంతర కృషీవలుడు రాళ్ళబండి. అవధాన విద్యలో పరిపూర్ణత్వం కోసం అంకిత భావంతో చిత్తశుద్ధితో ధృఢ సంకల్పంతో శ్రమించి సిద్ధి పొందిన తాపసి ఆయన. కవిత్వం పట్ల మోజుతో తన పేరును తల్లిదండ్రులు పెట్టిన వేంకటేశ్వర ప్రసాద్ పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్న కవితాభిమాని కవితా ప్రసాద్.సాంప్రదాయ అవధానానికి ఆధునిక పోకడలను నేర్పిన రాళ్ళబండి కవితా ప్రసాద్ కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం నెమలిలో 1961 మే 21న జన్మించారు. కవితా ప్రసాద్ నెమలిలో పదవ తరగతి వరకు చదివారు. తండ్రి కోటేశ్వరరాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తరచూ బదిలీ అయ్యేవారు. ఆ క్రమంలో సత్తుపల్లిలో కవితా ప్రసాద్ డిగ్రీ చేశారు. అవధాన విద్య ఆరంభ వికాసాలపై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. అనంతర కాలంలో ఇదే యునివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ పొందారు. కవితాప్రసాద్ చిన్నప్పటి నుంచే సాంస్కృతిక రంగం పట్ల ఆసక్తి కనబరిచారు. అవధాన విద్య పట్ల మక్కువ పెంచుకొని జీవితకాలం ఆ ప్రక్రియలో రాణించారు. దాదాపు 500కి పైగా అవధాన సభలను ఆయన నిర్వహించారు. అష్టావధానం, శతావధానం, ద్విశతావధానం, నవరసావధానం, తదితర విశిష్టమైన, అతి క్లిష్టమైన దశలను సమర్థంగా పరిచయం తెలుగు సాహితీ లోకానికి చేశారు. తెలుగు నేలపై గుబాళించిన ఈ ప్రాచీన సాహితీ ప్రక్రియలను ఎల్లలు దాటించారు. అమెరికాలోని తెలుగు భాషా, సాహితీ ప్రియులు ఆయన కోసం ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశారు. ఈ కృషిలో కొంత ఆయన జీవితకాలం లోనే గ్రంథస్థం అయింది. అలా ఒంటరి పూలబుట్ట, పద్మ మంటపం, అగ్నిహింస, ఇది కవి సమయం తదితర సంపుటులను వెలువరించారు. ఆధునిక నృత్య రూపక ప్రక్రియలో పంచకన్య, పంచకావ్యాలను రచించారు. ఈ రూపకాలను 24 గంటల్లోనే సిద్ధం చేసి ప్రముఖ నృత్య కారిణి మంజు భార్గవితో ప్రదర్శింప జేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. కవితాప్రసాద్ కృష్ణా జిల్లా, గంపలగూడెం మండలం, నెమలి గ్రామంలో 1961, మే 21వ తేదీన జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు వేంకటేశ్వర ప్రసాదరాజు. కవిత్వం పట్ల మోజుతో తన పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్నారు. తండ్రి కోటేశ్వర రాజు తెలుగు పండితులు. తల్లి పేరు రత్నవర్ధనమ్మ. సత్తుపల్లిలో గణితశాస్త్రం ఐచ్ఛిక అంశంగా పట్టభద్రులయ్యారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో అవధాన విద్యపై మసన చెన్నప్ప పర్యవేక్షణలో పి.హెచ్.డి. చేశారు. కవితా ప్రసాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చాలా తక్కువ మంది చేసే అవధాన విద్య మీద పి.హెచ్.డి పూర్తిచేశారు. ఒక పక్క గ్రూప్ 1 ప్రభుత్వ అధికారిగా ఉద్యోగం చేస్తూనే... మరోపక్క తనకెంతో ఇష్టమైన తెలుగు సాహిత్యంలో శిఖరాలను అందుకున్నారు. ఆశించిన గమ్యాన్ని చేరుకున్నారు. ఆయన 500కు పైగా అవధానాలను నిర్వహించారు. వాటిలో అష్టావధానాలతో పాటుగా శతావధానాలు, ద్విశతావధానాలు ఉన్నాయి. సంప్రదాయ అవధానంతో పాటు కథ, వచన కవిత, గణితం వంటి అనేక ప్రక్రియలను అవధానంలో చొప్పించారు.ఒక సందర్భంలో 25 నిమిషాలలో విచిత్ర అష్టావధానం చేసి అసమాన ప్రతిభను ప్రదర్శించారు. పండితుల మెప్పు పొందారు. వరంగల్ లోని భద్రకాళి దేవాలయంలో ఏకదిన శతకరచన ధార అనే కార్యక్రమాన్ని చేపట్టి ఒకే రోజులో ఆశువుగా శతకాన్ని చెప్పారు. ఆశుకవితా ఝురి పేరుతో గంటకు 500 పద్యాలు ఆశువుగా చెప్పి ఔరా అనిపించు కున్నారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1 అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖలో వివిధ రకాల సేవలను అందించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖలో సుదీర్ఘ కాలం సాంస్కృతిక విభాగంలో అనేక హోదాల్లో సేవలు అందించారు. రెండు పర్యాయాలు సంచాలకులుగా పనిచేశారు. ఆయన పర్యవేక్షణలో నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు తిరుపతిలో జరిగాయి. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శిగా ఆయన పనిచేశారు. ఆ కాలంలో 'సప్తగీతధామ', 'కవిసార్వభౌమ' పేరిట వేంకటేశ్వర సంకీర్తనలను రచించి సీడీ రూపంలో అందించారు. దాదాపు పాతికేళ్ల తరువాత ప్రతిష్టాత్మకంగా జరిగిన మహాసభలకు సమన్వయ కర్తగా వ్యవహరించారు. నాటి రాష్ట్ర మంత్రి కడియం శ్రీహరి వద్ద పీయస్ గా బాధ్యతలు నిర్వర్తించారు. కవితా ప్రసాద్ 2015 మార్చి 15న హైదరాబాదులో హృద్రోగంతో మరణించారు.

# ప్రతి జిల్లాకు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ..

- మొదటి పేజీ తరువాయి

కూడా ప్రారంభిస్తాం. రైతులు పండించిన వేస్టేజ్ గెలలతో విద్యుత్ తయారు చేస్తాం. కేంద్రం వరి ధాన్యం కొనబోమని చెబుతోంది. రబీలో కూడా అత్యధికంగా మనమే వరి పండిస్తున్నాం. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతో ఎక్కువ సాగు చేస్తున్నారు. నా వరి పొలంలో కూడా ఆయిల్ పామ్ సాగు చేస్తున్నా. ఇక్కడ ఉన్న బాలకృష్ణ దళిత రైతు ధైర్యంతో ఆయిల్ పామ్ సాగు చేసి లాభాలు పొందుతున్నారు. ప్రతి రైతు ఆయిల్ ఫామ్ సాగు చేయాలి... సాగు కావాల్సిన అన్ని సబ్సిడీ ప్రభుత్వం మీకు ఇస్తుంది. నేను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు రూ. 12 వేలకు టన్ను ఉంటే... కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చే ఇప్పుడు రూ.21 వేలకు టన్ను చేశాం. రైతులను కష్టాల నుంచి తప్పించాల న్న.. గ్రామాలు పచ్చగా ఉండాలన్నా హార్టికల్చర్ క్రాప్స్ వేయాలి. నేను నా సొంత పొలంలో వక్క సాగు చేస్తున్న... ఆయిల్ పామ్ సాగు లో ఇంటర్ క్రాప్ పంటలకు కూడా సబ్సిడీ ఇస్తాం. 30 జిల్లాలో పా మ్ ఆయిల్ ప్లాంటేషన్ జరుగుతుంది . రైతులకు ఎలాంటి ఇబ్బంది లేని పంట పామ్ ఆయిల్ . తెలంగాణలోని అన్ని జిల్లాల రైతులను ఇక్కడికి పిలుస్తాం. వారికి కావాల్సిన స్టాల్స్ అన్ని పెడతాం' అని అన్నారు.

**ప్రతి జిల్లాకు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ: మంత్రి పొన్నం**

ఈ మధ్య గుజరాత్ వెళ్లినప్పుడు అక్కడ పాల సేకరణ గ్రామీణ స్థాయి నుండి జరుగుతుంది..అక్కడ అమూల్ పాలు దేశ వ్యాప్తంగా వ్యాపించాయి. ఇక్కడ ఆయిల్ పామ్ ఆయిల్ తుమ్మల నాగేశ్వరరావు స్టార్ట్ చేశారు.. ప్రతి జిల్లాలకు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించాలని బావిస్తున్నాం. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ గతంలో ప్రతిపాదనలు జరిగినప్పటికీ 300 కోట్లు కేటాయించి తుమ్మల నాగేశ్వరరావు పనులు పూర్తి చేయించారు. ఈ ప్రాంత రైతాంగానికి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ప్రాంత రైతులు ఆయిల్ ఫామ్ పై దృష్టి సారించాలి..మా ప్రాంతంలో ఆయిల్ ఫామ్ పంట పండదు అనే అపోహ నుండి తుమ్మల బయటకు తీసుకొచ్చారు. ఇక్కడి రైతులు ఆయిల్ ఫామ్ పై ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలనీ ఈ ప్రాంత రైతులను కోరుతున్నా అని పొన్నం అన్నారు.

## రెండు ఎల్పీజీ నౌకలు హార్ముజ్‌ను దాటాయి...

# వంటగ్యాస్‌కు ఇబ్బంది లేదు

- మొదటి పేజీ తరువాయి

శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. ఈ నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉందని, మార్చి 16 లేదా 17వ తేదీన ఇవి భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

**వంట గ్యాస్ విషయంలో ఇబ్బంది లేదు**

గృహ వినియోగదారులకు వంట గ్యాస్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని కేంద్రం హామీ ఇచ్చింది. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించింది. అవసరం లేకున్నా చాలామంది ఆందోళనతో బుకింగ్ చేస్తున్నారని, అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని కోరింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని రాష్ట్రాలని కోరినట్లు కేంద్రం తెలిపింది. ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది.

వాణిజ్య సిలిండర్ల కొరతపై కూడా కేంద్రం స్పందించింది. ప్రాధాన్యత క్రమంలో వాణిజ్య సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపింది. ఎల్పీజీని అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎల్పీజీ సరఫరాలో గృహాలు, ఆసుపత్రులు, హాస్టళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపింది. బుకింగ్ కోసం గ్రామాల్లో 45 రోజులు, పట్టణాల్లో 25 రోజుల కనీస గడువు ఉందని గుర్తు చేసింది.

గల్ఫ్‌లో ఉండిపోయిన

భారతీయ నౌకలు సురక్షితంగా ఉన్నాయని కేంద్రం తెలిపింది. అందులోని సిబ్బంది కూడా సురక్షితంగా ఉన్నట్లు వెల్లడించింది. హార్ముజ్ జలసంధి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపింది. నావికుల కుటుంబ సభ్యులకు సమాచారం ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని తెలిపింది.

## బండి సంజయ్ పాదయాత్రలో తేనెటీగల దాడి

- మొదటి పేజీ తరువాయి

దృశ్యాలను చిత్రీకరించేందుకు పలువురు అభిమానులు డ్రోన్ ఎగురవేశారు.అది పక్కనే ఉన్న చెట్టుకు ఉన్న తేనెతుట్టెకు తగిలింది. దీంతో తేనెటీగలు లేచి, పలువురు కార్యకర్తలపై దాడి చేశాయి. తేనెటీగల దాడితో కార్యకర్తలు భయాందోళనకు గురయ్యారు. తేనెటీగలు నలుగురు కార్యకర్తలపై దాడి చేశాయి. అప్రమత్తమైన బండి సంజయ్, ఆయన సిబ్బంది వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పాదయాత్రకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

అనంతరం వైద్యులు బండి సంజయ్‌కి రొటీన్ వైద్య పరీక్షలు చేశారు. ఆ తర్వాత పాదయాత్ర తిరిగి ప్రారంభమైంది. ఈ అంజన్న ఆశీర్వాద యాత్ర కరీంనగర్ నుంచి కొండగట్టు వరకు 40 కిలోమీటర్లు కొనసాగుతుంది. ఉదయం ప్రారంభమైన ఈ యాత్ర సాయంత్రానికి చేరుకుంటుంది.

## తమ్మినేనికి తీవ్ర అస్వస్థత..

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ, పార్టీ నాయకులు బి వెంకట్, టి సాగర్, ఎండీ అబ్బాస్, భూపాల్, ఆర్ వెంకట్రాములు, పి జయ లక్ష్మి హాస్పిటల్కు వెళ్లి పరామర్శించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నదనీ, రెండు రోజుల్లో కోలుకుంటార ని డాక్టర్లు తెలియజేశారు.

# త్వరలో భారత్‌కు వస్తా

- మొదటి పేజీ తరువాయి

ట్రంప్ పంపిన ఈ సందేశాన్ని అమెరికాకు చెందిన మితవాద కార్యకర్త, ట్రంప్ విధేయురాలు లారా లూమర్ చదివి వినిపించారు. ఈ సదస్సులో పాల్గొన్న లారా లూమర్, తాను వేదికపైకి రావడానికి సుమారు గంట ముందు అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడానని సభికులకు తెలిపారు. ఈ సందర్భంగా ట్రంప్ చెప్పిన మాటలను ఆమె యథాతథంగా వివరించారు. "నాకు ఇండియా అంటే చాలా ఇష్టం. నేను మోదీని ఎంతగానో ఇష్టపడతానని దయచేసి వారికి తెలియజేయండి. ప్రధాని మోదీ ఒక అద్భుతమైన నాయకుడు, నా మంచి స్నేహితుడు. త్వరలోనే మరో పర్యటన కోసం నేను కచ్చితంగా భారత్‌కు వస్తానని భారత ప్రజలకు చెప్పండి" అని ట్రంప్ తనతో అన్నట్లు లూమర్ పేర్కొన్నారు.అంతర్జాతీయ సంబంధాలు, ప్రపంచ రాజకీయాలపై చర్చ జరుగుతున్న ఈ సదస్సులో లూమర్ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ట్రంప్, మోదీ మధ్య ఉన్న బలమైన స్నేహబంధాన్ని ఈ సందేశం మరోసారి స్పష్టం చేసింది.

గతంలో అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ మధ్య ఉన్న స్నేహం ప్రపంచవ్యాప్తంగా పలుమార్లు చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ముఖ్యంగా 2020లో ట్రంప్ భారత పర్యటన సందర్భంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో లక్షలాది మంది ప్రజల మధ్య నిర్వహించిన 'నమస్తే ట్రంప్' కార్యక్రమం వారిద్దరి మధ్య ఉన్న వ్యక్తిగత బంధానికి నిదర్శనంగా నిలిచింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, వ్యూహాత్మక భాగస్వామ్యం వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకుంటూ ఇరువురు నేతలు పలు సందర్భాల్లో ఒకరిపై ఒకరు ప్రశంసలు కురిపించుకున్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో ఆల్‌టైమ్ గరిష్ఠానికి విద్యుత్ వినియోగం

- మొదటి పేజీ తరువాయి

రోజురోజుకీ విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

## యూఏఈలో అతిపెద్ద టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్ దాడి

- మొదటి పేజీ తరువాయి

మంట లు చెలరేగాయి. ఈ పుజైరా చమురు కేంద్రం ప్రపంచంలోనే పెద్దది కావడం గమనార్హం. ఇది హార్ముజ్ జలసంధికి వెలుపల ఉంటుంది. హార్ముజ్ జలసంధి మూసివేసినప్పటికీ ఈ పుజైరా ఇంధన నిల్వ కేంద్రం పోర్ట్ నుంచి చమురు ఎగుమతులు జరుగుంటాయి.ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి అనంతరం, కొన్ని గంటల్లోనే ఇరాన్ డ్రోన్ బాంబులతో విరుచుకుపడింది. ఈ దాడితో పుజైరాలో మంటలు, నల్లటి పొగ అలుముకుంది. అయితే ఇరాన్ డ్రోన్ తో దాడి జరపగా, ఆ డ్రోన్ ను పేల్చివేసినట్లు తెలుస్తోంది. ఈ డ్రోన్ శకలాలు పడిన ప్రాంతం నుంచి పొగలు వస్తున్నాయని స్థానిక అధికారులు చెబుతున్నారు.పుజైరా కీలక ఇంధన నిల్వ కేంద్రం కావడంతో ఇరాన్ దీనిని లక్ష్యంగా చేసుకుంది. పుజైరా ఆయిల్ డిపో, పోర్టుపై బాంబులు, మిస్సైళ్లతో దాడికి పాల్పడింది. దాడికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన యూఏఈ పుజైరా చమురు పోర్టును తాత్కాలికంగా మూసివేసింది. చమురు ఎగుమతులు, దిగుమతులను నిలిపివేసింది. గల్ఫ్ దేశాల చమురు ఎగుమతులు, దిగుమతులకు ఇది ప్రధాన కేంద్రం. పుజైరా చమురు పోర్టును మూసివేస్తే భారత్, చైనా, పాకిస్థాన్ సహా వివిధ దేశాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడే అవకాశం ఉంది.

# యుద్ధం వేళ.. ప్రజల్లో భయం పుట్టిస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

పర్యటించారు. ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో ఆందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఆ పార్టీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో భయాందోళనలు సృష్టించి తనను వేధించాలని చూస్తున్నారని అన్నారు.మనదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారుతోందని ఆరోపించారు. అసోం ప్రజలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీని ఎప్పుడో తరిమి కొట్టారని కితాబిచ్చారు. రానున్న ప్రతి ఎన్నికల్లో ప్రతి రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతుందని అన్నారు. అసోం పట్ల లేదా దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కానీ మోదీని ఎలా విమర్శించాలో, అబద్ధాలు చెప్పి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించాలో తెలుసని ఎద్దేవా చేశారు.

కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నాయకులు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన విషయం తెలిసిందే.

ఈ ఘటనపై కూడా ప్రధాని స్పందించారు. వారి చర్యను యావత్ దేశం ఖండించిందని అన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ పార్టీ దేశం పైనే దాడికి దిగిందని మండిపడ్డారు. నిరాశతో దుస్తులు చించుకోవడం తప్ప వారికి మిగిలిందేమీ లేదని అన్నారు.

## 2011 నాటి ఫొటోతో గ్యాస్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది

- మొదటి పేజీ తరువాయి

శనివారం ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఓ పోస్ట్ చేశారు.2011లో ఎల్పీజీ సిలిండర్ల కోసం ప్రజలు క్యూలో నిల్చున్న ఫోటోను కాంగ్రెస్ ఇప్పుడు వాడుకుంటోందని ఆయన ఆధారాలతో సహా బయటపెట్టారు. "ఇలాంటి చర్యలతో కాంగ్రెస్ పార్టీ తనను తాను అవమానించుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ప్రధాని నరేంద్ర మోదీ బలమైన నాయకత్వంలో దేశం సురక్షితంగా ఉందని, ఇంధన సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని రిజిజు భరోసా ఇచ్చారు.

మరోవైపు, బీజేపీ జాతీయ ఐటీ సెల్ ఇన్‌చార్జ్ అమిత్ మాలవీయ కూడా ఈ విషయంపై స్పందించారు. ఇరాన్ సంక్షోభం తర్వాత జీ20 దేశాల్లో పెట్రోల్ ధరల పెరుగుదలను వివరిస్తూ ఓ జాబితాను విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం, అమెరికాలో 22 శాతం ధర పెరగగా, భారత్‌లో మాత్రం ధరల్లో ఎలాంటి మార్పు లేదు. భారత్‌తో పాటు సౌదీ అరేబియా, ఇండోనేషియాలో కూడా ధరలు పెరగలేదని ఆయన పేర్కొన్నారు.దేశంలో ముడి చమురు, పెట్రోల్, డీజిల్, ఎల్పీజీలకు సరిపడా నిల్వలు ఉన్నాయని విదేశాంగ శాఖ కూడా స్పష్టం చేసింది. ఇరాన్ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించాలని భారత్ పిలుపునిచ్చిందని, సముద్ర వాణిజ్య కార్యకలాపాలకు భద్రత కల్పించి, ప్రభావిత ప్రాంతంలోని భారతీయ నావికులను స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

## తన ఇంటికి సీఎం చంద్రబాబు రావడం పట్ల అల్లు శిరీష్ ఆనందం...

టాలీవుడ్ యువ కథానాయకుడు, నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడు అల్లు శిరీష్ ఇటీవల నయనికా రెడ్డిని వివాహం చేసుకుని ఓ ఇంటివాడైన సంగతి తెలిసిందే. ఈ నూతన దంపతులను ఆశీర్వదించడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వారి ఇంటికి వెళ్లారు. వధూవరులు శిరీష్, నయనికలను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ అనూహ్య పరిణామంపై అల్లు శిరీష్ సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. చంద్రబాబుతో భేటీ తన జీవితంలో అత్యంత గుర్తుండిపోయే అనుభవమని పేర్కొన్నారు. "ఇది నాకు దక్కిన గొప్ప గౌరవం. దశాబ్దాలుగా నేను ఆరాధించే నాయకుడు, మన ఏపీ సీఎం చంద్రబాబు గారు మా ఇంటికి వచ్చి నన్ను, నయనికను ఆశీర్వదించారు. ఆ దార్శనిక నేతతో గంటసేపు మాట్లాడటం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్నాను" అని శిరీష్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.ఇటీవల అల్లు శిరీష్, నయనికా రెడ్డిల వివాహం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది.

అనంతరం ఏర్పాటు చేసిన రిసెప్షన్‌కు సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో అల్లు అరవింద్ తదితరులు సమావేశమై కాసేపు ముచ్చటించారు. చంద్రబాబుతో శిరీష్ దంపతులు ఉన్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# మూసీ ప్రాజెక్టు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్ పెన్ పవర్:ఖజానాలో డబ్బులు లేవంటూనే, వేలకోట్ల రూపాయలతో మూసీ ప్రాజెక్టును చేపడతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి వ్యవహారం చాలా వింతగా ఉందని అన్నారు. తినడానికి మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనె అన్నట్లుగా ఆయన తీరు ఉందని ఎద్దేవా చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్లు దండుకుంటామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని ఒకవైపు చెబుతూనే, మరొకవైపు మూసీ ప్రాజెక్టును చేపడతానని చెప్పడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీ సుందరీకరణ చేపట్టారని వెల్లడించారు. అసలు మూసీ మురికి కూపంగా మారింది కాంగ్రెస్ హయాంలోనే అని ముఖ్యమంత్రి గుర్తించాలని అన్నారు. మూసీ పునరుజ్జీవంపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.నిన్న ముఖ్యమంత్రి మాట్లాడిన సమయంలో, మూసీ బాధితులకు ఉపశమనం ఇచ్చే ప్రకటన

-4 లో

పెన్ పవర్
తెలంగాణ రౌండప్







# కొంపల్లిలో శ్రీ వాసవి ఆర్య వైశ్య సంఘం ఆవిష్కరణ

- ముఖ్యఅతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్త..
- నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం..
- సంఘ అధ్యక్షుడిగా చిట్టిమల శ్రీనివాస్ బాధ్యతలు స్వీకారం..
- ఎమ్మెల్సీ బోగారపు దయానంద్ సహా పలువురు ప్రముఖుల పాల్గొన్నారు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 14:** మేడ్చల్ జిల్లా కొంపల్లిలో శ్రీ వాసవి ఆర్య వైశ్య సంఘం ఆవిష్కరణతో పాటు నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.. కొంపల్లి హామ్స్టన్ కన్వెన్షన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త ముఖ్యఅతిథిగా హాజరయ్యారు..అనంతరం ఆయన చేతుల మీదుగా నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడిగా చిట్టిమల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తోట బిక్షపతి, కోశాధికారిగా వెంకటేశం, కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడిగా చీల రాము బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఇతర కార్యవర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బోగారపు దయానంద్, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కలవ సుజాత, ఉప్పల శ్రీనివాస్ గుప్త, చీకోటి ప్రవీణ్ గుప్త పాల్గొన్నారు.. ఎమ్మెల్సీ దయానంద్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.. ఆర్య వైశ్యులు సామాజిక, ఆర్థిక రంగాలతో పాటు రాజకీయంగా కూడా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.. అనంతరం అతిథుల చేతుల మీదుగా తెలుగు నూతన సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు.. ఈ కార్యక్రమంలో సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్, అయిత రాములు, మీడియా సెల్ కన్వీనర్ సుదీర్ మంకాల, లింగా కృష్ణమూర్తి, ఈశ్వర్, నాగరాజు, సంతోష్, వంశీ తదితరులు పాల్గొన్నారు..అంతేకాకుండా సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు







# ఉద్యమకారులే అసలు కథానాయకులు

## ఎఫ్ఐఆర్‌లు ఒక్కటే కొలమానం కాదు

- తెలంగాణ కోసం ఎంతో మంది జీవితాలు అంకితం చేశారు
- ఉద్యమకారుల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లా
- ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ కే కేశవరావు

హైదరాబాద్ పెన్ పవర్: ఏ ఉద్యమానికీ ఒక్క కథానాయకుడు ఉండడని, ఉద్యమంలో పాల్గొన్న వారే అసలు కథానాయకులని ప్రభుత్వ సల హాదారు, మాజీ ఎంపీ కే కేశవరావు అన్నారు. తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉద్య మకారులకు గతంలో ఇచ్చిన హామీలను ప్రభు త్వం అమలు

-4 లో



హైదరాబాద్ పెన్ పవర్:గ్యాస్ కొరత, మూసీ ప్రాజెక్టు అంశాలపై ప్రభుత్వ తీరును తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా ఎండగట్టారు. దేశంలో అసలు గ్యాస్ కొరత అనేదే లేదని స్పష్టం చేసిన ఆయన, కొంతమంది కావాలనే లేని కొరతను సృష్టించి ప్రజలను భయపెడుతున్నారని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ

# : లేని గ్యాస్ కొరతను సృష్టించి ప్రజలను భయపెడుతున్నారు: రాంచందర్ రావు

పరిస్థితుల వల్ల అనేక దేశాల్లో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నా, ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం భారత్‌లో ధరలను నియంత్రణలో ఉంచిందని గుర్తుచేశారు. గతంలో రూ. 1,200 వరకు ఉన్న గ్యాస్ ధరను రూ. 900లకు తగ్గించి సామాన్యుడిపై భారం తగ్గించిన ఘనత కేంద్రానిదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఇక మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు విషయంలో బీజేపీ వైఖరిని స్పష్టం చేస్తూ, తాము నది శుద్ధికి వ్యతిరేకం కాదని, కానీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని రాంచందర్ రావు హెచ్చరించారు. మూసీ ప్రాజెక్టు కోసం 50 మీటర్ల బఫర్ జోన్ అవసరమే లేదని, కేవలం ఒక గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం 100 ఎకరాల భూమిని సేకరించాలని చూడటం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. గుజరాత్‌లో సబర్మతి ప్రాజెక్టును ఎవరికీ నష్టం కలగకుండా ఏ విధంగా పూర్తి చేశారో ప్రభుత్వం గమనించాలని సూచించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# జనగణన వివరాలు చెప్పకుంటే రూ. వెయ్యి జరిమానా





హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో రెండు దశల్లో జనగణన కొనసాగుతుందని సెన్సెస్ డైరెక్టర్ భారతి హోలికేరీ చెప్పారు. ఇవాళ ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సర్వేలో 33 రకాల ప్రశ్నలుంటా యని తెలిపారు. సెన్సెస్ సిబ్బందికి ఎవరైనా వివరాలు చెప్పకుంటే రూ. వెయ్యి జరిమానా విధిస్తామని అన్నారు. 16 ఏళ్ల తర్వాత దేశంలో జనగణన చేపడుతున్నామని కనుక ప్రజలందరూ తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. జనగణన ఆధారంగానే ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకుంటాయని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు రిజర్వేషన్ల అమలు, డీలిమిటేషన్ తదితరాలన్నింటికీ జనగణనే కీలకమని తెలిపారు. తెలంగాణలో మే 11 నుండి జూన్ 9 వరకూ తొలివిడత, రెండోదశ జనగణన 2027 ఫిబ్ర వరి 9 నుంచి 28 వరకూ చేపట్టనున్నట్లు ఆమె వెల్లడించారు. తాజాగా ప్రారంభమైన సెన్సెస్-2027 ప్రక్రియలో ఎన్యూ మరేటర్ తన మొబైల్ ఫోన్లో వివరాలు సేకరిస్తారు. ప్రత్యేక యాప్/పోర్టల్ ద్వారా ప్రశ్నలకు సమాధానాలు స్వీకరిస్తారు.

# మూసీ ప్రాజెక్టు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

-3 పేజి తరువాయి

ఏదైనా చేస్తారా అని చూశామని, కానీ ఆ ప్రస్తావనే లేదని విమర్శించారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని ముఖ్యమంత్రి చెబుతున్నారని, రైతుబంధు, రిటైర్డ్ ఉద్యోగులకు కూడా ఇచ్చేందుకు డబ్బులు లేవని చెప్పారని, కానీ ఇప్పుడు మూసీ ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతానని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. 2 వేల కిలోమీటర్ల నమామి గంగే ప్రాజెక్టు ఖర్చు రూ.42,500 కోట్లు అని, గుజరాత్ సబర్మతికి అయిన ఖర్చు రూ.7 వేల కోట్లు అని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. అందాల పోటీలు నిర్వహించడానికి రూ.200 కోట్లు ఖర్చు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, హామీల అమలుకు మాత్రం డబ్బులు లేవంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఒక్క ఇంటినైనా నిర్మించిందా అని ప్రశ్నించారు.

# ఉద్యమకారులే అసలు కథానాయకులు

-3 పేజి తరువాయి

చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఉద్య మకారుల సమస్యలపై స్పష్టమైన కార్యచరణ ప్రకటించాలని వారు కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరా వు మాట్లాడుతూ తెలంగాణ కోసం ఎంతోమంది తమ జీవితాలను అంకితం చేశారని, కేవలం ఎఫ్ఐఆర్లు ఒక్కటే కొలమానం కాదని పేర్కొన్నారు. అర్హులైన ఉద్యమకారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఉద్యమకారుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. తాను కూడా ఉద్యమకారుల్లో ఒకడి నేనని, వారికి అండగా నిలబడటం తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఉద్యమకారుల హామీల అమలుపై సబ్ కమిటీ ఏర్పాటు కానుందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏ ఒక్కరి వల్ల మాత్రమే సాధ్యపడలేదని, అనేక మంది త్యాగాల ఫలితమే రాష్ట్ర సాధన అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యమకారులను గౌరవించే చర్యలు తీసుకున్నామని చెప్పారు. అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గేయాన్ని రాష్ట్ర గేయంగా ప్రకటించడం కూడా అందులో భాగమని తెలిపారు. ఉద్యమకారులకు ఏసమస్య ఉన్నా తనతో పంచుకోవాలని కేశవరావు సూచించారు.

# కరీంనగర్ నుంచి కొండగట్టు వరకు 10 వేల మందితో పాదయాత్రను ప్రారంభించిన బండి సంజయ్

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర మంత్రి బండి సంజయ్ తన మొక్కును తీర్చుకునేందుకు కరీంనగర్ నుండి కొండగట్టు వరకు 'అంజన్న ఆశీర్వాద యాత్ర' పేరిట పాదయాత్రను చేపట్టారు. కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి, మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటే నూతన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టుకు కాలినడకన వస్తానని ఆయన గతంలో ప్రకటించారు. ఆ మాట ప్రకారం, కరీంనగర్ మేయర్ పీఠం దక్కడంతో ఈ యాత్రకు శ్రీకారం చుట్టారు.కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బండి సంజయ్ ఈ పాదయాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో ఆయన వెంట కరీంనగర్ నూతన మేయర్, కార్పొరేటర్లు, సుమారు 10 వేల మంది కార్యకర్తలు పాల్గొని అంజన్న

నామస్మరణతో ముందుకు సాగుతున్నారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. కరీంనగర్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులందరినీ ఏకం చేస్తూ, విజయానికి కృతజ్ఞతగా ఈ మొక్కును చెల్లించుకుంటున్నారు.



# సింగపూర్ నుంచి వచ్చిన 70 డ్రోన్లు సీజ్ : శంషాబాద్ ఎయిర్ పోర్టులో పట్టివేత




**హైదరాబాద్ పెన్ పవర్:**శంషాబాద్ ఎయిర్ పోర్టులో భారీగా డ్రోన్లు స్వాధీనం చేసుకున్నారు కస్టమ్స్ అధికారులు.సింగపూర్ నుంచి తీసుకొస్తున్న 70 డ్రోన్లను సీజ్ చేశారు. డ్రోన్లను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు ప్రయాణికులను అదుపులోకి తీసుకున్నారు. అంత పెద్ద మొత్తంలో డ్రోన్లను సింగపూర్? నుంచి తీసుకురావడం వెనక కారణం ఏంటనే కోణంలో విచారిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. శనివారం (మార్చి 14) శంషాబాద్ ఎయిర్ పోర్టులో సింగపూర్? నుంచి ముగ్గురు ప్రయాణికులు తీసుకొచ్చిన 70 డ్రోన్లను కస్టమ్స్? అధికారులు పట్టుకున్నారు. రెండు వేర్వేరు విమానాల్లో ఈ డ్రోన్లను సింగపూర్? నుంచి శంషాబాద్? కు తీసుకువచ్చారు. పట్టుకున్న డ్రోన్ల విలువ దాదాపు రూ.50లక్షల ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

మరోవైపు పశ్చిమాసియా దేశాల్లో ఎయిర్ స్పేస్ క్లోజ్? చేయడంతో శంషాబాద్? ఎయిర్ పోర్టు నుంచి ఆయా దేశాలకు వెళ్లాల్సిన పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను రద్దు చేశారు. శనివారం మొత్తం 13 అంతర్జాతీయ సర్వీసులను రద్దు చేశారు.

# జిల్లాకో రింగ్ రోడ్...

**వరంగల్, మార్చి 14, హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక జాతీయ రహదారులు, రైలు మార్గాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తోంది. ఒక్క తెలంగాణలోనే 2 వేల కిలోమీటర్లకుపైగా రహదారుల నిర్మాణం చేపట్టింది. తాజాగా రేవంత్ సర్కార్ కూడా రహదారుల విస్తరణ, కొత్త మార్గాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోంది. అభివృద్ధికి రహదారులు కీలకంగా మారడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ జిల్లా కేంద్రానికి రింగ్ రోడ్లు నిర్మించేందుకు ప్రణాళిక రచిస్తోంది. ఇది రాష్ట్రవ్యాప్త రవాణా వ్యవస్థను ఆధునికీకరించి, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది.రాష్ట్రంలోని ప్రతీ ప్రధాన జిల్లా కేంద్రం(హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటివి) చుట్టూ రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు, ఇవి దగ్గర్లోని జాతీయ రహదారులు, హైవేలతో అనుసంధానం కలిగి ఉంటాయి. ఇది

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్, 340347 కి.మీ. పొడవు, 46 లేన్లు)ను సప్లిమెంట్ చేస్తూ, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)కు వెలుపలి ప్రాంతాల్లోకి విస్తరిస్తుంది. మొత్తం 1,940 హెక్టార్ల భూమి అవసరం, భూసేకరణ ఇప్పటికే ప్రారంభమైంది.రింగ్ రోడ్ల నిర్మాణంతో 24 పట్టణాలు, 200 గ్రామాలను అనుసంధానం చేస్తుంది. దీంతో ట్రాఫిక్ 30 నుంచి 40 శాతం తగ్గుతుంది. లాజిస్టిక్స్ ఖర్చు తగ్గుతుంది. ఇండస్ట్రియల్ క్లస్టర్లు, లాజిస్టిక్ పార్కులు, రియల్ ఎస్టేట్, ఐటీ హబ్‌లు ఏర్పాటుకు అవకాశం కలుగుతుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గ్రీన్‌ఫీల్డ్ రహదారులు, 72 హెక్టార్ల అటవీ భూమి రక్షణ, భవిష్యత్తులో ఆరు లేన్ల విస్తరణతో పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది.

**ప్రణాళిక అమలులో సవాళ్లు..**

భూసేకరణ ఆలస్యాలు, ఖర్చు పెరగడం ప్రధాన సమస్యలు. కానీ ఎన్‌హెచ్ఏఐ సహకారంతో 5 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారు. మూడేళ్లలో పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. ఈ రింగ్ రోడ్లు తెలంగాణను లాజిస్టిక్స్ హబ్‌గా మార్చి, గేమ్ చేంజర్ అవుతాయి.

## తండ్రి మరణాన్ని గుండెల్లో దాచుకుని పరీక్షకు హాజరు

**తుంగతుర్తి, మార్చి 14 పెన్ పవర్:** తండ్రి మరణించిన దుఃఖాన్ని గుండెల్లో దాచుకుని, కన్నీళ్లను దిగమింగుకుని పదవ తరగతి పరీక్షకు హాజరయ్యాడు కూరెళ్ళ హర్షవర్ధన్ అనే విద్యార్థి. మోత్కూర్ కు చెందిన ఉపాధ్యాయుడు కూరెళ్ళ ఎల్లయ్య రాత్రి గుండెపోటుతో మరణించగా, అతని కుమారుడు హర్షవర్ధన్ పరీక్ష రాయడం చూపరులను కంటతడి పెట్టించింది. తండ్రి మరణంతో తీవ్ర దుఃఖంలో ఉన్నప్పటికీ, విద్యార్థి పరీక్ష పట్ల చూపిన అంకితభావం అందరినీ కదిలించింది.

## వాహనం ఢీకొని మహిళ మృతి

**హుజూర్‌నగర్, మార్చి 14 పెన్ పవర్:**తిప్పర్తిలో తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం సుమారు 4:30 గంటల సమయంలో కేశరాజ్‌పల్లి గ్రామ సమీపంలో కాలినడకన వెళ్తుండగా వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఆమెను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## శ్రీ పూర్ణ గిరి స్వామి వారికి ప్రత్యేక పూజలు

**భువనగిరి, మార్చి 14 పెన్ పవర్:**భువనగిరి మండలంలోని నమాత్ పల్లి గ్రామంలోని శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో నిజాభిషేకం, సహస్రనామార్చనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## నిరుద్యోగులకు సువర్ణావకాశం

**కామారెడ్డి, మార్చి 1 పెన్ పవర్:**కామారెడ్డిలో జి.సి.ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల ఆదివారం రోజున మెగా జాబ్ మేళా నిర్వహించబడుతుంది. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పర్శి రాములు కళ్యాణ మండపం, అశోక్ నగర్ కాలనీలో జరిగే ఈ మేళాలో 18 నుండి 40 ఏళ్ల నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనాలని టిపిసిసి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి శనివారం కోరారు. టెన్త్, డిప్లొమా, ఎంసీఏ, ఎంఎస్ వంటి సర్టిఫికెట్లతో హాజరై, క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బాన్సువాడ పట్టణంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

**బాన్సువాడ, మార్చి 14 పెన్ పవర్:**బాన్సువాడ పట్టణంలో పదవ తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజున ప్రశాంత వాతావరణంలో శనివారం ప్రారంభమయ్యాయి. పరీక్షలు ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా జరిగేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. మాస్ కాపీయింగ్ లేదా అక్రమాలు జరగకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, కూర్చునే సౌకర్యాలు వంటి అన్ని అవసరమైన సదుపాయాలు కల్పించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో అనవసరంగా గుంపులు గుమికూడకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

## టేక్రియాల్ లో రంజాన్ కిట్లు పంపిణీ

**జుక్కల్, మార్చి 14 పెన్ పవర్:**కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు టేక్రియాల్ డబుల్ బెడ్ రూం కాలనీలో శనివారం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి లలిత ఆదేశానుసారంగా నాయకులు రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు, నరేష్, పెద్ద పోతన గారి రాజు, సందీప్, రాయల రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**రాజేంద్రనగర్, మార్చి 14 పెన్ పవర్:** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ జనప్రియ అపార్ట్మెంట్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్ వ్యాప్తంగా మెగా ఈ-వేస్ట్ క్లీన్ లెస్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం 99 రోజులపాటు కొనసాగుతుంది. రెండో శనివారం, ఆదివారం కూడా ప్రత్యేకంగా వార్డు కార్యాలయాల వద్ద ఈ కార్యక్రమం ఉంటుంది. టీవీ, వాషింగ్ మెషిన్, కంప్యూటర్, ల్యాప్‌టాప్, గీజర్ వంటి పనిచేయని లేదా పాతబడిన ఎలక్ట్రానిక్ వస్తువులను జీహెచ్ఎంసీ వారికి అందజేస్తే, దానిపై కొన్ని పాయింట్లు కూడా వారికి అందజేస్తామని అధికారులు తెలిపారు.

## పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకున్న విద్యార్థులు

**కుత్బుల్లాపూర్, మార్చి 14 పెన్ పవర్:** తెలంగాణలో పదవ తరగతి వార్షిక పరీక్షలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రారంభమయ్యాయి. కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని 11 ప్రభుత్వ, 166 ప్రైవేటు పాఠశాలల నుండి మొత్తం 8,655 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు ప్రతిరోజూ ఉదయం 9:30 నుంచి 12:30 వరకు పరీక్షలు నిర్వహించబడతాయి. ఏసీపీ బాల గంగిరెడ్డి పరీక్షా కేంద్రాలను పరిశీలించి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, ఒత్తిడి లేకుండా చదవాలని సూచించారు

## చెంగిచెర్లలో ఘనంగా యూరో కిడ్స్ పాఠశాల వార్షికోత్సవం

**మేడ్చల్, మార్చి 14 పెన్ పవర్:** చెంగిచెర్ల ప్రాంతంలోని యూరో కిడ్స్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త రవి గౌడ్, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించి అభినందించారు. విద్యతో పాటు సంస్కృతి, క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడిగా కొత్త రవి గౌడ్ పేరుపొందారని స్థానికులు పేర్కొన్నారు. ఆయన చిన్నారులను ప్రోత్సహించారు.

## చింతలపల్లిలో రంజాన్ కానుకలు పంపిణీ చేసిన నర్సింలు యాదవ్

**ఉప్పల్, మార్చి 14 పెన్ పవర్:**రంజాన్ మాసం సందర్భంగా మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింలు యాదవ్ మూడు చింతలపల్లిలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకలు శనివారం పంపిణీ చేశారు. పేదలకు సహాయం చేయడం గొప్ప కార్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ మెంబర్ ముజిబుద్దిన్, ఖీం మెంబర్ జైపాల్ రెడ్డి, నాయకుడు దోసకాయల వెంకటేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# సారా కధ ఇంతింతకాదయా

**మహబూబ్ నగర్, మార్చి 14, పెన్ పవర్:**
రాజకీయ నాయకులు సాధారణంగా ఓటర్లకు అభివృద్ధి మంత్రం వేస్తారు, కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాత్రం ఏకంగా ఆరోగ్య మంత్రం కనిపెట్టారు. అది కూడా ఎక్కడో విదేశాల్లో కాదు.. మన నాటు సారాలో! ఇప్ప పూవుతో కాచిన సారా తాగితే మనుషులు ఏకంగా 110 ఏళ్లు బతుకుతారని ఆయన సెలవిస్తున్నారు. ఆయన తీరు ప్రపంచ ఆరోగ్య సంస్థ తన హెల్త్ బులిటెన్లను మార్చుకోవాలేమో అన్న అనుమానం కలుగుతోంది. అనిరుధ్ రెడ్డి లాజిక్ ప్రకారం.. ప్రస్తుతం మనం వాడుతున్నవన్నీ కల్తీ వస్తువులే, కానీ ఇప్ప పూవుతో తయారు చేసే సారా మాత్రం స్వచ్ఛమైన ఆర్గానిక్ ప్రొడక్ట్ అట. సారా వల్ల ఆరోగ్యం చెడిపోతుందని నిషేధిస్తే.. ఎమ్మెల్యే గారు మాత్రం అది ఆయుష్షును పెంచే అమృతం అని సర్టిఫికేట్ ఇచ్చేస్తున్నారు. పైగా తాను స్టడీ చేశానని కూడా చెబుతున్నారు. సారా తాగితే ఆరోగ్యం.. 110 ఏళ్ల ఆయుష్షు ఖాయం అని ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఆయన చెబుతుంటే, నెటిజన్లు మాత్రం సెటైర్లతో విరుచుకుపడుతున్నారు. ఇన్నాళ్లూ ఈ డైట్ ప్లాన్ తెలియక కదా మేము ప్రోటీన్ షేక్స్, గ్రీన్ టీలు తాగి వేస్ట్ అయిపోయాం అని సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి. అనిరుధ్ రెడ్డి కనిపెట్టిన ఈ లాంగ్ లైఫ్ సీక్రెట్ విన్నాక, మందుబాబులు కూడా మా ఎమ్మెల్యే గారు మా కోసం ఏదో ఒక కొత్త స్కీమ్ తెస్తారని తెలుసు.. కానీ ఇది మరీ అదిరిపోయింది అని మురిసిపోతున్నారు. అనిరుధ్ రెడ్డి తెలంగాణలో నిషేధించిన సారాను తీసుకు రావాలని డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీలో కూడా మాట్లాడతానని అంటున్నారు. ఆయన మాటలు నమ్మి ఎవరైనా రేపటి నుంచి 'ఆర్గానిక్' పేరుతో సారా బాటిళ్లకు అతుక్కుపోతే, వారి జీవితం 110 ఏళ్ల దాకా వెళ్తుందో లేదో తెలియదు కానీ, వారి లివర్ మాత్రం త్వరగానే సెలవు తీసుకుంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అనిరుధ్ రెడ్డి గారు తన సారా పురాణం తో కాంగ్రెస్ పార్టీలో కూడా సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అయ్యారు. మరి ఈ ఆర్గానిక్ సారా ఫార్ములాను ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తుందా? లేక ఎమ్మెల్యే గారి వ్యక్తిగత హెల్త్ టిప్‌గా మాత్రమే మిగిలిపోతుందా? అనేది చూడాలి.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## చాకలి సాయిలు కుటుంబాన్ని పరామర్శించిన జీఎంఆర్ ఫౌండేషన్

**జహీరాబాద్, మార్చి 14 పెన్ పవర్:** మనూర్ మండలం బోరంచ గ్రామానికి చెందిన చాకలి సాయిలు మరణించడంతో జీఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు వారి కుటుంబాన్నిశనివారం పరామర్శించారు. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గుజ్జపు మచ్చేందర్ ఆదేశాల మేరకు నాయకులు గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చి, కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సిందోల్ సంగారెడ్డి, మొట్లకుంట నర్సింలు, కొంగరి రవీందర్ రెడ్డి, చాకలి సత్యన, పుట్టి శివన్న, చిట్టికింది సుబ్బన్న, పుట్టి విట్టల్, పాలడుగు రాములు, ఎర్ర శ్రీశైలం, గొల్ల పాపని గోపాల్, అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీధి లైట్ రిపేర్ చేస్తూ కరెంట్ షాక్‌తో కార్మికుడు మృతి

**పటాన్‌చెరు, మార్చి 14 పెన్ పవర్:**మెదక్ జిల్లా, శివంపేట్ మండలం గోమారం గ్రామంలో పంచాయతీ కార్మికుడు నీరుడి రాములు (48) వీధి లైట్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో స్తంభం నుంచి కిందపడి మృతి చెందారు. తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామ పంచాయతీ ద్వారా రూ.17 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందని సర్పంచ్ తెలిపారు.

## వంటగ్యాస్ ధరల పెంపుపై సిపిఐ వినూత్న నిరసన

**వనపర్తి, మార్చి 14 పెన్ పవర్** వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ వినూత్న ప్రదర్శన శనివారం నిర్వహించారు. ఖాళీ గ్యాస్ సిలిండర్‌కు పూలదండ వేసి, కట్టెల పొయ్యిపై వంట చేస్తూ కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని నాయకులు డిమాండ్ చేశారు. ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలతో పాటు హోటల్ యజమానులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూములు పారదర్శకంగా రీసర్వే చేయాలి

**కొల్లాపూర్, మార్చి 14 పెన్ పవర్**అటవీ, రెవెన్యూ భూములు పారదర్శకంగా రీసర్వే చేసి భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా చూడాలని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లికృష్ణారావు అదికారులను అదేశించారు. మొలచింతపల్లి అటవీ, రెవెన్యూ భూముల రీసర్వే సభ ఏర్పాటు చేయగా ఆయన మాట్లాడారు. భూముల కొలతలు చేసేటప్పుడు ఎలాంటి తేడాలు లేకుండా హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసి, పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

## షీ టీమ్స్‌తో అతివకు భరోసా

**నారాయణపేట, మార్చి 14 పెన్ పవర్** మహబూబ్‌నగర్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ బాలిక జిల్లా కేంద్రానికి బస్సులో వస్తోంది. వేరే గ్రామానికి చెందిన యువకుడు ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ ఈ అమ్మాయి ఎక్కిన బస్సులో ఎక్కుతూ అసభ్యంగా ప్రవర్తించేవాడు. అమ్మాయిని నిత్యం అనుసరిస్తుంటే ఆమే షీ టీమ్ బృందానికి ఫోన్ చేసి విషయాన్ని చెప్పింది. దీంతో వారు మాటేసి అతన్ని పట్టుకొని కేసు నమోదు చేశారు.' ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన విద్యార్థినులు, యువతులు, మహిళలకు తిరిగి ఇంటికి వచ్చేంత వరకు కుటుంబ సభ్యులు ఆందోళనతో ఉంటున్నారు. బస్టాప్‌లు, విద్యా సంస్థలు, ఇతర రద్దీ ప్రాంతాల వద్ద పలువురు అకతాయిలు అమ్మాయిలను వేధిస్తున్నారు. పలువురు అమ్మాయిలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక మానసిక వేదనకు గురవుతున్నారు. పలువురు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారికి చేయూతను అందించడానికి మేమున్నాం అనే భరోసా కల్పిస్తూ షీ టీమ్ బృందాలు నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశాయి.

## చెరువులో పడి యువకుడి మృతి

**సూర్యాపేట, మార్చి 14 పెన్ పవర్** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన బద్దిపూడి వెంకటేష్ (21) చెరువులో పడి మృతి చెందాడు. వీరులు పండుగకు మోతె మండలం మామిళ్లగూడెం గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చిన సమయంలో ఈ ఘటన జరిగింది. చెరువు వద్ద కాలుజారి నీటిలో పడటంతో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

## కార్య కర్తలకు నాయకులకు అండగా ఉంటా

**కోదాడ, మార్చి 14 పెన్ పవర్** కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు మండలం జెర్రిపోతుల గూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు చవ్వ మల్లయ్య అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటుండగా, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం, ఇదే గ్రామానికి చెందిన ఓ.ఓ.ఈ మేము సైతం ఫౌండేషన్ సలహాదారు షేక్ నాగుల్ పాషా తల్లి మహబూబి మృతిచెందడంతో వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆమె మృతికి సంతాపం తెలియజేసి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

# శక్తివంతంగా మారుతున్న తెలంగాణ జాగృతి




**హైదరాబాద్, మార్చి 14, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక అనూహ్య మార్పు కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ ప్రధాన నేతలు ఇంకా ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కొంత తడబడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. తాము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా మారలేకపోతున్నాం అని గతంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అయితే, సరిగ్గా ఇక్కడే కల్వకుంట్ల కవిత తనదైన శైలిలో రాజకీయ దూకుడు పెంచారు. బీఆర్ఎస్ పార్టీ కంటే వేగంగా ఆమె క్షేత్రస్థాయి సమస్యలపై స్పందిస్తూ, ప్రజల్లోకి దూసుకుపోతున్నారు.ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్ల గ్రామంలో పేదల ఇళ్ల కూల్చివేతపై కవిత చేసిన పోరాటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణం వ్తోంది. నిరాశ్రయులైన కుటుంబాల కోసం ఆమె ఏకంగా ఖమ్మం నడిబొడ్డున ఆమరణ నిరాహార దీక్షకు దిగడం, పోలీసుల నిర్బంధాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీఆర్ఎస్ కేడర్ అంతా స్తబ్దుగా ఉన్న తరుణంలో, ఆమె నేరుగా గ్రౌండ్ లెవల్‌లోకి వెళ్లి బాధితులకు భరోసా ఇవ్వడం ద్వారా అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు ప్రజల్లో ఆమెపై సానుభూతి , మద్దతు పెరుగడానికి కారణం అయింది.ఢిల్లీ లిక్కర్ కేసు నుండి విముక్తి పొందిన కవిత తెలంగాణ జాగృతి వేదికగా తన రాజకీయ పునరాగమనాన్ని అత్యంత శక్తివంతంగా చాటుకుంటున్నారు. తనను పార్టీ నుండి పంపేశారని చెబుతున్న ఆమె చేస్తున్న పోరాటాలు చూస్తుంటే.. బీఆర్ఎస్ చేయలేని పనిని ఆమె ఒంటిచేత్తో చేస్తున్నట్లు కనిపిస్తోంది. కేసీఆర్, కేటీఆర్
వంటి అగ్రనేతలు ఇంకా వ్యూహాల్లో నిమగ్నమై ఉండగా, కవిత మాత్రం నేరుగా యాక్షన్ లోకి దిగడం బీఆర్ఎస్‌కు షాక్ లాంటిదే. కవిత ఇప్పుడు తన 'తెలంగాణ ఉద్యమ కాలం' నాటి పంథాను మళ్లీ ఎంచుకున్నారు. అప్పట్లో జాగృతి ద్వారా ఎలాగైతే ప్రజలను సమీకరించారో, ఇప్పుడు కూడా అదే ఫార్ములాతో వెళ్తున్నారు. చట్టసభల్లో గొంతుక కంటే.. వీధుల్లో చేసే పోరాటమే బలంగా వినిపిస్తుంది అనే సిద్ధాంతాన్ని ఆమె పాటిస్తున్నారు. జగదీష్ రెడ్డి చెప్పినట్లుగా పార్టీ ఇంకా ప్రతిపక్ష పాత్రకు అలవాటు పడకపోవచ్చు కానీ, కవిత మాత్రం ఇప్పటికే ఆ పాత్రలో ఒదిగిపోయారు. ప్రజా సమస్యలపై ఆమె చూపిస్తున్న ఈ తెగువ, కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు ఆమెకు ప్రజల మద్దతును మరింత పెంచుతున్నాయి. భవిష్యత్తులో బీఆర్ఎస్ కేడర్ కూడా ఆమె నాయకత్వం వైపు మొగ్గు చూపినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. కేటీఆర్ కూడా వెంటనే.. ప్రెస్మీట్లు, సోషల్ మీడియా విమర్శలకే పరిమితం కాకుడా.. ప్రత్యక్షంగా రాజకీయ యుద్ధాలకు దిగాలన్న అభిప్రాయం బీఆర్ఎస్ క్యాడర్ లో వినిపిస్తోంది.

# 3 కార్పొరేషన్లకు విడివిడిగా ఎన్నికలు

**హైదరాబాద్, మార్చి 14, పెన్ పవర్:**
హైదరాబాద్ మహానగర పాలనలో కొత్త అధ్యాయం మొదలైంది. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇప్పటికే అమలులోకి వచ్చింది. ముగ్గురు కమిషనర్ల నియామకం కూడా పూర్తి కావడంతో, ఇప్పుడు అందరి దృష్టి ఎన్నికల నిర్వహణపై పడింది. అయితే, మూడు కార్పొరేషన్లకు ఒకేసారి కాకుండా, ఒక్కో కార్పొరేషన్‌కు విడివిడిగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఇలా చేయడానికి లోతైన రాజకీయ వ్యూహం ఉన్నట్లుగా చెబుతున్నారు. ప్రస్తుతం ఒక్కో మున్సిపల్ కార్పొరేషన్ లో వంద వార్డులు ఉన్నాయి. అయితే వాటిని మార్చాలనుకుంటున్నారు. వార్డుల సంఖ్యను పెంచడం ద్వారా ఏ ఒక్క రాజకీయ పార్టీకి ఏకపక్షంగా పట్టు చిక్కకుండా చేయాలన్నది సర్కార్ ఆలోచనగా చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలోని బలమైన ఓటు బ్యాంకులను ముక్కలు చేయడం ద్వారా రాజకీయ శక్తిని వికేంద్రీకరించాలని చూస్తోంది. ఈ వార్డుల పునర్విభజన ఫలితాలే రాబోయే రోజుల్లో కొత్తగా ఏర్పడిన మూడు కార్పొరేషన్ల మేయర్ పీఠాలను ఎవరు అధిరోహించాలనేది నిర్ణయించేలా చేయాలనుకుంటున్నారు. మల్కాజ్‌గిరి వంటి కీలక ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో ఇంకా పటిష్టమైన యంత్రాంగం సిద్ధం కాలేదు. అక్కడ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటికీ బలంగా ఉండటం అధికార పార్టీకి కొంత ఆందోళన కలిగిస్తోంది. ఒకేసారి ఎన్నికలకు వెళ్తే ఎదురుదెబ్బ తగిలే ప్రమాదం ఉందని గ్రహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అనుకూలమైన చోట ముందుగా, ప్రతికూలత ఉన్న చోట నిదానంగా ఎన్నికలు నిర్వహించడం ద్వారా నష్ట నివారణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ వంటి చోట్ల ఆంధ్ర మూలాలున్న ఓటర్లు అధికంగా ఉండే ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. ఈ ప్రాంతాల్లో గెలుపు ఏ పార్టీకైనా ప్రతిష్టాత్మకమే. అందుకే, తక్షణమే ఎన్నికలకు వెళ్లకుండా, అక్కడి ఓటర్లను ఆకట్టుకునేలా ప్రత్యేక అభివృద్ధి పథకాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. సైబరాబాద్ పరిధిలో మౌలిక వసతుల కల్పన ద్వారా వారి విశ్వాసాన్ని పొందాకే ఎన్నికల బరిలోకి దిగాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్నికల వ్యూహంలో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి మూడు కార్పొరేషన్ల పరిధిలో 99 రోజుల ప్రత్యేక అభివృద్ధి కార్యాచరణను ప్రకటించారు. ఈ స్వల్ప కాలంలో పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులను పూర్తి చేసి, ఆపై భారీ స్థాయిలో ప్రారంభోత్సవాల ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. ఒకవైపు పాలనను వికేంద్రీకరిస్తూనే, మరోవైపు అభివృద్ధి పనులతో ప్రత్యర్థుల విమర్శలకు చెక్ పెట్టాలనేది ప్రభుత్వ ఎత్తుగడగా కనిపిస్తోంది.మూడు కార్పొరేషన్లకు వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరపడం ద్వారా.. ఒక ప్రాంతంలో వచ్చిన ఫలితం లేదా ప్రభావాన్ని మరో ప్రాంతంలో తమకు అనుకూలంగా మార్చుకోవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఇది ప్రతిపక్షాల ఏకాగ్రతను దెబ్బతీయడంతో పాటు, అధికార యంత్రాంగాన్ని ఒకే చోట కేంద్రీకరించి గెలుపు అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి దోహదపడుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. భాగ్యనగర త్రిశూల వ్యూహంతో మేయర్ పీఠాలను దక్కించుకోవడానికి రేవంత్ రెడ్డి భారీ స్కెచ్ సిద్ధం చేసినట్లు స్పష్టమవుతోంది. ఎంత మేర వర్కవుట్ అవుతాయన్నది వేచి చూడాల్సిందే.

# చివరి దశకు మావోయిస్టుల పోరాటం



**వరంగల్, మార్చి 14, పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఒక కీలకమైన అధ్యాయం అవిష్కృతంకానుంది. దశాబ్దాల కాలంగా సాయుధ పోరాట బాటలో సాగిన మావోయిస్టులు భారీ సంఖ్యలో జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమయ్యారు. . దశాబ్దాల కాలంపాటు అజ్ఞాతంలో ఉండి, సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన మావోయిస్టు అగ్రనేతలు రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా ఆలోచన చేస్తున్నారు. జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత సీనియర్ నాయకులంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. దాదాపు గంటసేపు సాగిన సమావేశంలో మావోయిస్టు నేతలు తమ అంతరంగాన్ని ఆవిష్కరించారు. వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీ విషయం కూడా చర్చకు వచ్చింది. నాలుగున్నర దశాబ్దాల పాటు అడవిని నమ్ముకొని పోరాటం చేసిన కీలక నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవలే డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయిన మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలటరీ కమిషన్ ఇన్‌ఛార్జీ తిప్పిరి తిరుపతి(దేవ్‌జి), కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డి(సంగ్రామ్), రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు(జగన్), రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి (గంగన్న) ముఖ్యమంత్రిని కలిశారు. వీరితోపాటు గతంలోనే లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు పుల్లూరి ప్రసాద్, పోతుల పద్మావతి కూడా ఉన్నారు. ఈ భేటీలో మావోయిస్టు నేతలు ఒక సంచలన ప్రతిపాదన చేశారు. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే సాయుధ పోరాటాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగిస్తామని పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీని రద్దు చేస్తామని దేవ్‌జి, రాజిరెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అనుసరించిన పోరాట పంథాను వదిలి, చట్టపరంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగించాలని భావిస్తున్నట్టు వెల్లడించారు. అంతేకాకుండా, ప్రభుత్వాలు సహరిస్తే రాజకీయ పార్టీగా మార్చేందుకు కూడా సిద్ధమని వారు తెలిపారు. ఈ ప్రతిపాదనపై స్పందించిన రేవంత్ రెడ్డి, ఈ అంశం తన పరిధిలో లేదని త్వరలోనే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసినప్పుడు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తాను అని హామీ ఇచ్చారు. కేంద్రం ఓకే అంటే కేంద్ర హోంమంత్రిని ఇక్కడికి పిలిపించి, ఒక భారీ సభ ఏర్పాటు చేసి ఈ విషయాన్ని ప్రకటిస్తామని సీఎం చెప్పారు. మావోయిస్టు నేతలు తమ పునరావాసం, ఇతర మౌలిక వసతుల గురించి ముఖ్యమంత్రి కీలక అభ్యర్థనలు చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణమే ఆరోగ్య శ్రీ సదుపాయం కల్పించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం లొంగిపోయిన వారికి 30 ఏళ్ల క్రితం నాటి రివార్డు సొమ్మునే ఇస్తున్నారని, ఇతర రాష్ట్రాల్లో ఇది ఎక్కువగా ఉందని తెలిపారు. దీనిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడంపై క్యాబినెట్‌లో చర్చిస్తామని, అయితే వ్యవసాయ భూమి ఇవ్వడం సాధ్యం కాదని సీఎం స్పష్టం చేశారు. ఏవైనా రాజకీయ అంశాలు ఉంటే ప్రభుత్వ సలహాదారు కేశవరావును, ఆర్థికపరమైన అంశాల కోసం వేం నరేందర్‌రెడ్డిని కలవాలని సీఎం సూచించారు. జన జీవన స్రవంతిలో కలిసిన నేతలకు ఎలాంటి భద్రతా పరమైన ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. హింస దేనికీ పరిష్కారం కాదని, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని ఆయన హితవు పలికారు. సమావేశం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్‌కు చెందిన సుజాతక్కతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మల్లోజుల కోటేశ్వరరావు భార్య అయిన ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు, వారికి ప్రభుత్వం తరపున అందే పునరావాస ప్యాకేజీలు, ఈ పరిణామం వెనుక ఉన్న కీలక అంశాలను సీఎం వివరించే అవకాశం ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, లొంగిపోయే మావోయిస్టులకు ప్రభుత్వం తక్షణ సహాయంతో పాటు, వారు సమాజంలో గౌరవప్రదంగా బతకడానికి అవసరమయ్యే ఉపాధి, ఇతర వసతులను కల్పిస్తుంది.

# హాస్య రచయితలలో అగ్రగణ్యులు మునిమాణిక్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** తమ రచనల ద్వారా మధ్య తరగతి సంసారంలోని సరిగమల్ని ఎన్నింటినో వినిపించిన రచయిత మునిమాణిక్యం నరసింహారావు . తెలుగు హాస్య రచయితలలో ముని మాణిక్యంకు ఒక విశిష్ట స్థానం ఉంది. ఆయన కేవలం హాస్యరచయిత మాత్రమే కాదు. హాస్యోపాసకులు కూడా. విభిన్న వ్యక్తుల మనసులను అలరించే హాస్యోక్తులు,హాస్య సన్నివేశాలు ఎక్కడ ఆయన దృష్టికి తెచ్చినా వాటిమీద మక్కువతో అనువదించి గాని, అనుసరించిగాని, భాషను కొంచెం హాస్య యుక్తంగా మార్చి తెలుగు పాఠకులకు అందజేసే వారు. హాస్య రచయితలలో అగ్రస్థానం మునిమాణిక్యందే. ఆయన వ్రాసిన 'దాంపత్యోపనిషత్' కథలను మనసు పెట్టి చదువుకుంటే నేటి యువతీ యువకులు విడాకుల మాటే ఎత్తరని చాలా మంది అభిప్రాయం. సంసారాన్ని ఎలా రసభరితంగా చేసుకోవాలో చెప్పిన గొప్ప విశ్లేషకులు ఆయన. గృహస్థ జీవితాన్ని గురించి ఆయన చెప్పినట్లు మరెవరూ చెప్పలేదేమో. మునిమాణిక్యం నరసింహారావు ఇరవైయ్యవ శతాబ్దం మొదటి పాదంలో ఒక కథకుడిగా రూపు దిద్దుకున్నారు. ముఖ్యంగా దంపతుల నడుమ జరిగే సున్నితమైన హాస్య శృంగార ఘట్టాలను అందించడంలో ఆయన అందె వేసిన చేయి. కుటుంబ జీవితం లోని కష్టసుఖాలు, దాంపత్య జీవితం లోని సౌందర్యం ఆయన కథలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆయన సృష్టించిన కాంతం తెలుగు సాహిత్యంలోనే గొప్ప స్థానం పొందింది. కాంతం" పేరు వినగానే మనకు గుర్తుకు వచ్చేది మునిమాణిక్యం నరసింహారావు. కాంతం కథల ద్వారా అయన తెలుగు పాఠకులకు సుపరిచితులు. తెలుగు సాహిత్యంలో ఒక "కాంతం" అన్న పాత్రను సృష్టించి ఆ పేరున ఎన్నో రచనలు చేశారు. కాంతం కథలతో తెలుగువాళ్ల మనసుల్లో చిరునవ్వులు పూయించి, మధ్య తరగతి జీవితాల్లో భార్యాభర్తల అనుబంధాన్ని కళ్లకు కట్టిన రచయిత ముని మాణిక్యం నరసింహారావు. ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో విద్యా ప్రసారాలు అసిస్టెంట్ ప్రొడ్యూసర్ గా పని చేశారు. అంధ్ర సారస్వత పరిషత్, తెలుగు పండిత శిక్షణ పాఠశాల హెడ్మాష్టర్ గా హైదరాబాదులో 5 ఏళ్ళు పని చేశారు.ముని మాణిక్యం నరసింహారావు తెనాలి తాలూకా, సంగం జాగర్లమూడిలో మార్చి 15, 1898 న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు వెంకాయమ్మ, సూర్యనారాయణ. ఆయన తెనాలిలో ఇంటర్మీడియెట్ చదివారు. డిగ్రీ చదవడానికి తాహతు లేకపోతే కొండా వెంకటప్పయ్య సహాయం వల్ల బి.ఎ చదివారు. తర్వాత గుంటూరు, భీమవరం, బందరు, కళాశాల్లో 30 ఏళ్ళు పని చేశారు. ఆదర్శ ఉపాధ్యాయులుగా పేరు తెచ్చుకొన్నారు. ఆయన భార్య కాంతం. ఆయనకు ఇద్దరు మగపిల్లలు. ముగ్గురు ఆడపిల్లలు. ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఉపాధ్యాయుడిగా, ఆకాశవాణిలో పనిచేశారు. ఆయన రాసిన మొదటి నవల 'టీకప్పులో తుఫాను'. ఇందులోనే మొట్ట మొదటిగా కాంతం పాత్ర కనపడుతుంది. కాంతం కుటుంబం పేద కుటుంబం. కాంతం కథలలో ఒకటి ఆయన రేడియో నాటకంగా రాస్తే ఆయన కుమార్తె కాంతంగా వేసి అందరినీ మెప్పించింది. ఆయన "కాంతం కథల" కి ఆయన భార్యే ప్రేరణ, స్ఫూర్తి. నిజ జీవితంలోనే దాంపత్య సన్నివేశాలను, చిన్న సంఘటనలను ఆధారంగా చేసుకుని రాసినవి కాబట్టే ఇప్పటికీ కాంతం కథలు నిత్య నూతన మనిపిస్తాయి. మన హాస్యం పేరుతో ఆయన చక్కని గ్రంథం వెలువరించారు. వక్రరేఖ తిరుమాళిగ, దీక్షితులు కాంతం, నేను–మా కాంతం (1933), కాంతం కైఫీయత్, కాంతం కాపురం, మునిమాణిక్యం కథలు, రుక్కుతల్లి – శరద్రాత్రులు, అన్నయ మంత్రి, మరపు, స్తుతి – ఆత్మస్తుతి, ఇల్లు – ఇల్లాలు, మంచివాళ్ళ మాట తీరులు, గాజుల పెట్టి, తల్లి ప్రేమ అయన రచనలలో ప్రసిద్ధం. తిరుమాళిగ, దక్కుతల్లి , దీక్షితులు నవలికలు – కరుణ రస భరితాలు. పిల్లలకు, విద్యార్థులకు సరిపడేలా అన్నయ మంత్రి, వక్రరేఖ నవలలను రచించారు. తిరుగు బాటు అనే నాటకం వ్రాశారు. ఇంటావిడతో పోట్లాట, ప్రణయ కలహం, భార్యను లొంగదీసు కోవడం ఎలా – వంటి రచనలు హాస్యస్ఫోరకాలు, మధ్యతరగతి సంసారాల దాంపత్య జీవిత రహస్యాలను ఆయన సజీవ పాత్రలుగా సృష్టించారు. తెలుగు సాహిత్యాన్ని తమ సునిశిత హాస్యంతో సుసంపన్నం చేసిన మునిమాణిక్యం ఫిబ్రవరి 4, 1973న మరణించారు.

# ఏ పార్టీ చూసిన అంతేగా... అంతేగా

**హైదరాబాద్, మార్చి 14, పెన్ పవర్:**
అనగనగా ఒక రాజు. ఓరోజు దర్బారులో పంచాయితీ నిర్వహిస్తున్నారు. ఓ దొంగతనం కేసులో అందరినీ విచారిస్తున్నారు. ఇంతకీ జరిగిన దొంగతనం ఏంటంటే.. ఓ రైతు మామిడి తోటలో కొందరు అక్రమంగా ప్రవేశించి మామిడి కాయలను దొంగింలించారు. ఆ తర్వాత వాటిని విక్రయించి, సొమ్ము చేసుకున్నారు.ఈ విషయాన్ని ఆ రైతు రాజుకు విన్నవించాడు. దీంతో పుర్వాపరాలు కనుకున్న రాజు దొంగతనం పంచాయతీని విచారించడం మొదలు పెట్టారు. అనుమానితులను పంచాయతీలో ప్రవేశపెట్టారు. ఒక్కొక్కరిని విచారించారు. అందరూ పొంతనలేని వివరాలు చెప్పారు. అయితే మామిడి కాయలను దొంగిలించామనే విషయాన్ని చెప్పకుండా విక్రయించిన విషయాన్నిఒప్పుకున్నారు. ఇదే విషయాన్ని పట్టుకున్న రాజు.. పదే పదే వారిని అడగడంతో మామిడికాయలను దొంగిలించామని ఒప్పుకున్నారు.రాజు విచారిస్తున్న సమయంలో ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఎవరూ తాము దొంగతనానికి పాల్పడలేదని చెప్పారు. ఈ ఉపోద్ఘాతం ఎందుకంటే.. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన పార్టీ, బాధిత పార్టీ చెబుతున్న మాటలు, వల్లె వేస్తున్న సుభాషితాలు అలాగే ఉన్నాయి మరి.వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆపరేషన్ ఆకర్ష్ కు తెరదీశారు. దుగ్యాల శ్రీనివాసరావు నుంచి మొదలు పెడితే సంతోష్ వరకు అందరూ కాంగ్రెస్ లో చేరారు. నాడు కేసీఆర్ ఆ పరిణామం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీలోకి ఎలా తీసుకుంటారు? పార్టీ ఫిరాయింపులకు ఎలా పాల్పడతారు అని ప్రశ్నించారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ తొలి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఫిరాయింపులకు గేట్లు తెరిచారు కేసీఆర్. టీడీపీ నుంచి మొదలు పెడితే వైసీపీ వరకు ఏ పార్టీని వదలకుండా అందరినీ వదలకుండా కొనేశారు. శాసనసభలో, శాసనమండలిలో ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకున్నారు.తెలంగాణలో 2023లో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ పార్టీకి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. అంతే కాదు, కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పచ్చజెండా ఊపింది. దీంతో గులాబీ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పల్లవి పాడారు. దీనిని ప్రశ్నిస్తూ గులాబీ పార్టీ సుప్రీం కోర్టు దాకా వెళ్లింది. అనేక దఫాలుగా కేసును విచారించిన సుప్రీం

కోర్టు నిర్ణయాధికారాన్ని స్పీకర్ కు వదిలేసింది. స్పీకర్ అనేక రకాలుగా విచారించి.. గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు అని చెప్పడానికి రుజువులు లేవని తేల్చి పడేశారు.ఈ పరిణామాన్ని గులాబీ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రజాస్వామ్యం సర్వనాశనమైందని విలపిస్తోంది. కానీ, అధికారంలో ఉన్నప్పుడు గులాబీ పార్టీ ఏ చేసింది? గులాబీ దళపతి ఎలాంటి వ్యాఖ్యలు చేశారు? అనే విషయాలను మర్చిపోతే ఎలా? ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో మాట్లాడే నైతికత గులాబీ పార్టీకి లేదు. సమర్థించుకునే స్థాయి కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రంలేదు. ఎందుకంటే అందరూ గురవింద గింజలే.

# అడగడుగునా అడ్డంకులు... ముందుకు సాగేదెలా

**హైదరాబాద్, మార్చి 14, పెన్ పవర్:**
హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చాలనే రేవంత్ రెడ్డి సర్కార్ సంకల్పంలో 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్' కీలకమైనది. అయితే, ప్రారంభం నుంచీ ఈ ప్రాజెక్టు విమర్శలు, రాజకీయ వివాదాలు, నిర్వాసితుల ఆందోళనల మధ్య నలిగిపోతోంది. ఈ నేపథ్యంలో, అపోహలను తొలగించి, ప్రాజెక్టు పారదర్శకతను చాటిచెప్పేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగం లోకి దిగారు. 500 మంది నిపుణులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఈ ప్రాజెక్టు భవితవ్యాన్ని నిర్ణయించబోయే ఒక కీలక మలుపు.సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టుల వివరణను అధికారులు లేదా కన్సల్టెంట్లు ఇస్తారు. కానీ మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎం స్వయంగా వివరణ ఇవ్వాలని నిర్ణయించుకోవడం వెనుక బలమైన రాజకీయ, పరిపాలనాపరమైన వ్యూహం ఉంది. బఫర్ జోన్ పరిధిలోని ఇళ్ల కూల్చివేతలు, నిర్వాసితులకు పరిహారం వంటి అంశాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నాయి. బాధితుల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు నేరుగా ముఖ్యమంత్రే హామీ ఇస్తున్నారు అనే నమ్మకాన్ని కలిగించడం దీని ప్రధాన ఉద్దేశం. మూసీని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో మారుస్తామన్న తన విజన్‌ను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లడం ద్వారా, అభివృద్ధి నిరోధకులు ఎవరో ప్రజలే తేల్చుకోవాలనే సంకేతాన్ని ఆయన ఇవ్వనున్నారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ప్రాజెక్టు పట్ల ప్రభుత్వానికి ఉన్న స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వారికి వివరించడం ద్వారా నిధుల సమీకరణను సులభతరం చేసుకోవడం మరో లక్ష్యంముఖ్యమంత్రి తన ప్రజెంటేషన్‌లో ఐదు దశల్లో జరగబోయే



అభివృద్ధిని వివరించనున్నారు. మొదటి దశలో చేపట్టబోయే పనులు, అందుకు అవసరమైన భూసేకరణ, రక్షణ గోడల నిర్మాణం గురించి క్లారిటీ ఇవ్వనున్నారు. 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలకు చట్టబద్ధంగా విలువ లేకపోయినా, మానవీయ కోణంలో ఇందిరమ్మ ఇళ్లు, ప్రత్యామ్నాయ స్థలాలు, ఆర్థిక సహాయం అందిస్తామని సీఎం హామీ ఇవ్వనున్నారు. బాపూఘాట్ వద్ద రూ.400 కోట్లతో నిర్మించ తలపెట్టిన 'గాంధీ సరోవర్', నది ఇరువైపులా నిర్మించబోయే ఎకనామిక్ జోన్ల గురించి విడమర్చి చెప్పనున్నారు.ప్రాజెక్టుకు మోక్షం కలగడం అనేది ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది. మేధా పాట్కర్ వంటి సామాజిక కార్యకర్తలు ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరుతున్నారు. ప్రజెంటేషన్ తర్వాత నిర్వాసితుల అనుమానాలు పటాపంచలైతేనే క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం అవుతాయి. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నేతలను ఆహ్వానించారు. ఒకవేళ ప్రతిపక్షాలు సానుకూలంగా స్పందిస్తే ప్రాజెక్టుకు రాజకీయ అడ్డంకులు తొలగుతాయి. లేనిపక్షంలో ఇది కేవలం అధికార పక్ష 'షో'గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. కేవలం డిజైన్లు చూపడం కాకుండా, క్షేత్రస్థాయిలో పునరావాస పనులు ఏ మేరకు పకడ్బందీగా జరుగుతాయన్న దానిపైనే ప్రాజెక్టు విజయం ఆధారపడి ఉంటుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రజెంటేషన్ ద్వారా మూసీ ప్రాజెక్టును రాజకీయ వివాదం నుంచి అభివృద్ధి అజెండాగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది కేవలం ఒక ప్రసంగం కాదు, హైదరాబాద్ భవిష్యత్తుపై ఆయన ఇస్తున్న భరోసా. ఈ వివరణ ప్రజల్లోకి బలంగా వెళ్తే, దశాబ్దాల కాలంగా మురుగు కూపంగా మారిన మూసీకి నిజంగానే పునరుజ్జీవం లభించే అవకాశం ఉంది. ఈ ప్రెజెంటేషన్ ఒక రకంగా మూసీ ప్రాజెక్టుకు అగ్నిపరీక్ష వంటిదని చెప్పవచ్చు.

## పశువులకు గాలి కుంటు టీకాలు తప్పనిసరి

**పాలకుర్తి, మార్చి 1 పెన్ పవర్:** పశువులను గాలి కుంటు వ్యాధి నుంచి రక్షించడానికి తప్పనిసరిగా టీకాలు వేయించాలని వెటర్నరీ వైద్యురాలు డాక్టర్ ఉజ్వల సూచించారు. శనివారం పినపాక మండలం ఈ బయ్యారం గ్రామంలో జరుగుతున్న గాలి కుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణలో టీకాల ప్రాముఖ్యతను వివరిస్తూ, ఈ వ్యాధి వ్యాప్తి చెందితే పశువులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, పాల ఉత్పత్తి కూడా తగ్గిపోతుందని ఆమె తెలిపారు.

## పినపాక 18వ డివిజన్‌లో నీటి సమస్య పరిష్కారం

**ఇల్లందు, మార్చి 14 పెన్ పవర్:** కొత్తగూడెం, పినపాకలోని 18వ డివిజన్ ప్రజలు ఆరు రోజులుగా కిన్నెరసాని మంచినీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న కార్పొరేటర్ కంచర్ల హిమాశ్రీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య, మినీ వాటర్ బోర్ నుండి వాటర్ పైపులైను పొడిగించి ప్రజలకు నీరు అందించారు. వార్డులోని ఏ సమస్యకైనా 24 గంటలు అందుబాటులో ఉంటానని, సమస్యలుంటే తెలియజేయాలని కంచర్ల హిమాశ్రీ ప్రజలను కోరారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

## పాఠశాల పరిసరాల్లో అధ్వాన్నంగా మురుగు కాల్వలు

**జనగామ, మార్చి 14 పెన్ పవర్:** హన్మకొండ జిల్లా మడికొండలోని పాఠశాల పరిసరాల్లో మురుగు కాల్వల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. కాల్వలు మురుగుతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈ అపరిశుభ్రత విద్యార్థుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కాల్వలను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వారు కోరుతున్నారు.

## కన్నయ్య్య గూడెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

**స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 14 పెన్ పవర్:** ములుగు జిల్లా ములుగు మండలం కన్నయ్య గూడెం గ్రామంలో ఇషా కేర్ హాస్పిటల్ వైద్య బృందం ఉచిత వైద్య శిబిరం శనివారం ఏర్పాటు చేసింది. ఈ శిబిరంలో బిపి, థైరాయిడ్, ఈసీజీ వంటి అన్ని రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు కూడా ఉచితంగా అందించారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

**పాలకుర్తి, మార్చి 14 పెన్ పవర్:** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా, ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శనివారం నర్సంపేటలోని జెడ్పిహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయా లేదా అన్న విషయాన్ని తెలుసుకొని, పరీక్షా కేంద్రంలో కల్పించిన కనీస మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## తరాలపల్లి గ్రామాల్లోని పరీక్షా కేంద్రాలను పరిశీలించిన సీఐ కిషన్



**నర్సంపేట, మార్చి 14 పెన్ పవర్:** హన్మకొండ జిల్లా మడికొండ, కడిపికొండ తరాలపల్లి గ్రామాల్లోని 10వ తరగతి బోర్డు పరీక్షా కేంద్రాలను సీఐ పుల్యాల కిషన్ శనివారం సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, అపరిచితుల ప్రవేశ నిషేధం, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చూడటం, మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా నిబంధనలు పాటించడం వంటి అంశాలపై ఆయన దృష్టి సారించారు. విద్యార్థులకు తాగునీరు, గాలి, వెలుతురు వంటి సౌకర్యాలు కల్పించాలని ఇన్విజిలేటర్లకు, అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో స్థానిక పోలీస్ సిబ్బంది, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిర్మాణంలో ఉన్న భవనంలో దంపతుల దారుణ హత్య

**మహబూబాబాద్, మార్చి 14 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు పరిధిలో జంట హత్యలు కలకలం రేపాయి. ఇంద్రేషం మున్సిపాలిటీలోని సిటీజెన్ కాలనీ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద వాచ్మెన్ గా పనిచేస్తున్న మహబూబాబాద్ జిల్లాకు చెందిన సోమ్లా దశరథ్ (50), మాన్యమ్మ (45) అనే దంపతులను గుర్తుతెలియని దుండగులు హత్య చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ హత్యలకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## డ్రైనేజీ శుభ్రం చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు

**డోర్నకల్, మార్చి 14 పెన్ పవర్:** వరంగల్ అర్బన్ 14వ డివిజన్‌లోని వా.ఖీ. నగర్‌లో గత రెండు నెలలుగా డ్రైనేజీని శుభ్రం చేయకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుధ్య కార్మికులు, కార్పొరేటర్లను సంప్రదించినా ప్రయోజనం లేదని, నాలాలు పిచ్చిమొక్కలు, చెత్తతో నిండిపోయాయని, దోమల బెడద వల్ల రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఉన్నత అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# చెన్నూరులో ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

**చెన్నూరు, మార్చి 14 పెన్ పవర్:** చెన్నూర్ పట్టణంలో 10వ తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్ నెంబర్లను సరిచూసుకుని, అనంతరం పరీక్ష గదులకు వెళ్లారు. కేంద్రాల వద్ద సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపించారు. పట్టణంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, మొత్తం 652 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు.

# లక్షెట్టిపేట పట్టణంలో ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

**మంచిర్యాల, మార్చి 14 పెన్ పవర్:** లక్షెట్టిపేట పట్టణంలో శనివారం 10వ తరగతి పరీక్షలు ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రారంభమయ్యాయి. మూడు పరీక్ష కేంద్రాలలో మొత్తం 773 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొని, నోటీస్ బోర్డులో తమ నంబర్లు చూసుకుని కేటాయించిన గదులకు వెళ్లారు. పరీక్షల నిర్వహణలో 36 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తిస్తున్నారని ఎంఈఓ శైలజ తెలిపారు.

# ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**బెల్లంపల్లి, మార్చి 14 పెన్ పవర్:** బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన కొట్టే శ్రీనివాస్ (44) ఆర్థిక ఇబ్బందుల కారణంగా భాగ్యనగర్ రైల్వే స్టేషన్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు జిఆర్పి హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. అతనికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# చిన్న బెండారలో పశువులకు గాలి కుంటు టీకాలు ప్రారంభం

**ఆసిఫాబాద్, మార్చి 14 పెన్ పవర్:** కొమరంభీం జిల్లా, ఆసిఫాబాద్‌లోని వాంకిడి మండలంలోని బెండార గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న బెండార గ్రామంలో పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం శనివారం నిర్వహించారు. సర్పంచ్ మొహర్లే రమేష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్య సిబ్బంది గణపతి, రాజు, నరేష్, వినోద్, లాలజి టీకాలు వేశారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు కూడా హాజరయ్యారు.

## వాంకిడిలో వాహన తనిఖీలు: పత్రాలు లేకుంటే సీల్

**సిర్పూర్, మార్చి 14 పెన్ పవర్:** వాంకిడి మండల కేంద్రంలో సెకండ్ ఎస్ఐ తులసి రామ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సరైన పత్రాలు లేకపోతే వాటిని సీల్ చేస్తామని, ట్రిపుల్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకు పంపుతామని ఎస్ఐ తులసిరాం హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

## జగిత్యాల జిల్లాకు తేలికపాటి వర్ష సూచన

**జగిత్యాల, మార్చి 14 పెన్ పవర్:** జగిత్యాల జిల్లాలో ఈ నెల 16 నుంచి 18వతేదీ వరకు తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని పొలాస పరిశోధన స్థానం సాంకేతిక అధికారిణి బి. శ్రీలక్ష్మి తెలిపారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 20–23 డిగ్రీలు, గరిష్ఠంగా 36–38 డిగ్రీల సెల్సియస్ వరకు, గాలిలో తేమ 51–78 శాతం వరకు నమోదవుతాయని ఆమె చెప్పారు. ఈ సమాచారం రైతులు తమ వ్యవసాయ పనులకు ఉపయోగించుకోవాలని సూచించారు.

## బండి సంజయ్ యాత్రలో బీజేపీ కార్యకర్తలు

**రామగుండం, మార్చి 14 పెన్ పవర్:** కేంద్ర మంత్రి బండి సంజయ్ చేపట్టిన 'అంజన్న ఆశీర్వాద యాత్ర'లో రామగుండం బీజేపీ ఇన్‌ఛార్జ్ కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కరీంనగర్ మహాశక్తి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో ఆమె పాల్గొని మద్దతు తెలిపారు. హిందూ ఐక్యతకు ఇటువంటి యాత్రలు అవసరమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుభాశ్, నరేశ్ పాల్గొన్నారు.

# 16 నుంచి ఒంటి పూట బడులు

**పెద్దపల్లి, మార్చి 14 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 16వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని జిల్లా విద్యాధికారి శారద ఆదేశించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు జరుగుతాయి. అయితే, టెన్త్ పరీక్షలు జరిగే పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు కొనసాగుతాయి. ఈ నిబంధనలను పాటించని పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

# పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి



**కోరుట్ల, మార్చి 14 పెన్ పవర్:** పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జమ్మికుంటలోని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే లోపలికి అనుమతించామని విద్యాధికారిణి హేమలత తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తల్లిదండ్రులు తమ పిల్లలకు పలు సూచనలు చేశారు. జమ్మికుంటలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

# సామాజిక కట్టుబాట్లు ఇంకెన్నాళ్లు?

**ధర్మపురి, మార్చి 14 పెన్ పవర్:** కొత్తకొత్త చట్టాలు వస్తున్నాయి.. రాజ్యాంగం మనకు చాలా హక్కులు కల్పించింది.. కానీ ఇంకా సామాజిక కట్టుబాట్లు పాటించటంతో మనం ఏ మేరకు అభివృద్ధి చెందామో తెలియజేస్తోంది. ఇటీవల కాలంలో కుల బహిష్కరణ, సామాజిక వెలివేత తదితర ఘటనలు పెరగటం ఆందోళన కల్గిస్తోంది. ఒక వ్యక్తి లేదా కుటుంబం గ్రామంలోని సాంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించిందనే నెపంతో వారిని ఊరి నుంచి లేదా కులం నుంచి వెలివేయటం ఇప్పటికి కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తోంది. ఈ చర్యలు కేవలం సామాజిక వివక్ష మాత్రమే కాదు మానవహక్కుల ఉల్లంఘణ కిందకి వస్తాయి.

# అంగరంగ వైభవంగా రామయ్య నిత్య కళ్యాణం



**అశ్వారావుపేట, మార్చి 14 పెన్ పవర్:** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం రామయ్య నిత్య కళ్యాణం అర్చకులచే శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. ఉదయం బేడా మండపంలో సుప్రభాత సేవ అనంతరం సీతారాములకు వివాహ క్రతువు జరిపించారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులు తలంబ్రాలు స్వీకరించి రామయ్య ఆశీస్సులు పొందారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మసకబారుతున్న ఫీజురీయింబర్స్‌మెంట్ ఉద్దేశం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో సామాజిక న్యాయం, సమాన విద్యా అవకాశాల సాధన అనేది కేవలం రాజ్యాంగబద్ధమైన లక్ష్యం మాత్రమే కాదు, అది ఒక తరం భవిష్యత్తును నిర్ణయించే కీలక శక్తి. ఈ క్రమంలోనే ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అత్యంత సాహసోపేతమైన, మానవీయమైన పథకం 'ఫీజు రీయింబర్స్‌మెంట్'. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక కారణాల వల్ల ఉన్నత విద్యకు దూరం కాకూడదనే సత్సంకల్పంతో ప్రారంభమైన ఈ పథకం, గత రెండు దశాబ్దాలుగా లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపింది. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో ఈ పథకం ఒక విప్లవాత్మక మార్పుగా రూపుదిద్దుకుంది. అంతకుముందు వరకు కేవలం సంపన్న వర్గాలకు మాత్రమే పరిమితమైన ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ వంటి వృత్తి విద్యా కోర్సులు, ఈ పథకం పుణ్యమా అని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య రైతు బిడ్డలకు కూడా అందుబాటులోకి వచ్చాయి. సామాజికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ 100 శాతం ఫీజు చెల్లింపు హామీని ప్రభుత్వం ఇవ్వడంతో, ఉన్నత విద్యలో ప్రవేశాల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. గణాంకాలను పరిశీలిస్తే, ఈ పథకం అమలులోకి రాకముందు వృత్తి విద్యా కోర్సుల్లో చేరే గ్రామీణ విద్యార్థుల శాతం 20 కంటే తక్కువగా ఉండగా, 2010 నాటికి అది 50 శాతానికి పైగా చేరుకోవడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఈ పథకం 'రీజినల్ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ' మార్గదర్శకాల ప్రకారం కొనసాగుతూ వస్తోంది. తెలంగాణలో ప్రతి ఏటా సుమారు 10 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో సుమారు 5,000 నుండి 6,000 కోట్ల రూపాయల వరకు నిధులను కేటాయిస్తోంది. ఇందులో ట్యూషన్ ఫీజుతోపాటు విద్యార్థుల భోజన, వసతి ఖర్చుల కోసం ఇచ్చే మెస్ ఛార్జీలు కూడా కలిసి ఉంటాయి. అయితే, ఇంతటి ప్రతిష్టాత్మకమైన పథకం గత కొన్నేళ్లుగా తీవ్రమైన నిధుల కొరత మరియు పరిపాలనాపరమైన జాప్యంతో సతమతమవుతోంది. ప్రభుత్వం నుండి సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో బకాయిలు కొండలా పేరుకు పోతున్నాయి. తాజా నివేదికల ప్రకారం, గత రెండు మూడు విద్యా సంవత్సరాలకు సంబంధించి వేల కోట్ల రూపాయల బకాయిలు ఇంకా చెల్లింపులకు నోచుకోలేదు. ఈ పరిస్థితి అటు విద్యార్థులను, ఇటు విద్యాసంస్థలను అగమ్య గోచరంలోకి నెట్టి వేస్తోంది. ప్రైవేట్ కళాశాలలు ప్రధానంగా ఈ రీయింబర్స్‌మెంట్ నిధులపైనే ఆధారపడి నడుస్తుంటాయి. అధ్యాపకుల జీతాలు, భవనాల అద్దెలు, ల్యాబ్ నిర్వహణ మరియు ఇతర మౌలిక వసతుల కల్పన అంతా ఈ నిధులతోనే ముడిపడి ఉంటుంది. ప్రభుత్వం నుండి ఒకటి రెండు ఏళ్ల పాటు నిధులు రాకపోవడంతో అనేక చిన్న మరియు మధ్య తరహా కళాశాలలు మూతపడే దిశగా వెళ్తున్నాయి. ఇది విద్యా ప్రమాణాల పతనానికి దారితీస్తోంది. మరోవైపు, ఈ బకాయిల భారానికి బలి అవుతున్నది మాత్రం నిరుపేద విద్యార్థులే. కళాశాల యాజమాన్యాలు తమ ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. ప్రభుత్వం నుండి డబ్బులు వచ్చే వరకు ఎదురు చూడలేమని, విద్యార్థులే స్వయంగా ఫీజులు చెల్లించాలని కొన్ని యాజమాన్యాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయి. దీనివల్ల పరీక్షల సమయంలో హాల్ టికెట్లు నిలిపివేయడం, కోర్సు పూర్తయిన తర్వాత ఒరిజినల్ సర్టిఫికేట్లు మరియు మార్కుల మెమోలు ఇవ్వకుండా ఆపివేయడం వంటి సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా నిత్యకృత్యమయ్యాయి. ఉన్నత చదువులు చదివినా పట్టా చేతికి అందక, ఉద్యోగాల దరఖాస్తులకు అనర్హులుగా మారుతున్న వేలాది మంది యువతలో మానసిక ఆందోళన పెరుగుతోంది. తమ తప్పు లేకపోయినా, కేవలం ప్రభుత్వ చెల్లింపుల జాప్యం వల్ల తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య వెనుక ఉన్న కారణాలను విశ్లేషిస్తే, ఆర్థిక ప్రాధాన్యతలలో మార్పులు మరియు పరిపాలనాపరమైన చిక్కులు ప్రధానంగా కనిపిస్తాయి. ప్రభుత్వాలు ప్రజాకర్షక పథకాలకు ప్రాధాన్యత ఇస్తూ, విద్యా రంగం వంటి దీర్ఘకాలిక పెట్టుబడి రంగాలను విస్మరిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బడ్జెట్ కేటాయింపులు కాగితాల మీద భారీగా కనిపిస్తున్నా, వాస్తవ విడుదల విషయంలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. అంతేకాకుండా, విద్యార్థుల ఆదాయ ధృవీకరణ పత్రాల తనిఖీ, కాలేజీల అఫిలియేషన్ ప్రక్రియలో ఉన్న సంక్లిష్టతలు కూడా నిధుల విడుదలకు అడ్డంకిగా మారుతున్నాయి. ఆధార్ అనుసంధానం, బయోమెట్రిక్ హాజరు వంటి సాంకేతిక సంస్కరణలు ప్రవేశపెట్టి నప్పటికీ, డేటా ప్రాసెసింగ్‌లో నెలకొన్న లోపాలు లబ్ధిదారులకు శాపంగా పరిణమించాయి. ఈ అనిశ్చితి వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులకు పంపించాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. విద్యా రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపకపోతే సామాజిక చలనం దెబ్బతింటుంది. అంటే, ఒక తరం తన ఆర్థిక స్థితిగతులను మార్చుకోవడానికి ఉన్న ఏకైక మార్గం విద్య. ఆ విద్యనే దూరం చేస్తే, పేదరికం వారసత్వంగా కొనసాగే ప్రమాదం ఉంది. మానవ వనరుల అభివృద్ధిని కాంక్షించే ఏ ప్రభుత్వమైనా విద్యను కేవలం ఒక సంక్షేమ ఖర్చుగా కాకుండా, దేశ ప్రగతికి పునాదిగా భావించాలి. ప్రస్తుత సంక్షోభం నుండి గట్టెక్కాలంటే ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన కార్యాచరణను రూపొందించు కోవాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం విడుదల చేసే విధంగా ఒక 'గ్రీన్ ఛానల్' వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించకుండా, కేవలం విద్య కోసమే వినియోగించేలా చట్టబద్ధమైన హామీ ఉండాలి. అలాగే, విద్యార్థుల ధృవీకరణ ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ, పూర్తిస్థాయి డిజిటలైజేషన్ ద్వారా జాప్యాన్ని నివారించాలి. విద్యాసంస్థలు కూడా విద్యార్థుల సర్టిఫికేట్లను అడ్డుకోకుండా, ప్రభుత్వం నుండి వచ్చే బకాయిల కోసం చట్టబద్ధమైన పోరాటం చేయాలే తప్ప విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకో కూడదు. ప్రభుత్వం, విద్యాసంస్థలు మరియు విద్యార్థి సంఘాల మధ్య సమన్వయం కుదిరినప్పుడే ఈ పథకం తన అసలు లక్ష్యాన్ని చేరుకోగలదు. ముగింపుగా చెప్పాలంటే, ఒక దేశం యొక్క గొప్పతనం అది నిర్మించిన భవనాల్లో లేదు, అది తీర్చిదిద్దిన మేధావుల ఆలోచనల్లో ఉంటుంది. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదన్న రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడు కోవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. బకాయిలను వెంటనే చెల్లించి, విద్యార్థుల గుండెల్లో గూడుకట్టుకున్న ఆందోళన మబ్బులను తొలగించడమే నేటి తక్షణ అవసరం. అప్పుడే మన దేశ యువత ప్రపంచ వేదికపై సగర్వంగా నిలబడి, నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కాగలరు. విద్యార్థుల భవిష్యత్తుపై మబ్బులు వీడి, జ్ఞాన సూర్యుడు ప్రకాశించాలంటే ప్రభుత్వాల సంకల్పం దృఢంగా ఉండాలి.

# వినియోగదారుల హక్కులకు గుర్తింపు ఏదీ?

**హైదరాబాద్ పెన్ పవర్:** వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం.. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల యొక్క హక్కు అని అర్థం. 1962, మార్చి 15న అమెరికా దిగువ సభలో వినియోగదారు హక్కుల బిల్లును ప్రతిపాదించగా అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడి అమెరికా ప్రజలకు మొదటిసారిగా నాలుగు వినియోగదారుల హక్కులు ప్రకటించాడు. 1972లో అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకుడు అన్వర్ ఫజల్ మార్చి15 తేదీని ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా పరిగణించాలని తీర్మానించారు. దాంతో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 20 సంఘాలు, సంస్థలు 1973 మార్చి 15 ని వినియోగ దారుల హక్కుల దినంగా పాటించాయి. భారత దేశంలో 1986లో వినియోగ దారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు. భారత రాష్ట్రపతి ఆమోదంతో 1986 డిసెంబర్ 24న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ చట్టం ప్రకారం వినియోగ దారులకు ఆరు హక్కులు ప్రకటించింది. వినియోగ దారుల రక్షణ మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాద కారక వస్తువులు, సేవల నుంచి రక్షణ పొందే హక్కు... అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు, సేవలను పొందాలి. సమాచారం పొందే హక్కు...అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగ దారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియ జేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది. వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు...వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసు కోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం. ప్రాతినిధ్యం వహించే హక్కు..వినియోగదారుల ఆసక్తిని, వారి అవసరాలను సరైన వేదికలు, ఫోరంలలో వినిపించడం. వినియోగదారుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన వివిధ వేదికలలో ప్రాతినిధ్యం వహించడం. వినియోగదారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవాలోపాలు, వస్తు లోపాల నుండి పరిహారం పొందే హక్కు... వినియోగ దారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం. వినియోగ దారుల విద్య హక్కు... వినియోగ దారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచు కోవడం, నైపుణ్యాలను పెంపొందించు కోవడం ఎంతో అవసరం. గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారులు హక్కుల పట్ల అవగాహన లేక ఎంతో మోసపోతున్నారు. భారత ప్రభుత్వం 1989లో మార్చి 15వ తేదీని వినియోగ దారుల దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మనం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని మార్చి 15 న జరుపుకుంటున్నాం. నూతన వ్యాపారాభివృద్ధి సంస్కరణల వల్ల ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో, ఈ–కామర్స్, టెలిషాపింగ్ విధానంలో వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రజలను మోసగించే సైబర్ నేరాలు దీని వల్ల చోటుచేసు కుంటున్నాయి. వినియోగ దారులను తప్పుడు ప్రకటనలు, సందేశాలతో మోసగించడం పెరిగి పోతున్నది. దీంతో వినియోగ దారుల హక్కుల రక్షణ కోసం కొత్త చట్టాల ఆవశ్యకత ఏర్పడింది. 1986నాటి చట్టం స్థానంలో 2019లో మరో చట్టాన్ని రూపొందించారు. అది ఈ 2020 సంవత్సరంలో అమలులోకి వచ్చింది. వాణిజ్య వ్యాపారాల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో, సేవా సంస్థల్లో పనిచేసే వారు నిర్లక్ష్యంగా, మోస పూరితంగా వ్యవహరించినప్పుడు కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రపంచం లోని చట్టాలన్నింటి కన్నా మెరుగ్గా భారత దేశంలో తొలిసారి 1986లో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుముతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. ఇప్పుడు సైబర్ నేరాల కారణంగా దాని స్థానంలో కొత్త చట్టాన్ని తెచ్చారు. ఈ నూతన చట్టాన్ని 2020 జూలై 20 నుంచి దేశవ్యాప్తంగా అమలు పరుస్తున్నారు. వినియోగదారులకు తక్కువ ఖర్చులో, ఇబ్బందులకు తావు లేని రీతిలో, శీఘ్రంగా ఫిర్యాదులను పరిష్కరించే వెసులుబాటు కల్పించాలనే సంకల్పంతో దేశ వ్యాప్తంగా వేరు వేరు స్థాయిలలో వినియోగదారు వేదికలను నెలకొల్పడం జరిగింది. వినియోగదారు రక్షణ చట్టంలోని 9వ సెక్షన్ మూడు అంచెల వివాద పరిష్కార సంస్థల ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. (ఎ) కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార సంఘం. ఈ కోర్టునే జాతీయ సంఘంగా వ్యవహరిస్తారు. (బి). కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే రాష్ట్ర వినియోగదారు పరిష్కార సంఘం. ఈ కోర్టునే రాష్ట్ర సంఘంగా కూడా వ్యవహరిస్తారు. (సి). రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఆ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేసే వినియోగదారు వివాదాల పరిష్కార వేదిక. ఈ కోర్టునే డిస్ట్రిక్ట్ ఫోరమ్ గా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏజెన్సీలన్నీ వాటి స్వభావం, అధికారాల పరంగా క్వాసీ– జ్యుడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి. జాతీయస్థాయిలో సెంట్రల్ కన్స్యూమర్ అథారిటీ అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించి తగిన విచారణాధికారాలు, విచక్షణాధికారాలు కల్పించారు. ఇందులో డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉంటుంది. నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై అవసరమైన చర్యలు తీసుకుంటారు. నూతన చట్టం ప్రకారం.. అరెస్టులు చేయించే అధికారం, మూడు సంవత్సరాల వరకు జైలు శిక్షను, పది లక్షల రూపాయల వరకూ జరిమానాను విధించే అధికారం సెంట్రల్ అథారిటీకి ఉంటుంది. జిల్లా కమిషన్లు ఇచ్చిన తీర్పులపై ఉన్నత రాష్ట్రస్థాయి కమిషన్‌ను ఆశ్రయించేందుకు వ్యతిరేక పార్టీ కనీసం యాభైశాతం లేదా రూ.25 వేలు రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ద గతంలో ఉన్న 30 రోజులకు బదులుగా 45 రోజులుగా కాలవ్యవధిని నిర్ణయించారు. రాష్ట్ర కమిషన్‌లో ప్రెసిడెంట్‌తో పాటు విధిగా నలుగురు సభ్యులుండాలి. రెండు బెంచీలు నిర్వహించి వినియోగ దారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషిచేయాలి. ఈ మేరకు రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అధ్యక్షులు, సభ్యుల నియామకం కాలాన్ని ఐదేండ్లకు బదులు నాలుగేండ్లకు కుదించారు. గరిష్ఠ వయస్సు 65 ఏండ్లుగా నిర్ణయించారు. రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. నూతన వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో, కళాశాల, విశ్వ విద్యాలయాల్లో పాఠ్య పుస్తకాల్లో, పాఠ్యాంశాల్లో వినియోగ దారుల విద్య, చట్టం ప్రాధాన్యం, అమలుపై గురించి తెలియ జేయాలి.

# కూటమిలో పైన పటారం..లోన లోటారం

**విజయవాడ, మార్చి 14 , పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , బీజేపీ అగ్రనేతలు అత్యంత సమన్వయంతో, ఒకే మాట – ఒకే బాట అన్నట్లుగా ముందుకు సాగుతున్నారు. కానీ, క్షేత్రస్థాయి నియోజకవర్గాల్లో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పాత కక్షలు, ఆధిపత్య పోరాటాలు కూటమి నేతల మధ్య చిచ్చు పెడుతున్నాయి. కదిరిలో బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి గృహనిర్బంధం ఘటన ఈ అంతర్గత విభేదాలకు ఒక నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. రాజకీయేతర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించుకోవాలని చూడటం కూటమి భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకొనేలా చేస్తోంది.కదిరి తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో ఈ హైపర్ లోకల్ పోరు ముదురుతోంది. దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో తమకు కనీస గౌరవం దక్కడం లేదని ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే పార్టీ కాకుండా ఇతర పార్టీల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. నిడదవోలు, తిరుపతి సహా చాలా చోట్ల ఇలాంటివి బహిరంగ వివాదాలకు కారణం అయ్యాయి. మెజార్టీ నియోజకవర్గాల్లో పార్టీల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పాత ప్రత్యర్థులుగా ఉన్న నేతలు ఇప్పుడు ఒకే గొడుగు కిందకు వచ్చినా, మనసులు మాత్రం కలవలేదని ఈ సంఘటనలు నిరూపిస్తున్నాయి.నామినేటెడ్ పోస్టుల పంపిణీ విషయంలో కూడా కింది స్థాయి కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. జనసేన , బీజేపీ శ్రేణులు తమకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదని భావిస్తుంటే, పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి పోరాడిన తమను కాదని కొత్తగా వచ్చిన




వారికి ప్రాముఖ్యత ఇస్తున్నారని టీడీపీ క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ పవర్ షేరింగ్ చిక్కుముడిని విప్పకపోతే, అది రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ ఆధిపత్య పోరాటం ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు కూడా పాకుతున్నాయి. కదిరి రథోత్సవంలో విష్ణువర్ధన్ రెడ్డికి పర్మిషన్ లేదని టీడీపీ ఎమ్మెల్యే హుకుం జారీ చేయడం, బీజేపీ–టీడీపిల మధ్య ఉన్న దూరాన్ని పెంచింది. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వైసీపీ వంటి ప్రతిపక్షాలు దీన్ని అస్త్రంగా మార్చుకుని, కూటమిలో ఐక్యత లేదు అనే ప్రచారాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. ఇది కూటమి ప్రభుత్వం సాధిస్తున్న అభివృద్ధి ఫలాలను ప్రజలు గుర్తించకుండా చేస్తోంది. పై స్థాయిలో ఎంత ఐక్యత ఉన్నా, కింది స్థాయిలో కార్యకర్తలు, నాయకుల మధ్య సయోధ్య లేకపోతే అది సమస్యగా మారుతుంది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మాధవ్ వెంటనే జోక్యం చేసుకుని నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీలను పటిష్టం చేయకపోతే, ఈ ఆధిపత్య పోరాటం చిలికి చిలికి గాలివానలా మారి కూటమిని ఇబ్బందుల్లోకి నెట్టే ప్రమాదం ఉందన్న భావన వ్యక్తమవుతోంది.

# ఇండియాలో ఫస్ట్...
# మారిటైమ్ షిప్‌బిల్డింగ్ అండ్ సిస్టమ్స్ సెంటర్

**నెల్లూరు మార్చి 14, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు వేదిక అయింది. దేశీయ సముద్ర సాంకేతికత , రక్షణ రంగ ఉత్పత్తిని బలోపేతం చేసే దిశగా, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో ప్రపంచంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ అండ్ సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు కానుంది. సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బోగోలు మండలం బంగాళాఖాతం తీరంలో ఈ కేంద్రాన్ని నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూమిపూజ నారా లోకేష్ చేతుల మీదుగా జరిగింది. దాదాపు 29.58 ఎకరాల విస్తీర్ణంలో మొదటి విడతగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో స్వయంప్రతిపత్తి కలిగిన నౌకల నిర్మాణం , పరిశోధన మరియు అభివృద్ధి , షిప్ మెయింటెనెన్స్ అండ్ రిపేర్ వంటి అత్యాధునిక సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఉండనున్నాయి. ప్రధానంగా రక్షణ, వాణిజ్య , తీరప్రాంత భద్రతా అవసరాల కోసం మానవరహిత ఉపరితల నౌకలు, అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్ డిజైన్ చేయడం, నిర్మించడంపై ఈ కేంద్రం దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెరైన్ రోబోటిక్స్ వంటి అధునాతన సాంకేతికతలను ఇక్కడ వినియోగించనున్నారు.ఈ కేంద్రం ఏర్పాటుతో రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా భారీ ఊతం లభించనుంది. దీని ద్వారా దాదాపు 300 మందికి పైగా ఇంజనీర్లు, నేవల్ ఆర్కిటెక్టులు , ఇతర సాంకేతిక నిపుణులకు ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. అంతేకాకుండా, ఇక్కడి ఎంఆర్‌ఓ ఫెసిలిటీ వల్ల స్థానిక మత్స్యకారుల బోట్లు, కోస్ట్‌గార్డ్ , నేవీ నౌకల మరమ్మతులు వేగంగా జరిగి, పనిదినాల నష్టం తగ్గుతుంది. మత్స్యకారులకు రియల్ టైమ్ ఫిష్ లొకేషన్ మ్యాప్స్, శాటిలైట్ వెదర్ అలర్ట్స్ వంటి సాంకేతిక సాయం కూడా అందనుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే నెల్లూరు జిల్లా అంతర్జాతీయ సముద్ర సాంకేతిక చిత్రపటంలో కీలక స్థానాన్ని ఆక్రమిస్తుంది. అత్యాధునిక సెన్సార్ ఇంటిగ్రేషన్, నావిగేషన్ సిస్టమ్స్ మరియు రిమోట్ కంట్రోల్ టెక్నాలజీలతో రూపొందే ఈ నౌకలు సముద్ర నిఘా, మైన్ డిటెక్షన్ , లాజిస్టిక్స్ సపోర్ట్ వంటి కీలకమైన కార్యకలాపాల్లో దేశానికి రక్షణ కవచంలా మారనున్నాయి

# వైసీపీకి అలేఖ్య బాణం...

**విజయవాడ, మార్చి 14, పెన్ పవర్:**
నందమూరి తారకరత్న భార్య అలేఖ్య రెడ్డి పొలిటికల్ ఎంట్రీ పై అప్పుడే అనేక రకాల చర్చలు ప్రారంభం అయ్యాయి. ఏమో రాజకీయాల్లోకి రావచ్చు అన్న మాటలతో నందమూరి అభిమానులతో పాటు టిడిపి మద్దతుదారులలో ఒక ఆసక్తిని రేకెత్తించింది. రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్నట్లు అలేఖ్య రెడ్డి ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. అయితే ఆమె వైసీపీ మాజీ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డికి సమీప బంధువు. దీంతో ఆమె పొలిటికల్ ఎంట్రీ పై భిన్న కామెంట్స్ వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు అలేఖ్య రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఒకరకమైన గందరగోళానికి దారితీస్తున్నాయి. తారకరత్న మృతి చెంది మూడేళ్లు అవుతోంది. అయితే ఆమెకు అత్తింటి వారి నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లేదని ఆమె మాటల్లోనే అర్థమవుతోంది. అదే సమయంలో చంద్రబాబు, బాలకృష్ణ విషయంలో ఆమె సాఫ్ట్ గానే ఉన్నట్లు కనిపిస్తున్నారు.లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న తారకరత్న అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయారు. కానీ ఆయన భార్య అలేఖ్య రెడ్డి మాత్రం ఒంటరిగానే ఉంటున్నారు. ఈ క్రమంలో తాజాగా కొన్ని ఇంటర్వ్యూలో రాజకీయపరమైన ప్రకటనలు చేశారు. ఆమె నందమూరి వారి కోడలు కావడంతో పొలిటికల్ ఎంట్రీ అనగానే టిడిపిలో అడుగుపెడతారని భావిస్తారు. కానీ అలేఖ్య రెడ్డి మాత్రం తాను రాజకీయాల్లోకి వస్తాను కానీ.. అందుకు ఏ పార్టీ సరైనది అని నిర్ధారించుకోలేదని చెప్పారు.అలేఖ్య రెడ్డిమాటలు చూస్తే మాత్రం ఆమె నందమూరి కుటుంబం పై అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తున్నారు. అలేఖ్య రెడ్డిని పెద్దలకు ఇష్టం లేకున్నా ప్రేమ వివాహం చేసుకున్నారు తారకరత్న. కుటుంబ సభ్యుల సంపూర్ణ అంగీకారం లేకుండానే వారి



వివాహం జరిగినట్లు ఆమె మాటల్లోనే అర్థమవుతోంది. అయితే ఇటువంటి అసంతృప్తితో ఉన్న క్రమంలో ఆమె పొలిటికల్ ఎంట్రీ ప్రకటన చేయడం మాత్రం ఆసక్తి రేపుతోంది. పైగా విజయసాయిరెడ్డి సమీప బంధువు కావడం.. ఆయన ఆ కుటుంబానికి అండగా నిలుస్తుండడం చూస్తుంటే మాత్రం ఆయనతో కలిసి ఏదైనా నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. అయితే ఈ అవకాశాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పకుండా తమకు అనుకూలంగా మార్చుకోగలదు. ఎందుకంటే ఇప్పటికే లక్ష్మీపార్వతిని ఇలానే టిడిపి నాయకత్వం పై ప్రయోగిస్తోంది.ఇప్పటికే లక్ష్మీపార్వతి చంద్రబాబు తో పాటు నందమూరి కుటుంబాన్ని టార్గెట్ చేసుకుంటూ వస్తున్నారు. చంద్రబాబుపై ఘాటు వ్యాఖ్యలు చేయాలంటే నందమూరి కుటుంబం పై సాఫ్ట్ కార్నర్ తో మాట్లాడుతుంటారు. అలాగే నందమూరి కుటుంబ సభ్యులకు కూడా విమర్శలు చేస్తుంటారు. జూనియర్ ఎన్టీఆర్ విషయంలో లక్ష్మీపార్వతి కన్నీరు కారుస్తుంటారు. అందుకే ఇప్పుడు అలేఖ్య రెడ్డిని పార్టీలోకి తీసుకొని.. టిడిపి నాయకత్వంతో పాటు నందమూరి కుటుంబాన్ని టార్గెట్ చేయవచ్చు. ఇటువంటి రాజకీయాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీది అందివేసిన చేయి. అందుకే అలేఖ్య రెడ్డి పొలిటికల్ ఎంట్రీ ప్రకటన ఏపీలో హాట్ టాపిక్ అవుతోంది. ఆమె ప్రయాణం ఎలా ఉండబోతుంది? ఆమె ఎవరు వదిలిన బాణం అన్నది తెలియాల్సి ఉంది.

# అప్పుల బాధతో మహిళ అత్మహత్య

**తాండూర్: పెన్ పవర్:** అప్పుల బాధ తట్టుకోలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం లో చోటు చేసుకుంది. తాము ఇచ్చిన లక్ష రూపాయలు వెంటనే చెల్లించాలంటూ వడ్డీ వ్యాపారులు చేసిన వేధింపులు తట్టుకోలేక, పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితేడ. తాండూరు మండలం సిరిగిరి పెట్ కు చెందిన లక్ష్మి అప్పుల బాధకు ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త తెలిపిన వివరాల ప్రకారం.. తన భార్య లక్ష్మి స్థానికంగా ఉండే హనుమంత్ రెడ్డి వద్ద లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నారు. పంటలు పండకపోవడంతో గడువులోగా డబ్బు చెల్లించలేకపోయారు. దీంతో హనుమంత్ రెడ్డి దంపతులు లక్ష్మిపై ఒత్తిడి పెంచారు. సమయం ఇవ్వాలని ప్రాధేయపడినా వినకుండా, ఊరిలో అందరూ చూస్తుండగానే అసభ్య పదజాలంతో దూషించి, సూటిపోటి మాటలతో తీవ్రంగా అవమానించారని ఆవేదన వ్యక్తం చేసాడు. నిందితులు చేసిన అవమానాన్ని భరించలేక లక్ష్మి తీవ్ర మనస్తాపానికి గురై, తన వల్ల కుటుంబానికి అవమానం జరిగిందన్న బాధతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిందని తెలిపారు. మేము పొలం అమ్మి అయినా మీ బాకీ తీరుస్తామని చెప్పాం, కానీ వారు కనికరం లేకుండా మాట్లాడారు. ఇప్పుడు నా పిల్లలు తల్లి లేని అనాథలయ్యారు అని మృతురాలి భర్త ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై స్థానిక పోలీస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

# రామయ్య కళ్యాణానికి అంతా సిద్ధం

**కడప, మార్చి 14, పెన్ పవర్:** మార్చి 26 గురువారం నుంచి ఏప్రిల్ 05 ఆదివారం వరకు ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఏప్రిల్ 1 సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం జరుగుతుందికడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో మార్చి 26 నుంచి ఏప్రిల్ 05 వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆలయంలో మార్చి 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, మార్చి 26న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు కన్నులపండువగా నిర్వహిస్తారు

**బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరంగా**

2026 మార్చి 27 శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10.15 గంటల వరకు వృషభ లగ్నంలో ధ్వజారోహణం

ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు శ్రీరామనవమి ఆస్థానం

సాయంత్రం 4 గంటల నుంచి పోతన జయంతి, కవి సమ్మేళనం జరుగుతుంది

ఇదే రోజు రాత్రి శేష వాహనంపై స్వామివారు విహరిస్తారు

మార్చి 28 శనివారం ఉదయం వేణుగానాలంకారం, శనివారం రాత్రి హంస వాహన సేవ

మార్చి 29 ఆదివారం ఉదయం వటపత్రశాయి అలంకారం, ఆదివారం రాత్రి సింహ వాహన సేవ

మార్చి 30 సోమవారం ఉదయం నవనీత కృష్ణాలంకారం, సోమవారం రాత్రి హనుమంత వాహన సేవ

మార్చి 31 మంగళవారం ఉదయం మోహినీ అలంకారం, మంగళనాపం రాత్రి గరుడవాహనసేవ జరుగుతుంది

ఏప్రిల్ 1 బుధవారం ఉదయం శివధనుర్భాణ అలంకరణ, మధ్యాహ్నం 03.15 గంటలకు కాంత కోరిక, ఎదుర్కోలు ఉత్సవం. ఇదే రోజు సాయంత్రం 06.30 గంటల నుంచి 08.30 గంటల వరకు శ్రీ సీతారామ కల్యాణోత్సవం, ఈ రోజు రాత్రి గజవాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహిస్తారు

ఏప్రిల్ 02 గురువారం ఉదయం రథోత్సవం

ఏప్రిల్ 03 శుక్రవారం ఉదయం కాళీయమర్ధనాలంకారం, రాత్రి అశ్వవాహన సేవ జరుగుతుంది

ఏప్రిల్ 04 శనివారం ఉదయం చక్రస్నానం...రాత్రి ధ్వజావరోహణం.

ఏప్రిల్ 05వ తేదీ ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం నిర్వహిస్తారు

2026 మార్చి 27 శుక్రవారం శ్రీరామనవమి, భద్రాచల క్షేత్రంలో సీతారాముల కళ్యాణోత్సవం జరుగుతుంది. పౌర్ణమి రోజు ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణం జరుగుతుందికడప జిల్లా ఒంటిమిట్టలో ప్రసిద్ధి కోదండరామాస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. సాధారణంగా నవమి రోజు కాకుండా చైత్ర పౌర్ణమి రోజు అంటే..నవమి తర్వాత దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్ధశి ముగిసిన తర్వాత పౌర్ణమి రోజు వెన్నెల వెలుగులో సీతారాముల కళ్యాణం నిర్వహిస్తారు. ఏపీ ప్రభుత్వం ఈ వేడుకను అధికారికంగా నిర్వహిస్తుంది

ఈ ఏడాది ఏప్రిల్ 1 న నిండు పౌర్ణి రాత్రి వెన్నెల వెలుగుల్లో సీతారాముల కళ్యాణం జరుగుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తాయి. బ్రహ్మోత్సవాలు మార్చి 27 నుంచి ప్రారంభమవుతాయి.. ముందు రోజు మార్చి 26న అంకురార్పణతో ఉత్సవాలు మొదలవుతాయి. రెండో భద్రాద్రిగా పిలిచే ఒంటిమిట్టలో రామచంద్రుడు.. సీతా, లక్ష్మణులతో కొలువై ఉంటాడు. ఈ ఆలయంలో ఆంజనేయుడు ఉండడు.

# అనిత ఎందుకో లాస్ట్...

**విశాఖపట్టణం, మార్చి 14, పెన్ పవర్:** ఏపీలోటీడీపీ కూటమి ప్రభుత్వం దూకుడు మీద ఉంది. ఒక ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ పాలన కొనసాగుతోంది. ప్రతి 15 రోజులకు మంత్రి మండలి సమావేశం. ప్రతి నెల రోజులకు ఒకసారి కలెక్టర్ల రివ్యూ కొనసాగుతూ వస్తోంది. అదే సమయంలో మంత్రులకు ర్యాంకింగ్, వారి పనితీరు మదింపు వంటి విషయంలో సీఎం చంద్రబాబు ముందు ఉంటున్నారు. వారికి ర్యాంకింగ్స్ ఇస్తున్నారు. తాజాగా కలెక్టర్ల రివ్యూలు మంత్రులకు ర్యాంకింగ్స్ ఇచ్చారు చంద్రబాబు. ఈ ర్యాంకింగ్స్ లో మంత్రి కింజరాపు అచ్చెనాయుడు తొలి స్థానంలో నిలిచారు. మంత్రి వంగలపూడి అనిత చివరి స్థానంలో ఉన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగో స్థానంలో నిలిచారు. మంత్రుల శాఖలకు సంబంధించి ఫైళ్ళ క్లియరెన్స్ విషయంలో ఈ ర్యాంకింగ్స్ ఇచ్చారు సీఎం చంద్రబాబు. మంత్రుల శాఖల ప్రగతిలో ఈ ఫైల్ క్లియరెన్స్ కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే సీఎం చంద్రబాబు దీనిపైనే స్పెషల్ ఫోకస్ పెడుతున్నారు. మంత్రుల పనితీరుపై మదింపు.. అమరావతిలో కలెక్టర్ల సమావేశం తొలి రోజున మంత్రుల పనితీరుపై హాట్ కామెంట్స్ చేశారు సీఎం చంద్రబాబు. ఆయా శాఖల్లో ఫైళ్ళ క్లియరెన్స్ ఎంత వేగంగా జరుగుతుందని అంశంపై మిత్రులందరికీ రేటింగ్స్ ప్రకటించారు. తొలి స్థానంలో కింజరాపు అచ్చెనాయుడు నిలిచారు. ఆ తరువాత స్థానాల్లో వరుసగా నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగు స్థానంలో నిలిచారు. మంత్రి వంగలపూడి అనిత చివరి స్థానంలో నిలిచారు. మంత్రులు తమ ఫైళ్లను క్లియర్ చేసేందుకు ఎంత సమయం తీసుకుంటున్నారో చంద్రబాబు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులు, తీసుకున్న నిర్ణయాలు వేగంగా పూర్తి అయ్యేలా త్వరగా ఫైళ్లను క్లియర్ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు సీఎం చంద్రబాబు. పాలనలో వేగం పెంచడం ద్వారా.. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన వెల్లడించారు.ప్రతి నెల రోజులకు ఒకసారి కలెక్టర్ల సమావేశం జరపడం ఆనవాయితీగా పెట్టుకున్నారు సీఎం చంద్రబాబుఅందులో భాగంగా నిన్ననే అమరావతిలో కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. ఈరోజు కూడా అది కొనసాగనుంది. కీలక అంశాలపై చర్చలు జరపనున్నారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. శాఖల ఆదాయంపై కూడా సమీక్షిస్తారు. రాష్ట్ర విద్యారంగం తో పాటు ఉపాధి అవకాశాలపై కూడా చర్చించనున్నారు ఈరోజు సమావేశంలో. కోర్టులో ఉన్న కేసులు, న్యాయశాఖ పరిధిలో ఉన్న అంశాల పైన అధికారులు సీఎంకు వివరాలు అందించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు సంబంధించి కీలక నిర్ణయం కూడా ఈరోజు తీసుకోనున్నారు. తొలిరోజు మంత్రులకు ర్యాంకింగ్స్ ఇవ్వగా.. ఈరోజు అధికారులకు ర్యాంకింగ్స్ ఇవ్వనున్నారు సీఎం చంద్రబాబు.

# ఉగాదికి పట్టాభిషేకమా...

**తిరుపతి, మార్చి 14, పెన్ పవర్:** ప్రస్తుతం ఏపీలో ఉగాది పై చర్చ సాగుతోంది. ఆరోజు ఏపీ రాజకీయాలను షేక్ చేసేలా పలు నిర్ణయాలు ఉంటాయని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా అధికార పగ్గాల మార్పు గురించి రాష్ట్రమంతటా జోరుగా చర్చ జరుగుతోంది. సీఎం పీఠంపై లోకేష్ ను కూర్చోబెడతారు అనే ప్రచారం ఒకటి ఉంది. అయితే ఇది సాధ్యం కాకపోవచ్చు కానీ.. మంత్రివర్గంలో భారీ మార్పులు చేసే అవకాశం మాత్రం కనిపిస్తోంది. ముఖ్యంగా లోకేష్ టీం ను రాష్ట్ర మంత్రివర్గంలోకి తెస్తారన్న ప్రచారం మాత్రం పతాక స్థాయిలో జరుగుతోంది. ఇప్పటికే దీనిపై స్పష్టమైన సంకేతాలు టిడిపి శ్రేణులకు వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో మార్పులకు సీఎం చంద్రబాబు సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు మాత్రం సమాచారం. లోకేష్ కీలక బాధ్యతలపై అనేక రకాల చర్చలు జరుగుతుండగా.. బిజెపితో పాటు జనసేన స్పందన ఎలా ఉంటుంది అనేది ఇప్పుడు హాట్ టాపిక్. అయితే గతానికి భిన్నంగా లోకేష్ పై ఉన్న అభిప్రాయం బిజెపికి మారింది. లోకేష్ నాయకత్వాన్ని బిజెపి ప్రోత్సహించే అవకాశం ఉంది. ఎందుకంటే రాష్ట్ర రాజకీయాల్లో వారసత్వ మార్పులు జరిగినప్పుడు తమ పార్టీకి కూడా ఎదిగే అవకాశం దొరుకుతుందని బిజెపి లెక్కలు వేసుకుంటుంది.. బీహార్ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచి తమ ఉనికిని చాటుకున్నట్లే.. ఇక్కడ కూడా అదే ఆలోచన చేసే అవకాశం ఉంది.రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. కానీ బలమైన ఓటు బ్యాంకుతో పటిష్ట స్థితిలోనే ఉంది. అందుకే కూటమి పార్టీలు చాలా జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. అయితే ఇప్పటికిప్పుడు లోకేష్ పట్టాభిషేకం ఉండకపోవచ్చు. ముందుగా లోకేష్ టీం తో పటిష్ట పరుస్తారు. తరువాతే లోకేష్ ను ప్రమోట్ చేస్తారు. అయితే ఇప్పట్లో చంద్రబాబును మార్చే అవకాశం లేదు. అయితే రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే కాబోలు. అయితే కచ్చితంగా మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఓ అయిదుగురు వరకు మంత్రులు మార్పు చేస్తారని మాత్రం పొలిటికల్ వర్గాల్లో ఒక టాక్ ఉంది. ఏదిఏమైనా ఏపీలో మాత్రం ఉగాది పర్వదినం హాట్ టాపిక్ గా ఉంది. మరి ఎటువంటి సంచలనాలు నమోదు అవుతాయో చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఇరాన్ పాఠశాల మృతుల కుటుంబాలకు చైనా సాయం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌లోని ఒక పాఠశాలపై 'విచక్షణారహిత' క్షిపణి దాడిలో మరణించిన విద్యార్థుల తల్లిదండ్రులకు సాయం అందించనున్నట్లు చైనా శుక్రవారం ప్రకటించింది. ఇటీవల ఇరాన్ ప్రాథమిక పాఠశాలపై జరిగిన దాడిలో విద్యార్థులు మరణించడంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి జియాకున్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇరానియన్ రెడె క్రెసెంట్ సొసైటీకి చైనా రెడ్ క్రాస్ సొసైటీ అత్యవసర మానవతా సాయంగా 200,000 డాలర్లు (రూ. 1.84కోట్లు) అందించాలని నిర్ణయించిందని అన్నారు. ఈ దాడిని అంతర్జాతీయ మానవీయ చట్టాన్ని 'తీవ్రమైన ఉల్లంఘన'గా అభివర్ణించారు. పాఠశాలలు, పిల్లలపై దాడులు "అంతర్జాతీయ మానవతా చట్టాన్ని మరింత తీవ్రంగా ఉల్లంఘించడం మరియు మానవ మనస్సాక్షి మరియు నైతికత ప్రాథమిక లక్ష్యాన్ని ఉల్లంఘించడం" అని పేర్కొన్నారు.

## ఇరాన్‌లో ప్రభుత్వం కూలిపోయే ఛాన్సే లేదు.. అమెరికా నిఘా సంచలన నివేదిక

**హైదరాబాద్ పెన్ పవర్:** దాదాపు రెండు వారాలు పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగుతున్నా.. ఇరాన్‌లో నాయకత్వం స్థిరంగానే ఉందని, ఇప్పట్లో ప్రభుత్వం కూలిపోయే అవకాశం లేదని అమెరికా నిఘా సంచలన నివేదిక బయటపెట్టింది. యుద్ధ పరిణామాలకు సమీపంగా ఉన్న విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా ఇంటెలిజెన్స్ ఈ నివేదిక ప్రచురించింది. అమెరికా గూఢచారి వర్గాలు సేకరించిన పలు నివేదికలు... ప్రస్తుతం ఇరాన్‌లో ప్రభుత్వానికి తక్షణ ముప్పులేదని ఒక వర్గం పేర్కొంది. అంతేకాదు, ఇప్పటికీ ప్రజలపై ప్రభుత్వానికి నియంత్రణ కొనసాగుతుందని పేరు చెప్పడానికి నిరాకరించిన అధికార వర్గాలు సూచించినట్టు తెలిపింది. ఈ నివేదిక కొద్ది రోజుల కిందటే అగ్రరాజ్యం ఇంటెలిజెన్స్ సిద్ధం చేసినట్టు విశ్వసనీయ వర్గాలు వివరించాయి. చమురు ధరలు, అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభ భయాల నేపథ్యంలో ఒత్తిడి పెరుగుతున్నందున 2003 తర్వాత అమెరికా చేపట్టిన అతిపెద్ద ఈ సైనిక ఆపరేషన్‌ను త్వరగా ముగిస్తామనే సంకేతాలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చారు. కానీ, ఇరాన్ నాయకత్వం కఠిన వైఖరి కొనసాగితే యుద్ధానికి ఆమోదయోగ్యమైన ముగింపు అంత సులభం కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఫిబ్రవరి 28న జరిపిన దాడిలో ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించినా.. ఇప్పటికీ ఇరాన్‌లో మతాధికారుల నాయకత్వ వ్యవస్థ ఐక్యంగా కొనసాగుతుందని నివేదికలు సూచిస్తున్నాయి. అటు, ఇజ్రాయెల్ అధికారుల అంతర్గత చర్చల్లోనూ ప్రస్తుత యుద్ధం కారణంగా ఇరాన్‌లో ఇస్లామిక్ ప్రభుత్వం పతనం అవుతుందనే నమ్మకం లేదనే అభిప్రాయం వ్యక్తమైనట్టు ఆ దేశ ఓ సీనియర్ అధికారిని ఉటంకిస్తూ రాయిటర్స్ నివేదించింది. అయితే, క్షేత్రస్థాయిలో అంతర్గత రాజకీయ సమీకరణాలు ఎప్పుడైనా మారే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీనిపై జాతీయ నిఘా సంస్థ డైరెక్టర్ కార్యాలయం, వైట్‌హౌస్ తక్షణమే స్పందించడానికి నిరాకరించాయి.

## హర్మూజ్‌లో నౌకలకు భద్రత కల్పించలేం.. చేతులెత్తేసిన అమెరికా సైన్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జల సంధిలో ఆయిల్ ట్యాంకర్ నౌకలకు రక్షణ కల్పించలేమని, ప్రస్తుతం అందుకు సిద్ధంగా లేమని అమెరికా సైన్యం ప్రకటించింది. తమ సైన్యాల దృష్టి కేవలం ఇరాన్ వ్యతిరేక ఆపరేషన్‌పైనే ఉందని ఈ మేరకు అమెరికా ఇంధన శాఖా మంత్రి క్రిస్ రైట్ గురువారం వెల్లడించారు. ఆయన సీఎన్బీసీతో మాట్లాడుతూ... ఇరాన్ దాడి సామర్థ్యాలను, వాటికి మద్దతు ఇచ్చే పరిశ్రమలను లక్ష్యంగా చేసుకోవడమే అమెరికా సైన్యానికి తక్షణ ప్రాధాన్యత అని తేల్చిచెప్పారు. "అది త్వరలోనే జరుగుతుంది, కానీ ఇప్పుడు జరగకపోవచ్చు. మేము సిద్ధంగా లేం" అని ఆయన స్పష్టం చేశారు. వాణిజ్య నౌకలకు భద్రత ఆపరేషన్ ఈ నెల చివరిలో మొదలయ్యే అవకాశం ఉందని క్రిస్ రైట్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్- అమెరికా దాడులతో ఇరాన్ హర్మూజ్ జల సంధిని మూసివేసిన సంగతి తెలిసిందే. కాగా, హర్మూజ్ జల సంధిలో నౌకల రవాణాపై ఆయిల్ కంపెనీలను ప్రోత్సహిస్తారా? అన్న మీడియా ప్రశ్నకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ "అవును అదే చేయాలి అనుకుంటున్నా" అని సమాధానం ఇచ్చారు. అలాగే, ఇరాన్ సీమైన్స్ ఉంచిందని భావిస్తున్నారా? అంటే అలా చేస్తుందని అనుకోమని అన్నారు. ఇదిలా ఉండగా, హర్మూజ్ జల సంధి సమీపంలో సీ మైన్స్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారనే అనుమానంతో 16 ఇరానియన్ నౌకలను ధ్వంసం చేసినట్టు అమెరికా సెంట్రల్ కమాండ్ ఈ వారంలో ప్రకటించింది. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. ఇరాన్ అటువంటి చర్యలకు పాల్పడితే తక్షణమే వాటిని తొలగించాలని హెచ్చరించారు. జల మార్గంలో మైన్స్ అమర్చి దుస్సాహసానికి పాల్పడితే తీవ్రమైన పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన జల మార్గాల్లో హర్మూజ్ జల సంధి ఒకటి. ప్రపంచ చమురు రవాణాలో 20 శాతం, గ్యాస్ సరఫరాలో 40 శాతం దీని ద్వారానే జరుగుతుంది.

## ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. మతిచెడిన నేతలకు ఈరోజు ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని హెచ్చరించారు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికే వారి నాయకులు తుడిచిపెట్టుకుపోయారని అన్నారు. అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. అందుకే అగ్రరాజ్యం అధ్యక్షుడిగా వారి అంతు చూస్తున్నానని ట్రంప్ అన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం సమయంలో విమానంలో ఆరుగురు ఉన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఘటనకు దారి తీసిన చర్యలపై దర్యాప్తు చేస్తున్నామని అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ తెలిపింది.

## ఈ సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని 193 మంది ఎంపీల డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ రాజకీయ చరిత్రలో మునుపెన్నడూ చోటు చేసుకోని ఓ ఘటన చోటు చేసుకుంది. ముఖ్యంగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం అయ్యాయి. నిష్పాక్షికతను విస్మరించారనే ఆరోపణలతో ఆయనపై అభిశంసన నోటీసు ఇచ్చేందుకు విపక్ష ఇండియా కూటమి రంగం సిద్ధం చేసింది. లోక్‌సభకు చెందిన 130 మంది, రాజ్యసభకు చెందిన 63 మంది.. మొత్తం 193 మంది ఎంపీలు ఈ నోటీసుపై సంతకాలు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై విపక్ష నేతలు ప్రధానంగా ఏడు అభియోగాలను మోపారు. అవేంటంటే.. విధుల్లో వివక్షా పూరితంగా వ్యవహరిస్తూ అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని చెబుతున్నారు. అలాగే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) పేరుతో లక్షలాది మంది ఓట్లను అక్రమంగా తొలగించారని, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లోని అధికారిక ఓటర్లను జాబితా నుంచి

# ఆఫ్ఘన్ దాడులతో ఉద్రిక్తతలు.. పాక్ ఆర్మీ సెంటర్లపై ప్రతీకారం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకవైపు మధ్య యుద్ధ ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, మరోవైపు పొరుగు దేశాలైన ఖజీనితిబబిజీని మరియు ఆఫ్ఘనిస్తాన్ మధ్య కూడా ఘర్షణలు పెరుగుతున్నాయి. ఇరు దేశాలు ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుంటూ ఉద్రిక్త పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఇటీవల ప్రారంభమైన ఈ ఘర్షణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్‌పై దాడి చేయగా, దానికి ప్రతీకారంగా శుక్రవారం ఆఫ్ఘనిస్తాన్ దాడులు జరిపింది. పాకిస్తాన్‌లోని ఐష్ట్రఎవతీ ఖజీనిష్ట్రబీనినిష్ట్రలిజీ ప్రావిన్స్‌లో ఉన్న సైనిక కేంద్రాలపై వైమానిక దాడులు చేసినట్లు ఆఫ్ఘనిస్తాన్‌లోని ుజీశ్రీతిఎజీని ప్రభుత్వం వెల్లడించింది. ఈ దాడుల్లో పాకిస్తాన్‌కు ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపింది. పాకిస్తాన్ ముందుగా జరిపిన దాడులకు ప్రతీకారంగానే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. గురువారం రాత్రి పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్‌లోని కొన్ని స్థావరాలపై దాడులు జరిపినట్లు సమాచారం. ఆఫ్ఘనిస్తాన్‌లోని తీవ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని పాకిస్తాన్ ప్రకటించింది. అయితే ఆ దాడుల్లో సాధారణ పౌరులు మరణించారని ఆఫ్ఘనిస్తాన్ ఆరోపించింది. దానికి ప్రతిగా పాకిస్తాన్‌లోని ఐనీష్ట్రజీబి ప్రాంతంలోని కీలక సైనిక స్థావరాలపై తాము దాడులు నిర్వహించినట్లు తెలిపింది. ముఖ్యంగా ఆబీతీజీనిట ఒతినివ సమీపంలోని వార్ కమాండ్ సెంటర్లు, ఫోర్ట్ కమాండర్ స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది.



# వీలైనంత త్వరగా స్థావరాలను మూసేయండి.. అమెరికాకు మోజ్తాబా ఖమేనీ తొలి వార్నింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల ఇరాన్ నూతన సుప్రీం నాయకుడిగా ఎన్నికైన తర్వాత మోజ్తాబా ఖమేనీ తొలిసారి ప్రకటన చేశారు. అమెరికాపై ప్రతీకారం కోసం హర్మూజ్ జల సంధి మూసివేత, పశ్చిమాసియాలోని పొరుగు దేశాలపై దాడులు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. ఇరాన్ అధికారిక టెలివిజన్ న్యూస్ యాంకర్ గురువారం ఖమేనీ ప్రకటనను చదివి వినిపించారు. అయితే, ఆయన మాత్రం మీడియా ముందుకు రాలేదు. ఫిబ్రవరి 28న జరిగిన దాడిలో తండ్రి ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించగా.. మోజ్తాబా కూడా తీవ్రంగా గాయపడినట్టు, ఆయన పరిస్థితి విషమంగా ఉందని కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. కానీ, తాజా ప్రకటన ఆయన ఆరోగ్యంపై జరుగుతున్న ప్రచారానికి తెరదించినట్టయ్యింది. ఈ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలు పనిచేస్తూనే ఉంటే దాడులు తప్పవని ఇరాన్ నూతన సుప్రీం లీడర్ హెచ్చరికలు చేశారు. "వీలైనంత త్వరగా ఆ స్థావరాలను మూసివేయాలని నేను సలహా ఇస్తున్నాను.. ఎందుకంటే అమెరికా భద్రత, శాంతిని స్థాపిస్తుందనే వాదన అబద్ధం తప్ప మరేమీ కాదని వారు ఇప్పటికే గ్రహించి ఉండాలి" అని ఆయన అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న యుద్ధంలో మరణాలకు ప్రతీకారం తీర్చుకుంటానని మోజ్తాబా ప్రతిజ్ఞ చేశారు. తన శత్రువు నుంచి ఇరాన్ పరిహారం వసూలు చేస్తుందని చెప్పారు. అందుకు నిరాకరిస్తే వారి ఆస్తుల స్వాధీనం లేదా అదే స్థాయిలో నాశనం చేస్తుందని ఆయన ఉద్ఘాటించారు. "మా ప్రతీకారం కొంత వరకే తీరింది... కానీ మొత్తం పూర్తయ్యే వరకూ మా ప్రాధాన్యతలో ఇది ఒకటిగా ఉంటుంది" అని ఆయన అన్నారు. ఇరాన్ ఎప్పటికీ వెనక్కి తగ్గదని, పూర్తి శక్తితో ప్రతిఘటిస్తుందని ఆయన తేల్చిచెప్పారు. దివంగత ఆయతుల్లా అలీ ఖమేనీకి మాత్రమే కాకుండా యుద్ధంలో ప్రతి పౌరుడి మరణానికి ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంటుందని ఆయన శపథం చేశారు.



# ఇరాన్ అణు రంగ టాప్ సైంటిస్టుల హతం



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియా యుద్ధంలో ఇజ్రాయెల్ మరో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఇరాన్ అణు సామర్థ్యానికి వెన్నెముకగా ఉన్న అగ్రశ్రేణి అణు శాస్త్రవేత్తలను తమ దాడుల్లో మట్టుబెట్టినట్లు ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు అధికారికంగా ప్రకటించారు. గురువారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ సైనిక, అణు వ్యవస్థలపై ఇజ్రాయెల్ సాధించిన ఘనత గురించి వివరించారు. ఇరాన్ అణు బాంబు తయారీ దిశగా అడుగులు వేయకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ రక్షణ దళాలు ఈ వ్యూహాత్మక దాడులను నిర్వహించాయి. అయితే ఈ దాడుల్లో ఇరాన్ అణు కార్యక్రమం వెనుక ఉన్న అత్యంత కీలకమైన శాస్త్రవేత్తలు ప్రాణాలు కోల్పోయారని నెతన్యాహు వెల్లడించారు. ఇది ఇరాన్ అణు కలలపై కోలుకోలేని దెబ్బ అని, వారి సాంకేతిక నైపుణ్యం ఇప్పుడు చిన్నాభిన్నమైందని ఆయన పేర్కొన్నారు. ఇదే వేదికపై నెతన్యాహు ఇరాన్ కొత్త సుప్రీం నేత అయతుల్లా మోజ్తాబా ఖమేనీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మోజ్తాబా కేవలం రివల్యూషనరీ గార్డ్స్ చేతిలో ఒక కీలుబొమ్మ అని, ఆయన బహిరంగంగా ప్రజల ముందుకు కూడా రాలేని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇరాన్ పాలన ఇప్పుడు మత గురువుల చేతుల్లో లేదని, అది పూర్తిగా సైన్యం కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయిందని ఆరోపించారు. అలాగే ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని ఇజ్రాయెల్ టార్గెట్ చేయబోతోందా అన్న ప్రశ్నకు నెతన్యాహు తనదైన శైలిలో సమాధానమిచ్చారు. "ఆ ఉగ్రవాద సంస్థ (ఇరాన్ ప్రభుత్వం) లోని ఏ ఒక్క నాయకుడి ప్రాణానికి కూడా నేను భరోసా ఇవ్వలేను. వారికి లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు కూడా జారీ చేయలేము" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

# ఇలా ఇస్తే మహిళలకు ఉద్యోగాలు ఎవరిస్తారు

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా మహిళా ఉద్యోగులకు, విద్యార్థినులకు నెలసరి సెలవులు తప్పనిసరి చేయాలన్న డిమాండ్‌పై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి సెలవులను చట్టబద్ధం చేయడం వల్ల మహిళా సాధికారతకు మేలు కంటే కీడే ఎక్కువ జరుగుతుందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయ పడింది. "పీరియడ్స్ లీవ్ ఇవ్వాలని మేము చట్టం చేస్తే.. రేపు మహిళలకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రారు" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి పీరియడ్స్ లీవ్‌ను చట్టబద్ధం చేయాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. అయితే దీన్ని శుక్రవారం రోజు విచారించిన సుప్రీం కోర్టు. యజమానుల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవాలని పిటిషనర్‌కు సూచించింది. "చైతన్యం కల్పించడం వేరు. చట్టం చేయడం వేరు. సెలవులను తప్పనిసరి చేస్తే.. మహిళలను నియమించుకోవడానికి కంపెనీలు భయపడతాయి. ఇది వారిని పురుషుల కంటే తక్కువగా చూసేలా చేస్తుంది. మీరు ఇంట్లోనే కూర్చోండి అని చెప్పే పరిస్థితి వస్తుంది" అని సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది మహిళల కెరియర్‌ను ప్రమాదంలో పడేస్తుందని.. ఫలితంగా జ్యుడీషియరీ లేదా ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ వారి ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందని హెచ్చరించారు. విచారణ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ ఎం.ఆర్. శంషాద్ మాట్లాడుతూ.. కేరళ ప్రభుత్వం 2013లోనే అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థినులకు పీరియడ్స్ లీవ్ మంజూరు చేసిందని, లింగ సమానత్వం దిశగా అదొక గొప్ప అడుగు అని గుర్తు చేశారు. కొన్ని ప్రైవేట్ సంస్థలు కూడా ఇప్పటికే ఇలాంటి సెలవులను ఇస్తున్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన సీజేఐ.. అవి స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయాలని, వాటిని చట్టబద్ధంగా అందరికీ వర్తింపజేయడం వల్ల ప్రతికూల ఫలితాలు వస్తాయని స్పష్టం చేశారు.



# అజిత్‌కు మహీంద్రా అరుదైన కానుక




కోలీవుడ్ స్టార్ హీరో, రేసింగ్ అంటే ప్రాణం ఇచ్చే అజిత్ కుమార్ మరోసారి వార్తల్లో నిలిచారు. మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ దుబాయ్‌లో చిక్కుకుపోయిన ఆయన, ఎట్టకేలకు సురక్షితంగా చెన్నై చేరుకున్నారు. అలాగే ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా, అజిత్ పట్ల తన గౌరవాన్ని చాటుకుంటూ ఒక ప్రత్యేకమైన కారును బహుమతిగా అందించింది. వివరాల్లోకి వెళితే.. కార్ రేసింగ్‌లో పాల్గొనడానికి దుబాయ్ వెళ్లిన అజిత్, అక్కడ నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా కొంతకాలం అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి, ఇజ్రాయెల్–అమెరికా దాడుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో అజిత్ భద్రత గురించి ఆందోళన చెందిన అభిమానులకు ఆయన మేనేజర్ సురేష్ చంద్ర భరోసా ఇచ్చారు. పరిస్థితులు సద్దుమణిగడంతో అజిత్ సురక్షితంగా చెన్నై చేరుకున్నారు. చెన్నై చేరుకున్న అజిత్‌కు మహీంద్రా సంస్థ ఘన స్వాగతం పలికింది. ఆయనకు రేసింగ్‌పై ఉన్న మక్కువను గుర్తించిన సంస్థ, సరికొత్త 'ఃఇ 6' ఫార్ములా ఈ–థీమ్ ఎస్యూవీని కానుకగా అందజేసింది. ఈ కారును మహీంద్రా ఆటో విభాగం హెడ్ వేలుస్వామి స్వయంగా అజిత్‌కు అందజేశారు. ఇది ప్రపంచంలోనే మొదటి ఫార్ములా ఈ–థీమ్ ఎస్యూవీ కావడం గమనార్హం. దీని విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని యాజమాన్యం చెబుతుతోంది. ఈ కారు అధికారిక లాంచ్ కార్యక్రమంలో కూడా అజిత్ పాల్గొన్నారు.

# సెబీ హోల్‌టైమ్ సభ్యుడిగా కె.వి.రమణ మూర్తి



డిఫెన్స్ అకౌంట్స్ అదనపు కంట్రోలర్ జనరల్ కె.వి.రమణ మూర్తి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)లో హోల్‌టైమ్ సభ్యుడిగా నియమితులయ్యారు. నియామకాల కమిటీ నుండి అందిన సమాచారం ప్రకారం జాతీయ మీడియా శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించింది. అశ్వని భాటియా స్థానంలో కె.వి.రమణ మూర్తి బాధ్యతలు చేపట్టనున్నారని, ఆయన స్థానంలో మూడేళ్ల పాటు సభ్యుడుగా కొనసాగుతారని పేర్కొంది. సెబీలో అనంత నారాయణ్ మరియు అశ్వని భాటియాలు హోల్ టైమ్ సభ్యులుగా తమ పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నారు. అనంత్ నారాయణ్ స్థానంలో ఇటీవల సందీప్ ప్రధాన్ బాధ్యతలు చేపట్టారు. సెబీలో ప్రస్తుతం నలుగురు హోల్‌టైమ్ సభ్యులు, నలుగురు పార్ట్‌టైమ్ సభ్యులు ఉన్నారు. వారిలో ముగ్గురు కార్పోరేట్ వ్యవహారాల శాఖ, ఆర్థిక వ్యవహారాల శాఖ, ఆర్‌బిఐ ప్రతినిధులు.

# వంట నూనెల కొరత..!



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సామ్రాజ్యవాద చర్యలతో పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు భారత వంట నూనెల కొరతకు దారి తీసే సంకేతాలు స్పష్టంగా కనబడుతోన్నాయి. గతేడాదితో పోల్చితే ఫిబ్రవరిలో సన్ ఫ్లవర్ ఆయిల్ దిగుమతులు ఏకంగా 51 శాతం క్షీణించి 1.45 లక్షల టన్నులకు పరిమితమయ్యాయని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఇఎ) వెల్లడించింది. మరోవైపు అంతర్జాతీయంగా ముడి నూనె ధర టన్నుకు 1,216 డాలర్ల నుండి 1,420 డాలర్లకు ఎగిసింది. ఇది గతేడాది ఫిబ్రవరిలోని ధరలతో పోల్చితే 17 శాతం ఎక్కువ కావడం ఆందోళనకరం. దీనికి తోడు రూపాయి విలువ 4.2 శాతం మేర క్షీణించడం దిగుమతిదారులపై అదనపు ఒత్తిడిని పెంచుతోంది. సరఫరా గొలుసులో తలెత్తిన ఆటంకాల వల్ల మార్కెట్లో సన్ ఫ్లవర్ ఆయిల్ ధరలు సామాన్యుడికి భారంగా మారనున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్లో నిల్వలు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. సమీప భవిష్యత్తులోనే ధరలు పెరిగే అవకాశం లేకపోలేదని స్పష్టమవుతోంది.

# రూ.3,000 కోట్లతో ఫార్మా పార్క్




మహారాష్ట్రలోని రాయ్‌గడ్ జిల్లా దిఘీ పోర్ట్ పారిశ్రామిక వాడలో దాదాపు రూ.3,000 కోట్ల వ్యయంతో హైటెక్ ఫార్మాస్యూటికల్ పార్కును రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయనుంది. ఇందుకోసం మహారాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ (ఎంఐడీసీ)తో తమ అనుబంధ సంస్థ మైల్స్ సిటీ ఒప్పందం కుదుర్చుకుందని తెలిపింది. పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) కింద 1,000 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ పార్కు ఏర్పాటు చేయనున్నారు. 5 ఏళ్లలో ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి, ఆ తర్వాత 90 ఏళ్లపాటు అభివృద్ధి, నిర్వహణ, యాజమాన్య బాధ్యతలను మైల్స్ సిటీ చూసుకుంటుంది. ఈ కొత్త కాంట్రాక్టుతో రాంకీ ఇన్‌ఫ్రా ఆర్డర్ బుక్ విలువ రూ.13,500 కోట్లకు చేరుకుంది. ఉపాధి కల్పనతో పాటు, అనుబంధ పరిశ్రమల వృద్ధికి.. మహారాష్ట్ర దీర్ఘకాలిక పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ ప్రాజెక్టు దోహదం చేస్తుందని రాంకీ ఇన్‌ఫ్రా సీఈఓ సునీల్ ఎస్ నాయర్ తెలిపారు.

# హెచ్‌పిసిఎల్‌కు యుద్ధం సెగ
# మార్గమధ్యంలోనే ఆగిపోయిన చమురు ట్యాంకర్లు




ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధంతో విశాఖలోని హెచ్‌పిసిఎల్ క్రూడ్ ఆయిల్ ట్యాంకర్ల దిగుమతికి ఆటంకం ఏర్పడింది. ఇప్పటికే మార్గమధ్యంలో మూడు ముడి చమురు ట్యాంకర్లు నిలిచిపోయాయి. విశాఖ పోర్టు ద్వారానే ఈ ఎగుమతి, దిగుమతుల ప్రక్రియ నిత్యం జరుగుతుండడంతో కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అప్రమత్తమై విశాఖ పోర్టు అధికారులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని మూడు రోజులుగా చెబుతోంది. యుద్ధం మొదలై రెండు వారాలు కావొస్తుండటంతో వైజాగ్ పోర్టు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు దిశగా ముడి చమురు నౌకల డైవర్షన్‌కు ప్రాధాన్యమిస్తున్నారు. రష్యా నుంచి ఒక నౌక, కాకినాడ నుంచి రెండు నౌకలు విశాఖ పోర్టుకు రానున్నాయి. ముంద్రా పోర్టుకు ఇతర మార్గాల ద్వారా చమురు నౌకలను రప్పించి, అక్కడి నుంచి విశాఖ పోర్టుకు వాటిని పంపించనున్నారు. 'కేవలం క్రూడ్ ఆయిల్‌పైనే ప్రభావం పడింది. అది కూడా హెచ్‌పిసిఎల్‌కు రావాల్సిన మూడు ట్యాంకర్లే ఆగిపోయాయి' అని అధికారులు చెబుతున్నారు. విశాఖ పోర్టు ఉన్నతాధికారుల తాజా సమాచారం ప్రకారం విశాఖ పోర్టు తూర్పు తీరంలో ఉండడంతో సరుకు రవాణాకు ఆటంకాలేమీ లేవని స్పష్టమవుతోంది. యూరప్ నుంచి మాత్రమే వైజాగ్ పోర్టుకు సరుకు రవాణా నిరంతరం ఉంటుంది. యూరప్ నుంచి 10 లైన్లు సముద్రంలో ఉన్నాయి. యూరప్‌లో యుద్ధం లేనందున ఈ ప్రభావం కార్గోపై పడలేదు. యూరప్, మలేషియా, రష్యా, ఆస్ట్రేలియా నుంచి చమురు ట్యాంకర్లు వచ్చేలా ఇప్పటికే పోర్టు కార్యాచరణ తీసుకుంది. స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం 120 టన్నుల ఎల్‌పిజి మాత్రమే ఉంది. అది పది రోజులు మాత్రమే సరిపోతుంది. స్టీల్‌ప్లాంట్ మరో 300 టన్నులకు ఇప్పటికే డబ్బులు కట్టి ఉన్నా సరఫరా చేసేందుకు ఆటంకాలు మొదలయ్యాయి. ప్రస్తుతం హెచ్‌పిసిఎల్‌కు ప్రత్యామ్నాయంగా ఎల్‌పిజి స్టోరేజీ పాయింట్ బంగాళాఖాతం మధ్యలో కొండల మధ్య ఉంది. కొన్ని రోజుల మేరకే ఈ నిల్వలు సరిపోతాయని అధికారులు చెబుతున్నారు. యుద్ధం కొనసాగితే నష్టం తీవ్రత పెరగనుంది.

# మన చమురు కంపెనీలకు రోజూ రూ.2,000 కోట్ల నష్టం!



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం వల్ల గల్ఫ్ దేశాల నుంచి చమురు ఎగుమతులు ఆగిపోతున్నాయి. ఫలితంగా ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లకు చేరింది. యుద్ధం ముందు ఇది సగటున 70 డాలర్లు ఉండేది. భారత్, చైనా నుంచి చమురుకు ఆర్డర్లు లభిస్తుండటంతో, రష్యా పంట పండింది. ముడిచమురు ధరలు పెరిగినా, పెట్రోల్/డీజిల్ రిటెయిల్ ధరలు పెంచనందున.. మన దేశంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలకు రోజూ రూ.2,000 కోట్ల నష్టం వస్తోందని కొన్ని అంచనాలు పేర్కొంటున్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా ట్యాంకరు రవాణా ఛార్జీలు, నౌకల బీమా సుంకం పెరగడంతో..

మన చమురు మార్కెటింగ్ కంపెనీ (ఓఎమ్‌సీ)లకు ఆర్థికభారం పడుతోంది. దేశీయంగా రిటెయిల్ ధరలు మార్చనందున లీటరు పెట్రోలుపై రూ.20, డీజిల్‌పై రూ.45 చొప్పున నష్టపోతున్నట్లు సిస్టమాటిక్స్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తెలిపింది. ఫలితంగా ప్రభుత్వ రంగ ఓఎమ్‌సీలైన భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) కలిపి రోజుకు రూ.2,000 కోట్ల నష్టాన్ని భరిస్తున్నాయని అంచనా వేసింది. ఇందులో డీజిల్‌పైనే రూ.1,650 కోట్ల నష్టం వాటిల్లుతుండగా, పెట్రోలుపై రూ.350 కోట్లు పోగొట్టుకుంటున్నాయి. రష్యా చమురు ధర కూడా బ్రెంట్ ముడిచమురు కంటే బ్యారెల్‌కు 2–8 డాలర్లు ఎక్కువగా ఉందని ఈ సంస్థ పేర్కొంటోంది.

# క్లెయిమ్‌ల మోసాలకు ఏఐతో అడ్డుకట్ట

ఆరోగ్య బీమా క్లెయిమ్‌ల పరిష్కారాన్ని మరింత వేగవంతం చేయడంతో పాటు, వీటిల్లో మోసాలను అరికట్టేందుకు కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) సాంకేతికత వినియోగిస్తున్నట్లు స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ హోల్‌టైం డైరెక్టర్ హిమాన్షు వాలియా శుక్రవారం ఇక్కడ తెలిపారు. ప్రస్తుతం క్లెయింల పరిష్కారంలో ఏఐని 20% వాడుతున్నామని, రెండేళ్లలో దీనిని 50 శాతానికి పెంచాలనే లక్ష్యంతో ఉన్నామని వివరించారు. సాంకేతికత అభివృద్ధి కోసం ఏడాది కాలంలో రూ.200 కోట్లు పెట్టుబడులు పెట్టబోతున్నట్లు తెలిపారు. బీమా రంగంలో 6–7% మోసపూరిత క్లెయింలు వస్తున్నాయన్నారు. ఏఐ, ఎంఎల్ వినియోగం వల్ల క్లెయింల పరిష్కార సమయం తగ్గడమే కాకుండా, క్లిష్టమైన కేసులనూ నిశితంగా పరిశీలించే అవకాశం కలుగుతుందని వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో 24 లక్షల మందికి స్టార్ హెల్త్ బీమా ఉందని, పాలసీలు, ఆదాయం పరంగా తెలుగు రాష్ట్రాలకు 10% వాటా ఉందన్నారు. 1,800లకు పైగా నెట్‌వర్క్ ఆసుపత్రులు, 75 శాఖలు, సుమారు 89,000 మంది ఏజెంట్లతో ఇక్కడ సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

# భారత్ ఇరాన్ ప్రజల మధ్య బలమైన ఐక్యతా భావం ఉంది



భారత్, ఇరాన్ మధ్య ఉన్న సంబంధాలు అత్యంత బలమైనవని, ఉమ్మడి ప్రయోజనాలు, విలువల పునాదిపై ఇవి నిర్మితమయ్యాయని భారత ఇరాన్ రాయబారి డాక్టర్ మొహమ్మద్ ఫతాలీ స్పష్టం చేశారు. ఇరు దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ద్వైపాక్షిక సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, ఇరాన్ ప్రజల మధ్య బలమైన ఐక్యతా భావం ఉందని, అదే ద్వైపాక్షిక సహకారానికి పునాది అని ఫతాలీ పేర్కొన్నారు. భారత ప్రజల కష్టం మా కష్టంగా భావిస్తాం, మా కష్టాన్ని వారు తమదిగా చూస్తారు. ఈ కారణంగానే భారత ప్రభుత్వం మాకు సహాయం చేస్తోంది. మేం కూడా భారత ప్రభుత్వానికి అండగా నిలవాలి. ఎందుకంటే మనకు ఉమ్మడి విశ్వాసాలు, ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. అని ఆయన వివరించారు. భారత్‌లో ఇరాన్ రాయ బారిగా ఇరు దేశాల మధ్య అవగాహన, సహకారాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని తెలిపా రు. ఇటీవల ఇరు దేశాల ఉన్నతాధికారుల మధ్య కీలక చర్చలు జరిగాయని ఫతాలీ వెల్లడించారు. మా ఉన్నత స్థాయి అధికారులు భారత ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారు. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధిం చిన అంశాలపై ఫలప్రదమైన సంప్రదింపులు జరిగాయి అని ఆయన పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించేందుకు ఇరుపక్షాలు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నాయని, భవిష్యత్తులో సహకారం మరింత విస్తరిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు

# రష్యా చమురుపై సడలిన ఆంక్షలు

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షుభిత పరిస్థితుల నేపథ్యంలో రష్యా చమురుపై గల ఆంక్షలను అమెరికా సడలించింది. ఇప్పటికే సముద్రంలోని నౌకల్లో లోడ్ చేసి, నిలిచిపోయిన రష్యా చమురు, పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు దేశాలను అనుమతించింది. ఈ మేరకు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు ధరలు పెచ్చరిల్లుతున్న తరుణంలో అమెరికా ఈ చర్య తీసుకుంది. యుద్ధం కారణంగా హార్మూజ్ జలసంధి గుండా నౌకల రవాణా దాదాపు నిలిచిపోయిన పరిస్థితి ఎదురైంది. ప్రపంచవ్యాప్తంగా రోజువారీ జరిగే చమురు సరఫరాల్లో దాదాపు ఐదోవంతు ఈ జలసంధి గుండానే జరుగుతోంది. దాడుల కారణంగా ఇరాన్ ఆ జలసంధిపై తన పట్టును నియంత్రించడంతో చమురు ధరలు ఒక్కసారిగా 50శాతం పెరిగాయి. బ్యారెల్ ధర దాదాపు 120డాలర్లకు చేరింది. ప్రస్తుత సరఫరాలను పెంచేందుకు తాత్కాలికంగా ఈ చర్య తీసుకున్నట్లు బెసెంట్ తెలిపారు. ఈ చర్య ఇంధన మార్కెట్లను స్థిరీకరించి, ధరలు తగ్గేందుకు అవకాశం కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. మార్చి 12వ తేదీకి ముందు నౌకల్లోకి ఎక్కించిన రష్యన్ చమురు ఎగుమతులకు సంబంధించిన ఈ మినహాయింపు 30రోజుల పాటు అమల్లో వుంటుంది. అంతకుముందు అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ మాట్లాడుతూ రష్యా పట్ల తమ ఆంక్షల విధానంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. రష్యాచమురుపై గల విస్తృత ఆంక్షలను ఎత్తివేసే ఆలోచన కూడా లేదని తేల్చి చెప్పారు.

# పొద్దున్నే అరటి పండు తింటున్నారా?



అరటిపండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండ్లలో ఒకటి. అంతేకాదు.. అన్ని సీజన్లు, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేది అరటి పండు. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ అరటి పండును ఇష్టంగా తింటారు. చాలా మంది ఉదయం అల్పాహారం ముందు లేదా ఖాళీ కడుపుతో అరటిపండు తినే అలవాటు పెట్టుకుంటారు. అరటి పండులో ఎన్నో పోషకాలు ఉంటాయి. పొటాషియం, విటమిన్ బి6, మెగ్నీషియం ఇందులో సమృద్ధిగా ఉంటాయి. దీని వలన జీర్ణశక్తి పెరగడంతో పాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఉదయాన్నే నిద్రలేవగానే అరటి పండు తినడం మంచిదేనా ? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియంతో పాటు అరటి పండులో నేచురల్ షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉండటం వలన బీపీ పెరిగి, రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం ఎక్కువగా ఉండటంతో గుండె ఆరోగ్యానికి కూడా ఇది మేలు చేస్తుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడటంలో కూడా అరటిపండు ఉపయోగపడుతుంది. ఉదయాన్నే అరటిపండు తింటే శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇది సహజమైన చక్కెరలు (గ్లూకోజ్, ఫ్రుక్టోజ్, సుక్రోజ్) కలిగి ఉండటం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా అరటిపండు ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ వల్ల కడుపు సక్రమంగా పనిచేస్తుంది. ముఖ్యంగా మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఇది మంచి పరిష్కారంగా ఉంటుంది. ఉదయం అరటిపండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేసే అవకాశం ఉంది. మానసిక ఆరోగ్యానికి కూడా అరటిపండు ఉపయోగకరం. ఇందులో ట్రిప్టోఫాన్ అనే పదార్థం ఉండటంతో ఇది శరీరంలో సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచి మూడ్‌ను మెరుగుపరుస్తుంది. దీంతో ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుంది. అరటిపండులో పొటాషియం, ఫైబర్, విటమిన్ అ, విటమిన్ ః6 వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఉదయాన్నే అరటి పండు తినడం వలన ఇన్‌స్టాంట్ ఎనర్జీ లభిస్తున్నప్పటికీ ఆరోగ్యనిపుణులు ఇది మంచిది కాదని తెలిపారు. ఉదయాన్నే అరటి పండు తినడం వలన యాసిడిటీ సమస్య రావచ్చని చెబుతున్నారు. ఉదయాన్నే అరటి పండు తినడం వలన తక్షణమే శక్తి లభిస్తుంది. ఇందులో మెగ్నీషియం, పొటాషియం లెవల్స్ సమృద్ధిగా ఉంటాయి. అరటి పండులో తక్కువ కేలరీలు ఉన్నప్పటికీ, అధికంగా తినడం వలన శరీర బరువు పెరిగే అవకాశం ఉంది. అయితే ఖాళీ కడుపుతో ఎక్కువగా అరటిపండ్లు తినడం మంచిది కాదని కొంతమంది నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ లేదా ఆమ్లత్వ సమస్యలు ఉన్నవారు పరిమితంగా తినడం మంచిది. మొత్తానికి ఉదయం ఒక అరటిపండు తినడం శరీరానికి శక్తి, జీర్ణక్రియ, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అయితే సమతుల ఆహారంతో పాటు తీసుకుంటే మరింత ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.

# విరుద్ధ ఆహారంతో చర్మ వ్యాధులు

పాలు సంపూర్ణ ఆహారం అని మనందరికీ తెలుసు. పెరిగే పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ పాలు ఎంతో బలాన్ని ఇస్తాయి. అయితే, పాలు ఎంత పోషక విలువలు కలిగినవో, అంతే సెన్సిటివ్ కూడా. ఆయుర్వేదం ప్రకారం పాలను కొన్ని రకాల ఆహార పదార్థాలతో కలిపి తీసుకుంటే అవి మన జీర్ణవ్యవస్థపై వినాశకర ప్రభావాన్ని చూపుతాయి. శరీరంలో టాక్సిన్స్ (విషతుల్యాలు) పేరుకుపోవడానికి కారణమవుతాయి. పాలు తాగేటప్పుడు మనం చేసే చిన్న చిన్న తప్పులు ఎలాంటి అనారోగ్యాలకు దారితీస్తాయో తెలుసుకుందాం. ఆమె రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో పాలు, పండ్లను కలిపి తీసుకుంటుంది. అతను జిమ్ ముగించుకుని గుడ్లు, పాలు కలిపి సేవిస్తాడు. ఇవి ఆరోగ్యానికి చాలా మంచివని వారు నమ్ముతుంటారు. కానీ, కొన్ని రోజుల తర్వాత వారిద్దరికీ చర్మంపై దద్దుర్లు, కడుపులో ఉబ్బరం వంటి సమస్యలు మొదలయ్యాయి. ఖరీదైన మందులు వాడినా ఫలితం లేదు. ఎందుకో తెలుసా? వారు తీసుకుంటున్న ఆహారంలోనే అసలు శత్రువు దాగి ఉన్నాడు. పాలు ఒక అమృతం లాంటిదే కావచ్చు, కానీ కొన్ని వస్తువులతో కలిస్తే అది విషంగా మారుతుంది.

1. పాలు ? సిట్రస్ పండ్లు (నిమ్మ, నారింజ): నిమ్మ, నారింజ, స్ట్రాబెర్రీ, పైనాపిల్ వంటి పండ్లు ఆమ్ల గుణాన్ని కలిగి ఉంటాయి. పాలు చలవ చేసే గుణం కలిగి ఉండి జీర్ణం కావడానికి సమయం తీసుకుంటాయి. ఈ రెండింటిని కలిపి తీసుకున్నప్పుడు కడుపులో పాలు వెంటనే విరిగిపోతాయి. దీనివల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం, అసిడిటీ మరియు చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే పాలు తాగిన గంట వరకు ఈ పండ్లను తీసుకోకపోవడమే మంచిది.

2. చేపలు ? పాలు: మన పెద్దలు ఎప్పుడూ చెప్పే మాట.. చేపలు తిన్న తర్వాత పాలు తాగకూడదు. ఆయుర్వేదం ప్రకారం చేపలు వేడి చేసే గుణాన్ని, పాలు చలవ చేసే గుణాన్ని కలిగి ఉంటాయి. ఈ రెండు విరుద్ధ స్వభావాలు కలిగిన ఆహారాలను కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో అసమతుల్యత ఏర్పడి దీర్ఘకాలంలో చర్మ అలర్జీలు,




బొల్లి వంటి సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.

3. పాలు- పుల్లని పదార్థాలు (ఊరగాయలు, వెనిగర్): ఊరగాయలు, వెనిగర్ తో చేసిన వంటకాలు లేదా పుల్లటి పెరుగుతో చేసిన పదార్థాలను పక్కన పెట్టుకుని పాలు తాగడం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. వీటిలోని ఆమ్లాలు పాలను గడ్డకట్టేలా చేస్తాయి. దీనివల్ల జీర్ణవ్యవస్థలో అసౌకర్యం కలగడమే కాకుండా, వికారం వచ్చే అవకాశం ఉంది.

4. గుడ్లు- పాలు: ప్రస్తుత డైట్ ప్లాన్లలో పాలు, గుడ్లు కలిపి తీసుకోవడం సాధారణమైపోయింది. కానీ సాంప్రదాయ విజ్ఞానం దీనిని అంగీకరించదు. పాలలో కొవ్వు ఎక్కువగా ఉంటుంది, గుడ్లలో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. ఈ రెండింటిని కలిపి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థపై భారం పడుతుంది. ముఖ్యంగా ఉడకని లేదా పచ్చి గుడ్లను పాలతో కలిపి తీసుకుంటే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. ఆరోగ్యం కోసం పాలు తాగడం మంచిదే, కానీ ఏది దేనితో కలపాలో తెలియకపోతే అది అనారోగ్యానికి దారితీస్తుంది. పైన పేర్కొన్న పదార్థాలకు, పాలకు మధ్య కనీసం గంట లేదా రెండు గంటల విరామం ఉండేలా చూసుకోండి. మీ జీర్ణక్రియను కాపాడుకోవడం మీ చేతుల్లోనే ఉంది.


# ఈ 'కొవ్వు' ఉంటే లివర్ ప్రమాదంలో ఉన్నట్టే!



ప్రస్తుత కాలంలో అత్యధిక మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో లివర్ క్యాన్సర్ ఒకటి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. కానీ, మనం రోజూ తీసుకునే కొన్ని రకాల కొవ్వు పదార్థాలు మన కాలేయాన్ని క్యాన్సర్ గురిచేస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యం కోసం మనం తీసుకునే ఆహారంలో కొవ్వులు ఒక ముఖ్యమైన భాగం. అయితే, మీరు ఎంచుకునే ఆ కొవ్వు పదార్థమే మీ ప్రాణాల మీదకు తీసుకురావచ్చని మీకు తెలుసా? ముఖ్యంగా అధిక బరువు ఉన్నవారిలో కొన్ని రకాల కొవ్వులు కాలేయంలో ట్యూమర్ల వృద్ధిని వేగవంతం చేస్తున్నాయని తాజా పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

లివర్ క్యాన్సర్ లో అత్యంత సాధారణ రూపం 'హెపటో సెల్యులార్ కార్సినోమా' (ఊఅఅ). ఇది స్థూలకాయం మరియు మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ సంబంధిత ఫ్యాటీ లివర్ డిసీజ్ వల్ల వస్తుందని డాక్టర్ సౌరభ్ వివరించారు. కేవలం శరీర బరువు పెరగడం మాత్రమే కాదు, మనం ఎటువంటి కొవ్వులు తింటున్నామనేది క్యాన్సర్ ముప్పును నిర్ణయిస్తుంది. 2025లో ప్రచురితమైన పదేళ్ల సుదీర్ఘ అధ్యయనం ప్రకారం.. జంతువుల నుండి సేకరించిన కొవ్వులు స్థూలకాయం ఉన్నవారిలో ట్యూమర్ పెరుగుదలను గణనీయంగా పెంచుతున్నాయని తేలింది.మనం రెగ్యులర్ గా వాడే వెన్న, పంది కొవ్వు, గొడ్డు మాంసం కొవ్వు వంటి జంతు సంబంధిత ఫ్యాట్స్ కాలేయ వ్యాధులకు ప్రధాన కారకాలుగా మారుతున్నాయి. ఇవి కేవలం బరువు పెంచడమే కాకుండా, కాలేయ కణాలలో క్యాన్సర్ కారక మార్పులను ప్రేరేపిస్తాయి. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్లాంట్-బేస్డ్ (మొక్కల ఆధారిత) కొవ్వులను ఎంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆలివ్ ఆయిల్, పామాయిల్ మరియు కొబ్బరి నూనె వంటివి అధిక బరువు ఉన్నప్పటికీ క్యాన్సర్ వృద్ధిని ప్రోత్సహించవని పరిశోధనల్లో తేలింది. వీటితో పాటు స్థిరంగా బరువు తగ్గడం ద్వారా ఫ్యాటీ లివర్ సమస్యను నయం చేసుకోవచ్చని, క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. లివర్ క్యాన్సర్ ను అడ్డుకోవాలంటే కేవలం బరువు తగ్గితే సరిపోదు, మన డైట్ లో ఉండే కొవ్వుల మూలాన్ని కూడా గమనించాలి. జంతు సంబంధిత కొవ్వులను తగ్గించి, సహజ సిద్ధమైన మొక్కల ఆధారిత నూనెలను వాడటం ద్వారా కాలేయాన్ని రక్షించుకోవచ్చు. కాలేయం మీ శరీరానికి ఫిల్టర్ లాంటిది, దానిని ఆరోగ్యంగా ఉంచుకోవడం మీ చేతుల్లోనే ఉంది.

# ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారా?



ఫ్యాటీ లివర్ ఇప్పుడు ఒక సాధారణ సమస్యగా మారింది. ఇది కాలేయంలో అధిక కొవ్వు పేరుకుపోవడం వల్ల ఉత్పన్నమవుతుంది. కాలేయం సరిగ్గా పనిచేయకపోతే, మొత్తం ఆరోగ్యంపై నేరుగా ప్రభావం పడుతుంది. ఫ్యాటీ లివర్ కారణంగా కాలేయంపై ఒత్తిడి పెరుగుతుంది, శరీరంలో విషపదార్థాల (టాక్సిన్స్) స్థాయిలు పెరుగుతాయి. జీవక్రియలో అసమతుల్యత కలుగుతుంది. కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన, రెండవ అతిపెద్ద అవయవం. ఇది శరీరానికి 500 కంటే ఎక్కువ విధులను నిర్వహిస్తుంది. అందువల్ల, ఆరోగ్యకరమైన, చురుకైన కాలేయాన్ని ఉంచుకోవడం చాలా ముఖ్యం. కానీ, సరైన ఆహారం తీసుకోకపోవడం, అనారోగ్యకరమైన జీవనశైలి వలన కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం (ఫ్యాటీ లివర్) సాధారణం. దీని వల్ల కాలేయ సామర్థ్యం తగ్గి, శరీరంలోని అనేక అవయవాల పనితీరు ప్రభావితమవుతుంది. అంతేకాదు, కొన్ని పండ్లను ఆహారంలో చేర్చడం వల్ల కాలేయంలో కొవ్వు నిల్వలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించడంలో ఉపకరిస్తున్న కొన్ని పండ్లు..నారింజ, నిమ్మకాయ, బత్తాయి, కమలాఫలం వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ అ పుష్కలంగా ఉంటుంది. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. కాలేయాన్ని విష పదార్థాల నుంచి రక్షిస్తాయి. విటమిన్ అ కాలేయ నిర్విషీకరణలో సహాయపడుతుంది. కొవ్వు పేరుకుపోవడానికి అడ్డుగట్టుతుంది.ఆపిల్స్ లో కరిగే ఫైబర్ (పెక్టిన్) ఎక్కువగా ఉంటుంది. ఇది కాలేయంలో కొవ్వు తగ్గించడంలో, నిర్విషీకరణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. రోజూ ఒక ఆపిల్ తినడం కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.బొప్పాయిలో విటమిన్లు, ఎంజైములు పుష్కలంగా ఉంటాయి, ఇవి జీర్ణక్రియకు మద్దతు ఇస్తాయి. ఫ్యాటీ లివర్ ఉన్నవారికి బొప్పాయి తినడం వల్ల కాలేయంపై భారాన్ని తగ్గించడంలో, పనితీరు మెరుగుపరచడంలో సహాయపడుతుంది.కివిలో విటమిన్లు, ఖనిజాల మిశ్రమం ఉంటుంది. ఇది కాలేయ ఆరోగ్యాన్ని, రోగనిరోధక శక్తిని ప్రోత్సహిస్తుంది. అలాగే, కాలేయంపై ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో కూడా ఉపయోగపడుతుంది. ముఖ్యమైన విషయం ఏంటంటే.. పండ్లను సక్రమంగా ఆహారంలో చేర్చడం, సమతుల్య ఆహారం, వ్యాయామం, తగిన నిద్ర, నీరు త్రాగడం ద్వారా ఫ్యాటీ లివర్ సమస్యను నిరోధించవచ్చు. ఆరోగ్యకరమైన కాలేయాన్ని కొనసాగించవచ్చు.

# మహిళల్లో గొంతు నొప్పి చిన్న సమస్య కాదు..!




ఆహారం మింగేటప్పుడు నొప్పి కలగడం, గొంతులో ఏదో ఇరుక్కుపోయినట్లు అనిపించడం వంటి లక్షణాలు కూడా కనిపించవచ్చు. కాబట్టి మీకు తీవ్రమైన గొంతు నొప్పి, దగ్గు వంటి సమస్యలు ఉండి, మందులు తీసుకున్నప్పటికీ తగ్గకపోతే తప్పకుండా నిపుణుడైన వైద్యుడిని సంప్రదించాలి. అలాగే మెడ వైపులా చిన్నగా, నొప్పి లేకుండా ఉండే గడ్డలు కనిపించినా జాగ్రత్తగా ఉండాలి. ఇతర క్యాన్సర్లతో పోలిస్తే గొంతు క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. మనలో చాలా మంది చిన్న అనారోగ్యం వచ్చినా.. వెంటనే స్వయంగా మందులు తీసుకోవడానికి ప్రయత్నిస్తారు. కానీ దాని వల్ల కలిగే పరిణామాల గురించి ఎక్కువగా ఆలోచించరు. ఉదాహరణకు జలుబు లేదా దగ్గు వచ్చినప్పుడు చాలా మంది స్వయంగా మందులు వేసుకుని సమస్యను మరింత పెంచుకునే పరిస్థితి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మనం సాధారణంగా భావించే లక్షణాలు, వాస్తవానికి ఇతర తీవ్రమైన వ్యాధుల ప్రారంభ సంకేతాలు కావచ్చు. అందుకే లక్షణాలను ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యం. ముఖ్యంగా మహిళలు ఒక ముఖ్యమైన లక్షణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.. అది గొంతు నొప్పి. చాలా మంది గొంతు నొప్పిని జలుబు, ఫ్లూ లేదా వాతావరణ మార్పుల వల్ల వచ్చిన చిన్న సమస్యగా తీసుకుంటారు. కానీ వారాల తరబడి తగ్గకుండా ఉండే గొంతు నొప్పి కొన్ని తీవ్రమైన వ్యాధులకు సంకేతం కావచ్చు. ముఖ్యంగా ఇది గొంతు క్యాన్సర్‌కు కూడా ప్రారంభ లక్షణంగా ఉండే అవకాశం ఉంది. పొగాకు, ఆల్కహాల్ వాడకం ప్రధాన కారణాలు అయినప్పటికీ, ఆధునిక జీవనశైలి కారణంగా మహిళలు, పురుషులలో ఈ ప్రమాదం పెరుగుతోంది. గొంతు క్యాన్సర్‌లో ముఖ్యంగా కనిపించే లక్షణం గొంతు బొంగురుపోవడం లేదా స్వరం మారిపోవడం. చాలా మంది దీనిని సాధారణ సమస్యగా తీసుకుని నిర్లక్ష్యం చేస్తారు. కానీ గొంతు క్యాన్సర్ సాధారణంగా స్వరపేటికలో ప్రారంభమవుతుంది. ఆహారం మింగేటప్పుడు నొప్పి కలగడం, గొంతులో ఏదో ఇరుక్కుపోయినట్లు అనిపించడం వంటి లక్షణాలు కూడా కనిపించవచ్చు. కాబట్టి మీకు తీవ్రమైన గొంతు నొప్పి, దగ్గు వంటి సమస్యలు ఉండి, మందులు తీసుకున్నప్పటికీ తగ్గకపోతే తప్పకుండా నిపుణుడైన వైద్యుడిని సంప్రదించాలి. అలాగే మెడ వైపులా చిన్నగా, నొప్పి లేకుండా ఉండే గడ్డలు కనిపించినా జాగ్రత్తగా ఉండాలి. ఇతర క్యాన్సర్లతో పోలిస్తే గొంతు క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి.

# ప్రపంచ్ కప్ అయినా కూడా ఇలా తొండి చేయొద్దు

## రనౌట్ వివాదంపై కైఫ్ సంచలన కామెంట్స్





**హైదరాబాద్ పెన్ పవర్:** పాక్-బంగ్లా మధ్య జరిగిన వండే మ్యాచ్ లో రనౌట్ వివాదం ఇప్పట్లో ముగిసేలా లేదు. పాకిస్తాన్ బ్యాటర్ అలీ ఆఘా ఔటైన విధానంపై క్రికెట్ సర్కిల్ లో చర్చలు జరుగుతూనే ఉన్నాయి. బంగ్లాదేశ్ కెప్టెన్ మెహ్దీ హాసన్ మిరాజ్ చేసిన పని గల్లీ క్రికెట్ కంటే ఘోరంగా ఉందని ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వివాదంపై ఇండియన్ మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

బంగ్లా కెప్టెన్ మెహ్దీ హాసన్ చేసింది క్రీడాస్ఫూర్తికే విఘాతం కలిగించేలా ఉందని సీరియస్ కామెంట్స్ చేశారు కైఫ్. ఇది జరగాల్సింది కాదు. వికెట్స్ పడటం లేదనే నిరాశలో ఇంతకు దిగజారటం కరక్టేనా..? వికెట్లు పడటం లేదని ఇలాంటి రనౌట్ సమర్థించాలా..? అది కూడా ఒక కెప్టెన్ చేయడమేంటి..? యంగ్స్ స్టర్స్ నేర్చుకోండి.. ప్రపంచ కప్ ఉన్న కూడా బంగ్లా కెప్టెన్ చేసినపని చేయకండి. నిజాయితీ లేని ఆటలు అవి ఆటలే కావు.. అంటూ మండిపడ్డారు కైఫ్

**వివాదం ఏంటి..?**

పాకిస్తాన్-బంగ్లాదేశ్ మధ్య శుక్రవారం (మార్చి 13) జరిగిన మ్యాచ్ లో రనౌట్ తీవ్ర వివాదాస్పదం అయ్యింది. ధాకాలోని షేర్-ఇబంగ్లా నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు ఫుల్ ట్రెండింగ్ లో ఉంది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ ముందుగా బ్యాటింగ్ చేయగా.. మహమ్మద్ రిజ్వాన్(44)తో కలిసి సల్మాన్ అలీ ఆఘా (64) నాలుగో వికెట్‌కు 109 పరుగుల పాట్నర్ షిప్ నెలకొల్పాడు. వికెట్ పడకుండా ఆడుతూ బంగ్లా బౌలర్లకు చుక్కలు చూపించారు. ఎంతకూ వికెట్ పడటం లేదనో ఏంటో కానీ.. అవకాశం వచ్చింది కదా అని క్రీడాలోకం నవ్వుకునే పని చేశాడు బంగ్లా కెప్టెన్ మెహ్‌దీ హసన్ మిరాజ్. 39వ ఓవర్‌లో మహమ్మద్ రిజ్వాన్ బౌలర్‌వైపు షాట్ ఆడాడు. బంతి కాస్త నాన్‌స్ట్రైకర్‌లో ఉన్న సల్మాన్ అలీ అఘా బ్యాట్‌కు తాకింది. దాంతో ఆ బంతిని సల్మాన్ అలీ అఘా బౌలర్‌కు అందించే ప్రయత్నం చేశాడు.కానీ మెహ్‌దీ హసన్ మిరాజ్ వేగంగా బంతిని అందుకొని నాన్‌స్ట్రైకర్ వికెట్లను కొట్టి రనౌట్ కోసం అప్పీల్ చేశాడు. దాంతో సల్మాన్ అఘా అవాక్కయ్యాడు. బంతిని అందించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలనుకున్న అతనికి ఈ అనూహ్య ఘటన తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఫీల్డ్ అంపైర్.. థర్డ్ అంపైర్ రివ్యూ కోరగా బ్యాటర్ క్రీజు బయటే ఉన్నాడని ఔటిచ్చాడు.దాంతో తీవ్ర అసహనానికి గురైన సల్మాన్ అఘా.. బంగ్లా ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగాడు. పెవిలియన్ చేరుతూ బ్యాట్, గ్లౌజులను నేలకు కొట్టాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# ముందుంది ముసళ్ల పండుగ: గంభీర్‌కు దాదా వార్నింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** రెండు ఐసీసీ ట్రోఫీలు సాధించిన తొలి టీమిండియా కోచ్ గా గౌతమ్ గంభీర్ రికార్డు సృష్టించాడు. టీ20 వరల్డ్ కప్-2026 తో పాటు, చాంపియన్స్ ట్రోఫీ-2025 గంభీర్ ఖాతాలో పడ్డాయి. టీమ్ లో మార్పులు చేర్పులతో గందరగోళానికి గురిచేస్తున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ.. టీ20 కప్ వచ్చాక గంభీర్ మీద ఉన్న ఆరోపణలు దాదాపు తగ్గిపోయాయి. ఈ క్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఇచ్చిన వార్నింగ్ చర్చనీయాంశంగా మారింది. ముందుంది ముసళ్ల పండుగ అంటూ హెచ్చరించాడు దాదా. వైట్ బాల్ క్రికెట్ లో భాగంగా 2027 ప్రపంచ కప్ అత్యంత సవాళ్లతో కూడుకున్నదిగా గంగూలీ అభివర్ణించాడు. గంభీర్ కు అసలైన పరీక్ష 2027లో సౌతాఫ్రికాలో మొదలవుతుంది. అక్కడ పరిస్థితులు గంభీర్ ను టెస్ట్ చేస్తాయి. కానీ అతనికి ఉన్న టీమ్ తో దాన్ని సాధిస్తాడనే నమ్మకం ఉంది.. అంటూ మనీ కంట్రోల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బొరియా మజుందార్ తో అన్నాడు దాదా.

ఇండియాకు 2023 వరల్డ్ కప్ ఇప్పటికీ నోటి దాకా వచ్చి చేజారిన ముద్ద లాంటిది. ఎందుకంటే సీజన్ మొత్తం అద్భుతంగా రాణించి.. ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి చవిచూసింది. ఆ సిరీస్ లో ఇండియా గేమ్ చూసి కప్ మనకేనని ఫ్యాన్స్ భావించారు.

ఒక ప్లేయర్ గా 2011 వరల్డ్ కప్ గెలిచిన గంభీర్.. కోచ్ గా 2027 లో వరల్డ్ కప్ ఎదుర్కోవడం సవాళ్లతో కూడుకున్న విషయమేనని గంగూలీ అన్నాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి సీనియర్ అనుభవజ్ఞులు ఉండటం కలిసొచ్చే అంశంగా అభిప్రాయపడ్డాడు.


అదే విధంగా గంభీర్, అతని టీమ్ రెడ్ బాల్ క్రికెట్ లో ఇంకా ఇంప్రూవ్ కావాల్సి ఉందన్నాడు. దానికి ఏకైక మార్గం వికెట్ గురించి తక్కువగా ఆలోచించడమేనన్నాడు. గంభీర్ కు కాస్త టైమ్ ఇవ్వాలని బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ముందే చెప్పినట్లు గుర్తు చేశాడు. వైట్ బాల్ క్రికెట్ లో కోచ్ గా ప్రూవ్ చేసుకున్నాడని.. కానీ రెడ్ బాల్ క్రికెట్ లో.. అంటే టెస్టులలో మెరుగవ్వాల్సి ఉందని సలహా ఇచ్చాడు దాదా.

# ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెవిన్ పీటర్సన్ గుడ్ బై.. కామెంటరీ బాక్స్‌లో కలుసుకుందాం అంటూ కామెంట్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ ఎడిషన్ ప్రారంభానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ఫ్రాంచైజీకి వీడ్కోలు పలుకుతున్నట్టు ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ తెలిపాడు. జట్టు మెంటార్ బాధ్యతల నుంచి తాను తప్పుకుంటున్నట్లు శనివారం ప్రకటించాడు. అయితే, ఈ లీగ్ లో గతంలో మాదిరే కామెంటేటర్‌గా కొనసాగుతానని స్పష్టం చేశాడు. గతేడాది ఫిబ్రవరిలో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం పీటర్సన్‌ను మెంటార్‌గా నియమించింది. హెడ్ కోచ్ హేమాంగ్ బదానీ, అసిస్టెంట్ కోచ్ మాథ్యూ మోట్, బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ వంటి సపోర్ట్ స్టాఫ్‌తో కలిసి కేపీ పనిచేశాడు. “ఈ ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు మెంటార్‌గా కొనసాగలేను. ఈ బాధ్యతలకు అవసరమైన సమయాన్ని కేటాయించలేకపోతున్నాను. ఆటగాళ్లందరికీ శుభాకాంక్షలు. అయితే, కామెంటరీ బాక్స్‌లో మళ్లీ కలుస్తాను” అని ‘ఎక్స్’ వేదికగా పోస్ట్ చేశాడు.దక్షిణాఫ్రికాలో జన్మించిన పీటర్సన్, ఇంగ్లండ్ తరఫున 104 టెస్టులు, 136 వన్డేలు ఆడాడు. 2010 టీ20 ప్రపంచకప్‌లో ‘ప్లేయర్ ఆఫ్ ది సిరీస్’గా నిలిచి ఇంగ్లండ్‌కు తొలి ఐసీసీ ట్రోఫీని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, పుణే జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.

ఇదిలా ఉండగా,

బీసీసీఐ ఐపీఎల్ 2026 తొలి దశ షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేసింది. మార్చి 28 నుంచి ఏప్రిల్ 12 వరకు 20 మ్యాచ్‌లు జరగనున్నాయి. మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్లు తలపడనున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల కారణంగా పూర్తి షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని బీసీసీఐ తెలిపింది.



# సాంప్రదాయంగా ఆకట్టుకుంటున్న శ్రీ లీల.. ఆ ప్రత్యేకత గమనించారా?



ప్రియా ప్రకాష్ సిటీ వీధులను తన స్టైల్ ర్యాంప్‌గా మార్చుకుంది

టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల ప్రస్తుతం సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. వెండితెరపై తన డ్యాన్స్‌లతో, నటనతో కుర్రాళ్ల మతులు పోగొట్టే ఈ ‘ధమాకా’ పాప, తాజాగా పోస్ట్ చేసిన ఫోటోల్లో అచ్చమైన తెలుగింటి ఆడపడుచులా మెరిసిపోతోంది. మోడ్రన్ దుస్తుల్లో ఎంత స్టైలిష్‌గా ఉంటుందో, సంప్రదాయ చీరకట్టులో అంతకంటే రెట్టింపు అందంతో కనిపిస్తూ ఫ్యాన్స్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఆమె ధరించిన అవుట్‌ఫిట్ మరియు నగల్లోని ప్రత్యేకత ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది.

**పట్టుచీరలో మెరిసిపోతున్న ‘పెళ్లిసందడి’ బ్యూటీ:**

శ్రీలీల ఈ ఫోటోషూట్ కోసం ఎంచుకున్న అవుట్‌ఫిట్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. రిచ్ కలర్ పట్టుచీరలో ఆమె లుక్ చాలా రాయల్‌గా కనిపిస్తోంది. సాధారణంగా నేటి తరం హీరోయిన్లు మోడ్రన్ ఫ్యాషన్‌పై మక్కువ చూపుతుంటారు, కానీ శ్రీలీల మాత్రం మన సంప్రదాయ కట్టుబాట్లకు పెద్దపీట వేసింది. ఆ చీరకు మ్యాచ్ అయ్యేలా డిజైన్ చేసిన బ్లౌజ్ మరియు ఆమె కట్టుకున్న తీరు చాలా హుందాగా ఉంది. ఫొటోల్లో ఆమె చిరునవ్వు, ఆ నిండుదనానికి ఫిదా అవుతున్న నెటిజన్లు “శ్రీలీల అంటే కేవలం ఎనర్జీ మాత్రమే కాదు, అందానికి నిలువుటద్దం” అంటూ కామెంట్లు పెడుతున్నారు.

**నగల్లోనూ ప్రత్యేకతే.. ఆ ట్రెడిషనల్ టచ్ చూశారా:**

ఈ ఫోటోల్లో శ్రీలీల ధరించిన నగలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేవలం నగలు పెట్టుకోవడమే కాకుండా, మన పూర్వీకుల కాలం నాటి సంప్రదాయ డిజైన్లను ఆమె ఎంచుకోవడం విశేషం. షాట్ నెక్లెస్‌తో పాటు, దానికి తగినట్లుగా ఉన్న జుంకీలు ఆమె ముఖ వర్చస్సును పెంచేశాయి. ఇక ముఖ్యంగా నుదుట పెట్టుకున్న పెద్ద బొట్టు, తలలో పూలు ఆమెను ఒక దేవతలా మార్చేశాయి. ప్రతి నగలోనూ ఎంతో సున్నితమైన పనితనం కనిపిస్తోంది. సంప్రదాయం ఉట్టిపడేలా ఆమె ఎంచుకున్న ఈ జ్యువెలరీ సెలక్షన్ ఇప్పుడు ఫ్యాషన్ ప్రియులను కూడా విశేషంగా ఆకట్టుకుంటోంది.

**శ్రీలీల గ్రేస్ వేరే లెవల్:**

శ్రీలీల పోస్ట్ చేసిన ఈ ఫోటోలు నిమిషాల్లోనే వైరల్ అయ్యాయి. కేవలం ఫోటోలే కాకుండా, ఆమె ఇచ్చిన పోజులు మరియు కళ్ళతో పలికించిన హావభావాలు నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. గ్లామర్ షోకు దూరంగా, ఎంతో పద్ధతిగా ఉంటూనే ఇంత అందంగా కనిపించడం శ్రీలీలకు మాత్రమే సాధ్యమని ఆమె అభిమానులు మురిసిపోతున్నారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, అప్పుడప్పుడు ఇలాంటి ఫోటోషూట్లతో తనలోని క్లాసిక్ యాంగిల్‌ను బయటకు తీస్తూ అందరినీ ఆశ్చర్యపర చడం ఆమె స్టైల్. మొత్తానికి ఈ ట్రెడిషనల్ లుక్ శ్రీలీల కెరీర్‌లో బెస్ట్ ఫోటో షూట్లలో ఒకటిగా నిలిచిపోనుంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965